www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

త్వరలో ఫీజు నియంత్రణ కమిషన్

ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో దోపిడీకి అడ్డుకట్ట
పదేళ్లలో సర్కారీబడుల్లో 7.5లక్షల మంది డ్రాప్
కొత్త పాఠశాలల్ని ప్రారంభించడం కంటే పాత వాటిలో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తాం
విద్యా కమిషన్ సూచనల మేరకు సంస్కరణలు
అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహ 13

బుధవారం | 26-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 357 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.1:49 తదుపరి త్రయోదశి, నక్షత్రం: ధనిష్ఠ రా.2:30 తదుపరి శతభిషం, వర్జ్యం: ఉ.7:35-9:06, అమృతఘడియలు: సా.4:40-6:10, దుర్ముహూర్తం: ఉ.11:56-12:45, రాహుకాలం: మ. 12:00-1:30 సూర్యోదయం: 6:18, సూర్యాస్తమయం: 6:23

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'సోషల్' ఖాతాల వివరాలివ్వండి

అమెరికాలో గ్రీన్‌కార్డుదారులను ఆదేశించే యోచనలో డొనాల్డ్ ట్రంప్ సర్కారు 2
తాజా ప్రతిపాదనపై మే 5 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ
భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని విమర్శలు
విదేశాలకు వెళ్లొస్తే.. సమాధానం చెప్పాల్సిందే
సుదీర్ఘ ప్రశ్నలకు సిద్ధంగా ఉండాలని భారతీయ గ్రీన్‌కార్డు, హెచ్-1బీ వీసాదారులకు అమెరికా హెచ్చరిక



ముస్లింలకు మోదీ రంజాన్ తోఫా

పండగ రోజుల్లో దుస్తులు సహా ఆహార పదార్థాల కిట్ అందజేత
రంజాన్‌లో 32 లక్షల మంది ముస్లింలకు బహుమతి
బీజేపీ నూతన కార్యక్రమం
బిహార్ ఎన్నికల కోసమేనని విపక్షాల విమర్శ 2


మంగళవారం ఢిల్లీలో 'సౌగత్ ఎ మోదీ' కిట్లను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

హైదరాబాద్‌లో మినీ ఫుడ్ ల్యాబ్స్

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆహార నాణ్యత ప్రయోగశాలలు 12
గ్రేటర్ పరిధిలో ప్రతి జోన్‌కు ఒకటి
ప్రజలే ఆహార నమూనాలను తీసుకెళ్లి పరీక్షలు చేయించేలా ఏర్పాట్లు
జీహెచ్ఎంసీ అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సమీక్ష



ఫిరాయింపులపై గత తీర్పులను ఎలా మార్చగలం?

ఎప్పటిలోగా తేల్చాలన్నదానిపై రాజ్యాంగ ధర్మాసనాలు స్పష్టంగా చెప్పలేదు


వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలం?
సభాపతికి ఆదేశాలివ్వొచ్చా.. అనే దానిపైనే వాదనలు
పార్టీ ఫిరాయించిన వ్యక్తి ఎక్కడ పోటీ చేశారనేది స్పీకర్ చూసుకుంటారు
కేసులో మెరిట్స్‌లోకి వెళ్లడం లేదన్న సుప్రీంకోర్టు
ఎమ్మెల్యే అనర్హత కేసులో మరోసారి కీలక వ్యాఖ్యలు
ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా?
స్పీకర్ కార్యాలయం తాత్సారమెందుకు చేస్తోంది?
నోటీసులిచ్చేందుకు ఇంకెంత సమయం కావాలి?
ఆలస్యం చేసే వ్యూహాలు అనుసరించవద్దు: ధర్మాసనం
పిటిషనర్ల తరఫు వాదనలు పూర్తి
ఏప్రిల్ 2న స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వింటామన్న సర్వోన్నత న్యాయస్థానం



రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంది. ఒక వేళ అది జరగడం లేదని భావిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించడానికి రాజ్యాంగం అవకాశం కల్పించింది. అలాంటి సందర్భంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చు.
- జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాము కేసులో మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని, క్వశ్చన్ ఆఫ్ లా వరకే పరిశీలిస్తున్నామని పేర్కొంది. స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చా? లేదా? అనే అంశంపైనే వాదనలు వింటున్నామని చెప్పింది. అంతేకాకుండా.. ఇలాంటి వ్యవహారాల్లో రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని, ఫిరాయింపులపై ఎప్పటిలోగా తేల్చాలన్న అంశంపై గత తీర్పులు స్పష్టంగా చెప్పలేదని తెలిపింది. అలాంటప్పుడు ఆ తీర్పులను కాదని ఎలా ముందుకెళ్లగలమని, ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలని ప్రశ్నించింది. ఇక ఫిరాయించిన వ్యక్తి లోక్‌సభ, అసెంబ్లీ, జిల్లా పరిషత్‌కు పోటీ చేశారా? అనేది తాము పట్టించుకోబోమని, ఆ అంశాన్ని స్పీకర్ చూసుకుంటారని తెలిపింది. అదే సమయంలో.. ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడానికి స్పీకర్ కార్యాలయం ఎందుకు తాత్సారం చేస్తోందని ప్రశ్నించింది. ఆలస్యం చేసే ఎత్తుగడలు అనుసరించొద్దని వ్యాఖ్యానించింది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాల్సిందిగా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ జనవరి 15న సుప్రీంకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. కాగా, ఈ అంశంలో గత విచారణ సందర్భంగా ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయమంటే ఎంత? అంటూ అసహనం వ్యక్తం చేసింది. మార్చి 22లోపు

మిగతా 13వ పేజీలో...



న్యాయనియామకాలపై ఏం చేద్దాం?

అఖిల పక్ష భేటీలో రాజ్యసభ చైర్మన్
ముందు మీ ప్రతిపాదనలు చెప్పండి
ఆ తర్వాతే మేం చెప్తాం: విపక్షాలు
సభలో కాకుండా ఛాంబర్లో చర్చ జరపడం ఏమిటి: టీఎంసీ
మళ్లీ ఎన్‌జేఏసీపై కేంద్రం దృష్టి?
జస్టిస్ వర్మ ఇంటికి త్రిసభ్య కమిటీ
30-35 నిమిషాలపాటు నివాస ప్రాంగణంలో పరిశీలన
అలహాబాద్ హైకోర్టు లాయర్ల నిరవధిక సమ్మె ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ప్రాంగణంలో నోట్ల కట్టల వ్యవహారం నేపథ్యంలో.. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మంగళవారం తన చాంబర్‌లో అఖిలపక్ష భేటీ జరిపారు. న్యాయ నియామకాల అంశంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఆయన ఈ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత మాట్లాడిన ధన్‌ఖడ్.. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు 2015లో కొట్టివేయడంపై తన వ్యతిరేకతను మరోమారు ఘాటుగా వ్యక్తపరిచినట్లు సమాచారం. ఎన్‌జేఏసీ చట్టం కొట్టివేతను

మిగతా 2వ పేజీలో...

ఉగాదికి కొత్త మంత్రులు!

పండుగ రోజు ప్రమాణ స్వీకారం!.. నలుగురు లేదా ఐదుగురికి అవకాశం

ఎస్సీ, బీసీ, రెడ్డి, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి క్యాబినెట్ విస్తరణలో చోటు
రాజగోపాల్‌రెడ్డికి స్థానంపై తర్జన భర్జన
బీసీల్లో తెరపైకి మున్నూరుకాపు సామాజికవర్గం
ఎస్సీల్లో వివేక్ వెంకటస్వామికే అవకాశం
మైనారిటీల్లో ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్‌కు చాన్స్!
ఒకట్రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్న అధిష్ఠానం
నాకు చాన్స్ వస్తుందనుకుంటున్నా: రాజగోపాల్



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గర పడింది. ఉగాది పండుగ రోజున.. కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విస్తరణలోనూ పూర్తిస్థాయి మంత్రిమండలి ఏర్పడే అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి సహా 12 మంది ఉన్న విషయం తెలిసిందే. పూర్తిస్థాయి క్యాబినెట్లోకి మరో ఆరుగురిని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే సామాజిక, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. ఈ విస్తరణలో ఒకటి, లేదా రెండు బెర్తులను పెండింగ్‌లో పెట్టనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. క్యాబినెట్ విస్తరణలో ఎవరికి అవకాశం దక్కనుందనే విషయంపై అధిష్ఠానం ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనుంది. ఉగాది వరకు మంచి రోజులు లేవని, ఈ నేపథ్యంలో ఉగాది రోజు కొత్త మంత్రులు ప్రమాణం చేయనున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆ రోజు కుదరని పక్షంలో.. తర్వాతి రోజు ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతున్నాయి. కాగా, మంత్రివర్గ విస్తరణలో ఓసీ(రెడ్డి), బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు ఒక్కో బెర్తును కేటాయించాలని సోమవారం ఢిల్లీలో అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జరిపిన చర్చల్లో ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎస్సీకి సంబంధించి మాల సామాజికవర్గానికి చెందిన గడ్డం వివేక్ వెంకటస్వామి పేరే దాదాపు ఖరారైనట్లు చెబుతున్నారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు మంత్రివర్గంలో చోటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివేక్ వెంకటస్వామికి చోటు కల్పిస్తే

మిగతా 13వ పేజీలో...

మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ!

మంత్రివర్గ విస్తరణ, పీసీసీ పదవులపై చర్చ 13
ఏఐసీసీ చీఫ్‌తో భేటీ అనంతరం హైదరాబాద్‌కు ప్రయాణం


మనోజ్ కుమార్ (ఫైల్) 12

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం

మృతుడు జయప్రకాశ్ అసోసియేట్స్ ఇంజనీర్ మనోజ్ కుమార్‌గా గుర్తింపు
స్వస్థలం యూపీలోని బాంగర్‌మవూ
రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత
ప్రమాదం మల్లెల తీర్థం వల్లే!
టన్నెల్ నుంచి 20 కి.మీ లోపే జలపాతం
సొరంగంలోకి సీపేజీగా వస్తున్న నీరు
ఉదరభాగంలో ఒకేచోటికి చేరిన నీరు
ఒత్తిడి పెరిగి టన్నెల్‌లోకి రావడంతోనే ప్రమాదం అంటున్న నిపుణులు 12

ఓఆర్ఆర్‌ని అమ్ముకున్నోళ్లు.. ఆర్ఆర్ఆర్‌పై విమర్శలా?

ఆ అర్హత బీఆర్ఎస్‌కు లేదు: కోమటిరెడ్డి
ఆర్ఆర్ఆర్‌కు 2017లోనే జాతీయ హైవే నంబరు వచ్చిందని వెల్లడి
ఇప్పటిదాకా రాలేదన్న ప్రశాంత్‌రెడ్డి
రేషన్ షాపుల్లోనూ మద్యం అమ్మిన చరిత్ర మీది 13
బీఆర్ఎస్ నేతలపై శ్రీధర్‌బాబు ఆగ్రహం

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు యువకుడి బలి

మూడేళ్లలో రూ.3 లక్షల వరకు పోగొట్టుకున్న వైనం
సోమవారం ఐపీఎల్ మ్యాచ్‌లోనూ 2 లక్షలు నష్టం
మనోవేదనతో రైలు కింద పడి సోమేశ్వర్ ఆత్మహత్య
మెదక్ జిల్లా గుండ్లపోచంపల్లిలో ఘటన


సోమేశ్వర్‌రావు(ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/మేడ్చల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు బానిసైన ఓ యువకుడు అందులో డబ్బులు పోగొట్టుకొని తీవ్ర మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ అనకాపల్లికి చెందిన సోమేశ్వర్‌రావు (27) కుటుంబం మేడ్చల్ గుండ్లపోచంపల్లిలో స్థిరపడింది. సోమేశ్వర్‌రావు ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడిన అతను వచ్చిన సంపాదనంతా దాంట్లోనే పెట్టేవాడు. అలా మూడేళ్ల కాలంలో రూ. 3 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. సోమవారం ఢిల్లీ- లఖ్‌నవూ మధ్య జరిగిన

మిగతా 14వ పేజీలో...

బెట్టింగ్ కేసులు సీఐడీకి!

నిర్వాహకుల్లో విదేశీయులే ఎక్కువ
ప్రమోటర్లకు హవాలా ద్వారా డబ్బు
సీఎం సమీక్ష నిర్వహించే చాన్స్!
ఇప్పటికే రంగంలోకి ఈడీ, సీఎస్‌బీ
మియాపూర్ కేసులో రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ?
కేసులను కొట్టివేయండి 14
హైకోర్టులో విష్ణుప్రియ వ్యాజ్యాలు
విచారణకు రాని విష్ణుప్రియ, రీతూ



రూ.50 వేల యూనిట్‌కు పూర్తి రాయితీ

రూ.2 లక్షలకు పైన యూనిట్లకు 70 శాతం
5వరకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ
జూన్ 2న ఎంపికైన అభ్యర్థులకు పత్రాలు
రేషన్‌కార్డు లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం
గరిష్ఠ వయోపరిమితి 55 ఏళ్లు.. రైతులకు 60 ఏళ్లు
ఐదేళ్ల కాలానికి కుటుంబంలో ఒకరికి మాత్రమే లబ్ధి
పథకానికి మార్గదర్శకాల ఉత్తర్వులు జారీ


హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి మరో ముందడుగు పడింది. లబ్ధిదారుల అర్హతలు, వయో పరిమితి, వార్షికాదాయ పరిమితి, యూనిట్లకు ఇచ్చే రాయితీలు, దరఖాస్తు ప్రక్రియ, ఎంపిక విధానం వంటి అంశాలపై మార్గదర్శకాలను పేర్కొంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. రూ.50 వేలలోపు

మిగతా 12వ పేజీలో...

కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు రూ.18.45 కోట్లు!

ఎనిమిదేళ్లలో గత ప్రభుత్వం చేసిన ఖర్చు ఇది

2016 నుంచి 2023 డిసెంబరు 3 వరకు టూర్లు
అమెరికా, స్విట్జర్లాండ్, యూకే పర్యటనలకు వెళ్లిన నాటి డిజిటల్ మీడియా డైరెక్టర్
ఆర్‌టీఐ దరఖాస్తుకు వివరాలు వెల్లడించిన ఐటీ శాఖ



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా పని చేసిన కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు భారీగా ఖర్చు చేశారు! ఆయన పర్యటనల కోసం గత ప్రభుత్వం ఏకంగా రూ.18.45 కోట్లు వెచ్చించడం గమనార్హం! సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద ఓ కార్యకర్త వివరాలు అడగడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో చెప్పాలని కోరగా.. ఐటీ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఎనిమిదేళ్లలో ఆయన ఏటా విదేశీ పర్యటనలకు వెళ్లారని.. అందుకు రూ.18,45,07,520 ఖర్చయినట్లు వివరించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ 2014లో కొణతం దిలీప్‌ను రాష్ట్ర డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా నియమించారు. అప్పటి నుంచి 2023 డిసెంబరు వరకు ఆయనా పదవిలో

మిగతా 12వ పేజీలో...


కాకినాడలో నౌకలో బియ్యం బస్తాలను లోడ్ చేస్తున్న దృశ్యం

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

కాకినాడ ఓడ రేవుకు చేరిన బియ్యం బస్తాలు 14
తొలుత 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి
4-5 రోజుల్లో ఫిలిప్పీన్స్‌కు బయలుదేరనున్న నౌక

దొడ్డు బియ్యం వేలం?

సన్నబియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యంలో సర్కారు ఆలోచన
8.40 లక్షల టన్నుల నిల్వలు
ముగిసిన మార్చి కోటా పంపిణీ
మిగిలిన దొడ్డు బియ్యం సీజ్ చేయాలని ఆదేశాలు 13



ఏటీఎం నుంచి పీఎఫ్ సొమ్ము

జూన్ నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చు
యూపీఐ ద్వారా పీఎఫ్ ఖాతాలోని నిల్వను చూసుకునే అవకాశం 2
కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా

నిమ్స్‌లో తొలి రోబోటిక్ కిడ్నీ మార్పిడి

దక్షిణాదిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇదే మొదటిది!
అరుదైన ఘనతను సాధించిన నిమ్స్ వైద్యులు
వారిని అభినందించిన మంత్రి దామోదర
నిమ్స్ ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలు 14

పైరేట్ల చెరలో ఏడుగురు భారతీయులు

» పశ్చిమ ఆఫ్రికా తీరంలో నౌకలోకి చొరబడి కిడ్నాప్

న్యూఢిల్లీ, మార్చి 25: పశ్చిమ ఆఫ్రికా తీరంలో ఏడుగురు భారతీయులను సముద్రపు దొంగలు(పైరేట్లు) కిడ్నాప్ చేశారు. కామెరూన్‌లోని డౌలాకు వెళ్లే మార్గంలో 'బిటుమెన్ రివర్' అనే నౌకలో నావికులుగా ఉన్న వీరిని సముద్రపు దొంగలు అదుపులోకి తీసుకున్నారు. పనామాకు చెందిన ఈ నౌకను రూబిస్ అసాల్ట్ అనే సంస్థ నిర్వహిస్తోంది. కిడ్నాప్ అయిన వారిలో తమిళనాడులోని తేనీకి చెందిన లక్ష్మణ్ ప్రదీప్ మురుగన్, కరూర్‌కు చెందిన సతీశ్ కుమార్ సెల్వరాజ్, కేరళకు చెందిన రాజేంద్రన్ భార్గవన్, బిహార్‌కు చెందిన సందీప్ కుమార్ సింగ్‌తోపాటు రొమేనియాలో ఉంటున్న ముగ్గురు భారతీయులు ఉన్నారు. భద్రతా నివేదికల ప్రకారం ముగ్గురు వ్యక్తులు నౌకలోకి ఎక్కి కాల్పులు జరిపారని తెలిసింది. అయితే సముద్రపు దొంగలు నౌక నుంచి దిగిపోయారని రూబిస్ అసాల్ట్ సంస్థ సెక్యూరిటీ ఆఫీసర్ వెల్లడించారు. కాగా, సముద్రపు దొంగల చెరలో ఉన్న 35 ఏళ్ల రాజేంద్రన్ భార్గవన్‌ను సురక్షితంగా విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అతని భార్య వాణి ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రికి లేఖ రాశారు.

మరో ప్రాంతానికి తిహాడ్ జైలు తరలింపు

న్యూఢిల్లీ, మార్చి 25: తిహాడ్ జైలును నగర శివారు ప్రాంతాలకు తరలించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ. 10 కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం రేఖాగుప్తా మంగళవారం అసెంబ్లీలో ప్రకటించారు. 1958లో స్థాపించిన ఈ జైలు దేశంలోనే అతి పెద్ద జైలు సముదాయాలలో ఒకటి. సుమారు 400 ఎకరాలలో విస్తరించిన ఈ జైలు దక్షిణ ఢిల్లీలోని జనావాస ప్రాంతాలైన తిలక్‌నగర్, హరినగర్ ప్రాంతాలకు సమీపంలో ఉంది. దాదాపు 10 వేల మంది ఖైదీలను ఉంచే ఏర్పాట్లు ఈ జైలులో ఉన్నాయి. కానీ ప్రస్తుతం 19 వేల మంది ఖైదీలతో కిక్కిరిసిపోయింది. దీంతో జైల్లో భద్రతాసమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావించింది. అందుకే నరేలాలో కొత్త జైలును నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉపాధి నిధుల విడుదలలో వివక్ష లేదు

» యూపీ కంటే తమిళనాడుకే అధిక నిధులు: పెమ్మసాని

న్యూఢిల్లీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపడం లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. నిధుల విడుదలలో తమిళనాడు అయినా, పశ్చిమ బెంగాల్ అయినా తమ ప్రభుత్వం పక్షపాతం చూపబోదని తెలిపారు. ఉత్తరప్రదేశ్ కంటే తమిళనాడుకు అధికంగా ఉపాధి హామీ పథకం కింద నిధులు ఇచ్చామని చెప్పారు. తమిళనాడుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.7,300 కోట్ల నిధులు వచ్చాయన్నారు. మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు ఉపాధి హామీ నిధుల విడుదలలో వివక్ష చూపుతున్నారని ప్రశ్నించగా కేంద్ర మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. "తమిళనాడు జనాభా 7 కోట్లు, ఉత్తరప్రదేశ్ జనాభా 20 కోట్లకుపైగానే ఉంది. కానీ, ఉపాధి నిధుల్లో తమిళనాడుకే ఎక్కువగా ఇస్తున్నాం. తమిళనాడుకు రూ.10 వేల కోట్లు ఇస్తుండగా, యూపీకి రూ.10 వేల కోట్ల లోపే ఇస్తున్నాం" అని వివరించారు.

ప్రసాదంపై జీఎస్టీ ఉండదు: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 25: దేవాలయాల్లో, ఇతర ప్రార్థన మందిరాల్లో విక్రయించే ప్రసాదాలపై ఎలాంటి జీఎస్టీ ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆమె లోక్‌సభలో 'ఆర్థిక బిల్లు-2025'పై ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేస్తూ.. ప్రసాదంపై జీఎస్టీ ఉండదని, అదేవిధంగా ఆన్‌లైన్ ప్రకటనలపై డిజిటల్ పన్నును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జీఎస్టీపై అపోహలు నెలకొంటున్న క్రమంలో ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. గతంలోనూ ప్రార్థన మందిరాల్లో నిర్వహించే అన్నదానంపై జీఎస్టీ ఉండదని ఆమె ప్రకటించిన విషయం తెలిసిందే..! 2017లో జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాల్లోనూ ప్రసాదాలపై జీఎస్టీ ఉండదని, అయితే.. వాటి తయారీకి వినియోగించే ముడిపదార్థాలు– పంచదార, నెయ్యి వంటి వాటిపై యథావిధిగా పన్ను ఉంటుందని పేర్కొన్న విషయం తెలిసిందే..! కాగా.. బడ్జెట్(ఆర్థిక బిల్లు-2025)ను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. రాజ్యసభ కూడా దీన్ని ఆమోదిస్తే.. 2025-26 బడ్జెట్ ప్రక్రియ పూర్తవుతుంది.

'జమిలి' జేపీసీ కాలపరిమితి పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 25: ఒక దేశ- ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులపై అధ్యయనానికి ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) కాల పరిమితిని లోక్‌సభ పొడిగించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఆఖరి వారం మొదటి రోజు వరకు పొడిగించింది. జేపీసీ చైర్‌పర్సన్ పీపీ చౌదరీ.. సోమవారం సభలో ఈ మేరకు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు మూజువాణి ఓటు ద్వారా ఆమోదం తెలిపారు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి రాజీనామా చేసిన నేపథ్యంలో రాజ్యసభ నుంచి మరో సభ్యుడిని జేపీపీలో చేర్చినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ వెల్లడించారు. ఒకే దేశం- ఒకే ఎన్నిక జేపీపీ గత శీతాకాల సమావేశాల్లో 39 సభ్యులతో ఏర్పాటైంది. దీని కాల పరిమితి వచ్చేనెల 4తో ముగియనుండగా లోక్‌సభ పొడిగించింది.

కేంద్ర మంత్రి రిజిజుపై సభా హక్కుల నోటీసు

న్యూఢిల్లీ, మార్చి 25: సభను తప్పుదోవ పట్టించారన్న ఆరోపణతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశ పెడుతామంటూ కాంగ్రెస్ పార్టీ నోటీసు అందజేసింది. కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ మంగళవారం స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు అందజేశారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాజ్యాంగాన్ని మార్చుతామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ వ్యాఖ్యానించారంటూ సోమవారం లోక్‌సభలో అసత్యం చెప్పిన రిజుజు సభ్యులను తప్పుదోవపట్టించారని ఆరోపించారు. ఇది సభా హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. శివకుమార్ పేరు ప్రస్తావించకుండానే రాజ్యాంగ పదవిలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు రాజ్యాంగాన్ని మార్చుతామని చెప్పారని మంత్రి సభలో ప్రస్తావించారు. ఇలా తప్పుడు ప్రకటన చేయడం సభా హక్కుల ఉల్లంఘనేనని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయ నియామకాలపై ఏం చేద్దాం!



ధన్‌ఖడ్ నిర్వహించిన అఖిలపక్ష భేటీలో వివిధ పార్టీల నేతలు

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్నుంచీ ఆయన పలుమార్లు బాహాటంగానే వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో సూచించాలని అఖిలపక్ష భేటీకి హాజరైన నేతలను కోరినట్లు తెలిసింది. అయితే, న్యాయనియామకాలపై ప్రభుత్వం తన ప్రతిపాదనలను స్పష్టంగా తెలియజేయాలని.. అప్పుడే తమ వైఖరిని తెలియజేస్తామని ప్రతిపక్షాలు తెలిపాయి. న్యాయవ్యవస్థలో నియామకాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న విషయంలో తమకు సందేహం లేదని కాంగ్రెస్‌తో సహా పలు పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరి జాతీయ న్యాయనియామకాల కమిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తే ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలేమిటో (రోడ్ మ్యాప్) కూడా చెప్పాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతానికైతే న్యాయ నియామకాలు పారదర్శకంగా జరగడం లేదని, ఇందుకు ప్రత్యామ్నాయం అవసరమని కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఉన్నత న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం లభించడం లేదని, రిజర్వేషన్ పద్ధతే లేదని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయ వ్యవస్థపై ప్రభుత్వం ప్రతిపాదనలతో ముందుకు వచ్చినప్పుడే తాము తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పగలమని ఆయన అన్నారు. అదే సమయంలో న్యాయవ్యవస్థకు ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్ నేత సుఖేందు శేఖర్ రాయ్ కూడా.. ఎన్‌జేఏసీ వంటి యంత్రాంగంపై ప్రభుత్వ వైఖరి చెప్పినప్పుడే తాము స్పందిస్తామని స్పష్టం చేశారు. ఇక.. న్యాయనియామకాల విషయంపై ఎన్డీఏ సహచరులతో చర్చించి తాము ఒక నిర్ణయానికి వస్తామని సభా పక్ష నేత, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా చెప్పారు. ఈలోపు ఆయా పార్టీలు తమ నాయకత్వంతో చర్చించి స్పష్టతకు రావాలని ఆయన సూచించారు. మరోవైపు.. ఎలాంటి ఏకాభిప్రాయమూ లేకుండానే ఈ భేటీ ముగిసిందని శివసేన (ఉద్ధవ్‌ఠాక్రే వర్గం) ఎంపీ ప్రియాంక చతుర్వేది తెలిపారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. బహుశా వచ్చేవారం సభలో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉందన్నారు. రాజ్యసభ చైర్మన్ ఈ అంశంపై ఫ్లోర్ లీడర్లతో విడివిడిగా సమావేశమై చర్చిస్తారని తెలిపారు. కాగా.. ఈ అంశంపై సభలో చర్చించాలి తప్ప, చాంబర్‌లో కాదని.. సమస్యలపై చర్చకు ఒక పద్ధతి ఉందని.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అఖిల పక్ష భేటీలో వ్యాఖ్యానించినట్లు సమాచారం. 'ఓటర్ ఐడీ కార్డులపై చర్చకు ఏఐటీసీ ఒక నోటీసు ఇచ్చింది. అది 10 రోజులుగా జాబితాలో చేరలేదు. మేం చాలా ఓపిక పడుతున్నాం. కానీ, ఈ ప్రభుత్వం పార్లమెంటును అవమానిస్తోంది. ఇలాంటి అంశాలన్నింటినీ సభలో చర్చించాలి తప్ప వేరేచోట కాదు" అని ఒక నేత ఘాటుగా వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

సభలో నోటీసు తిరస్కరణ

అఖిల పక్ష భేటీకి ముందు.. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో నోట్ల కట్టల ఉదంతంపై చర్చకు రాజ్యసభ సభ్యుడు, ఐయూఎంఎల్ నేత హారీస్ బీరన్ 267 నిబంధన కింద సభలో ఇచ్చిన నోటీసును జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. జరిగిన ఉదంతం తనకు ఆందోళన కలిగించిందని.. న్యాయవ్యవస్థలో ఉన్న లొసుగులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని ఆయన పేర్కొన్నారు. న్యాయనియమకాల విషయంలో ప్రక్షాళనకు రూపొందించిన ఎన్‌జేఏసీ చట్టాన్ని కోర్టు కొట్టివేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ చరిత్రాత్మక చట్టానికి అసాధారణ రీతిలో ఏకాభిప్రాయం లభించిందని.. అదే అమలులోకి వస్తే పరిస్థితులు వేరేగా ఉండేవని ఆయన వ్యాఖ్యానించారు. అసలు ఒక రాజ్యాంగ సవరణను న్యాయపరంగా సమీక్షించే అధికారం ఎవరికీ లేదని అభిప్రాయపడ్డారు.

విచారణ షురూ..

నోట్లకట్టల వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ మంగళవారం ఉదయం జస్టిస్ వర్మ నివాసానికి వెళ్లి విచారణ ప్రారంభించింది. కమిటీ సభ్యులు జస్టిస్ శీల్‌నాగ్, జస్టిస్ సంధవాలియా, జస్టిస్ అను శివరామన్.. అక్కడ 30-35 నిమిషాలపాటు ఉండి జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణాన్ని, అక్కడ అగ్నిప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌ను నిశితంగా పరిశీలించారు. మధ్యాహ్నం సమయానికి అక్కణ్నుంచీ వెళ్లిపోయారు. ఆ సమయంలో జస్టిస్ వర్మ ఇంట్లో ఉన్నారా లేరా అనే విషయం తెలియరాలేదు. మరోవైపు.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న సుప్రీం సిఫారసును వ్యతిరేకిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయవాదులు మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. తమ నిరసన ఏ న్యాయస్థానానికీ, న్యాయమూర్తికీ వ్యతిరేకం కాదని.. న్యాయవ్యవస్థను వంచించినవారికి వ్యతిరేకంగానే తాము సమ్మె చేస్తున్నామని అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ తెలిపారు. అవినీతికి పాల్పడ్డవారిపై, పారదర్శకత లేని వ్యవస్థపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "(జస్టిస్ వర్మ) బదిలీ ఉత్తర్వును పునఃపరిశీలించి, ఉపసంహరించుకోవాలన్నదే మా ప్రధాన డిమాండ్" అని ఆయన పేర్కొన్నారు.



జస్టిస్ వర్మ నివాసంలో హిమాచల్ హైకోర్టు సీజే జస్టిస్ జీఎస్ సంధవాలియా

మరోసారి ఎన్‌జేఏసీపై కేంద్రం దృష్టి?

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు లభించడం, దీనిపై దేశవ్యాప్తంగా సామాన్యుల్లో సైతం ఆగ్రహం వ్యక్తం కావడం వంటి పరిణామాలను అవకాశంగా తీసుకుని.. మోదీ ప్రభుత్వం జాతీయ న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)పై మరోసారి చట్టం చేసే అవకాశాలున్నాయా? జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఈ ప్రశ్నకు రాజకీయ నిపుణులు ఔననే సమాధానమే ఇస్తున్నారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష భేటీ అందులో భాగమేనని వారు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఎన్‌జేఏసీని తిరస్కరించిన సుప్రీంకోర్టు ప్రస్తుత పరిస్థితుల్లో అలా వ్యతిరేకించే అవకాశాలు లేవని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ తాము అలాంటి బిల్లును ప్రవేశపెడితే.. గతంలో లభించిన విధంగానే ఈసారి కూడా దానికి కాంగ్రెస్‌తో సహా అన్ని పక్షాలు ఏకగ్రీవ ఆమోదం లభిస్తుందని మోదీ ప్రభుత్వం విశ్వాసంతో ఉన్నది. ఈ విషయంలో ప్రభుత్వం తన ప్రతిపాదన ఏమిటో స్పష్టంగా చెబితే.. తామూ తమ వైఖరి చెప్తామని ప్రతిపక్షాలు అఖిలపక్ష భేటీలో పేర్కొనడమే ఇందుకు నిదర్శనమని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

లోకం తీరు



అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ

» బాలిక పైజామా తాడు లాగడం, ఛాతీపై చేయివేయడం, రేప్ కాదన్న నిర్ణయంపై అభ్యంతరాలు

న్యూఢిల్లీ, మార్చి 25: బాలిక ఛాతీపై చేయి వేసి వక్షోజాలను లాగడం, ఆమె ధరించిన పైజామా తాడును లాగి తెంపివేయడం రేప్ కిందికి రాదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై సుమోటోగా విచారణ జరపనున్నట్టు మంగళవారం ప్రకటించింది. ఇలాంటి చర్యలు అత్యాచారం కిందికి రావని, కానీ అత్యాచారయత్నంగా పరిగణించవచ్చని పేర్కొంటూ హైకోర్టు ఈ నెల 17న తీర్పు ఇచ్చింది. బలప్రయోగం చేసి వస్త్రాలను లాగడం, నగ్నంగా ఉండాలంటూ బెదిరించడం అన్న నేరాల కిందకు వస్తుందని తెలిపింది. అందువల్ల ఐపీసీలోని సెక్షన్ 354(బీ) కింద కేసు నమోదు చేస్తే సరిపోతుందని, రేప్‌కు వర్తించే సెక్షన్లు అవసరం లేదని తెలిపింది. ఈ తీర్పుపై విమర్శలు రావడంతో సుమోటోగా విచారణ జరపాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టైన్ జార్జి మాసిహ్ ధర్మాసనం నిర్ణయించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు కాగా దాన్ని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ప్రసన్న బి వరాలే ధర్మాసనం తిరస్కరించడం గమనార్హం. 2021 జనవరి పదో తేదీన పవన్, ఆకాశ్ 14ఏళ్ల బాలికను ఓ కల్వర్టు కిందకు లాక్కెళ్లారు. పవన్ ఆమె ఛాతీభాగంపై చేయివేయగా, ఆకాశ్ ఆమె పైజామా తాడును లాగాడు. అప్పుడే ఎవరో రావడం చూసి వారు పారిపోయారు. ఈ కేసులో పోలీసులు నిందితులపై సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 కింద కేసు పెట్టారు. అయితే, తాము చేసిన నేరాన్ని బట్టి చూస్తే ఇవి కఠిన శిక్షలు పడే సెక్షన్లు కావడంతో వాటిని తగ్గించాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన జస్టిస్ రామ్ వాని వాదనతో ఏకీభవించారు.

తమిళనాట 'ఈడీ' రగడ!

టాస్మాక్ కేసు విచారణ నుంచి తప్పుకున్న జడ్జిలు

చెన్నై, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తమిళనాట మద్యం విక్రయాల కోసం ఏర్పాటైన 'తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్(టాస్మాక్)కు సంబంధించిన కేసు విచారణ నుంచి ఇద్దరు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు వైదొలిగారు. చెన్నై 'టాస్మాక్' ప్రధాన కార్యాలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఈడీ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. తనిఖీలు పూర్తయ్యాక మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో సుమారు రూ.వెయ్యి కోట్ల మేర అవినీతి జరిగినట్లు గుర్తించామని ఈడీ పేర్కొంది. అయితే, ఈడీ చర్యల్ని సవాల్ చేస్తూ టాస్మాక్ ఎండీ సహా ప్రభుత్వం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 20న న్యాయమూర్తులు జస్టిస్ రమేశ్, జస్టిస్ సెంథిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడీ వ్యవహారాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే టాస్మాక్ ఉద్యోగులను గంటల తరబడి కార్యాలయంలో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలను ఈడీ అధికారులు తోసిపుచ్చారు. తాము ఉద్యోగులను నిర్బంధించలేదన్నారు. మద్యం అమ్మకాల లైసెన్సు మంజూరులోనే భారీ ఎత్తున అవినీతి, కుట్ర ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి ఈ పిటిషన్ ధర్మాసనం ముందు విచారణకు రాగా.. తాము ఈ కేసు విచారణ నుంచి వైదొలగుతున్నట్లు జస్టిస్ రమేశ్, జస్టిస్‌సెంథిల్‌కుమార్ తెలిపారు. "టాస్మాక్ విషయంపై మేం విచారించదలుచుకోలేదు. మా అంతట మేమే తప్పుకొంటున్నాం. దీనిపై మా కారణాలు మాకున్నాయి. వేరే ధర్మాసనానికి ఈ పిటిషన్‌ను బదిలీ చేసేందుకు అనువుగా పిటిషన్‌ను సీజే ముందుంచాలి" అని రిజిస్ట్రీని ఆదేశించారు.

మోదీ రంజాన్ తోఫా

పండగ రోజుల్లో దుస్తులు సహా ఆహార పదార్థాల కిట్ల అందజేత

» బిహార్ ఎన్నికల కోసమేనని విమర్శలు



న్యూఢిల్లీ, మార్చి 25: మైనార్టీలకు చేరువ కావడం కోసం బీజేపీ ఓ ప్రత్యేక మెగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'సౌగాత్ ఎ మోదీ' పేరుతో పండగ రోజుల్లో మైనార్టీలకు వివిధ వస్తువులను కానుకగా ఇవ్వాలని నిర్ణయించింది. తొలుత రంజాన్ సందర్భంగా ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో మంగళవారం వీటిని ముస్లిం మైనార్టీలకు అందజేసింది. సౌగాత్ కిట్‌లో ఆహార పదార్థాలు, సేమియా, ఖర్జూరం, డ్రైఫ్రూట్స్, పంచదార; పురుషులు, స్త్రీల కోసం అవసరమయ్యే రూ.500-600 విలువ చేసే కుర్తా-పైజామా/ సల్వార్-కమీజ్ వంటి దుస్తులు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్దికీ వివరించారు. రంజాన్ సందర్భంగా దేశం మొత్తం మీద 32 లక్షల మంది పేద ముస్లింలకు ఈ కిట్‌లను అందజేస్తామని తెలిపారు. దేశంలోని 32వేల మసీదుల సహకారంతో మైనార్టీ మోర్చాకు చెందిన 32 వేల మంది కార్యకర్తలు వీటిని పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతి మసీదు పరిధిలో 100 మంది నిరుపేద ముస్లింలను గుర్తించి ఈ గిఫ్ట్ ప్యాకెట్లను అందజేయనున్నారు. మసీదు కమిటీ సహాయంతోనే లబ్ధిదారులను గుర్తించనున్నారు. మొట్టమొదటగా ముంబయిలోని పార్టీ మైనార్టీ మోర్చా చొరవ తీసుకొని నవీ ముంబయిలో 200 మంది పేదలను గుర్తించి ఈ సౌగత్ కిట్లను అందజేసింది. అది జాతీయ కార్యక్రమంగా రూపుదిద్దుకొంది. రంజాన్‌తో పాటు గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, నౌరోజ్, నూతన సంవత్సర దినోత్సవాలు, ఇతర పర్వదినాల్లో అందజేస్తామని సిద్దికీ తెలిపారు.

ఓట్ల కోసమే సౌగత్ కిట్లు

బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే బీజేపీ ఈ పథకానికి రూపకల్పన చేసిందని విపక్షాలు ఆరోపించాయి. కాంగ్రెస్ ఎంపీ రాజీవ్ రంజన్ తన అభిప్రాయాన్ని చెబుతూ బిహార్‌లో 16-17 శాతం ముస్లింలు ఉన్నారని, కొన్ని జిల్లాలో చాలా ప్రభావం చూపుతారని అన్నారు. వారి ఓట్ల కోసమే బీజేపీ సౌగత్ కిట్లను తీసుకొచ్చిందని విమర్శించారు. బిహార్‌కు నిజంగా సౌగాత్ (బహుమతి) ఇవ్వాలనుకుంటే తొలుత వలసలు నివారించడం కోసం ఉద్యోగాలను కల్పించాల్సి ఉందని అన్నారు. శివసేన (ఠాక్రే) యువనేత ఆదిత్య ఠాక్రే సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెడుతూ బీజేపీ కపటబుద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. వారు చేసేదంతా మంచి, ఇతరులు చేసేదంతా చెడ్డ అన్న రీతిలో వ్యవహరిస్తుందని విమర్శించారు.

జూన్ నుంచి ఏటీఎం ద్వారా పీఎఫ్ తీసుకునే వెసులుబాటు

» యూపీఐ ద్వారా ఖాతాలోని నిల్వ చూసుకునే అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 25: ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాల్లోని సొమ్ము తీసుకునే ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ కేంద్ర కార్మిక శాఖ నిర్ణయం తీసుకొంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) చేసిన సిఫార్సుల మేరకు ఇకపై ఏటీఎంతోపాటు, ఫోన్ పే వంటి యూపీఐల ద్వారా కూడా విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కలిగించింది. మే చివరి వారం నుంచి గానీ, జూన్ మొదటి వారం నుంచిగానీ ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల కార్యదర్శి సుమితా దావ్రా వెల్లడించారు. తొలుత రూ.లక్ష వరకు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఉందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకోవచ్చని చెప్పారు. పీఎఫ్ ఖాతాలోని నిల్వను యూపీఐ ద్వారా చూసుకునే సౌకర్యం కూడా కల్పించినట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణం, విద్య, ఆరోగ్యం, వివాహం వంటి అవసరాల నిమిత్తం చాలా సులువుగా సొమ్మును విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని కలిగించినట్టు వివరించారు. దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే పీఎఫ్ ఖాతా నుంచి సొమ్ము విత్‌డ్రా చేసుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ ప్రక్రియను మరింత సరళతరం చేయనున్నట్టు వివరించారు. 95శాతం క్లెయిమ్‌లు ఆటోమేటెడ్ విధానంలో జరుగుతున్నాయని చెప్పారు. పెన్షనర్లు కూడా ఏ బ్యాంకు నుంచయినా సొమ్ము తీసుకునే సౌకర్యాన్ని కలిగించినట్టు తెలిపారు.

'సోషల్' ఖాతాల వివరాలివ్వండి

» గ్రీన్‌కార్డు, హెచ్-1బీ, ఎఫ్-1 వీసాదారులపై ట్రంప్ సర్కారు నిఘా



న్యూఢిల్లీ, మార్చి 25: అమెరికాలో భారతీయ వలసదారులపై ఉక్కుపాదం మోపడానికి ట్రంప్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా గ్రీన్‌కార్డుదారుల ప్రతి కదలికను నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది. ట్రంప్ సన్నిహితుడు, 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ సహకారంతో వారి సామాజిక మాధ్యమ ఖాతాలను వడపోయడం ద్వారా ప్రభుత్వాన్ని విమర్శించేవారిపై నిఘా పెట్టనుంది. మరోవైపు వలస చట్టాలకు పదును పెడుతూ ఇతర దేశాలకు వెళ్లి అమెరికాకు తిరిగొచ్చే హెచ్-1బీ వీసాదారులను విమానాశ్రయాల్లోనే అడ్డుకొని, కఠినమైన తనిఖీలతో పాటు వారిపై ప్రశ్నల వర్షం కురిపించనుంది. గ్రీన్‌కార్డు ఉన్నంత మాత్రాన అమెరికాలో శాశ్వతంగా నివసించడానికి హక్కు ఉండదని దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఇప్పటికే తీవ్ర ఆందోళన చెందుతున్న వలసదారులు... తాజాగా ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో బెంబేలెత్తుతున్నారు. అమెరికాలో నివసించే గ్రీన్‌కార్డుదారులు తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను సమర్పించాలని ట్రంప్ యంత్రాంగం త్వరలోనే ఆదేశించే అవకాశం ఉంది. ఈ మేరకు సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన పౌరులు అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసేటప్పుడే తమ సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలు వెల్లడించడం తప్పనిసరి. ఇప్పుడు అమెరికాలో నివసిస్తున్న వలసదారులకూ ఈ నిబంధనను వర్తింపజేయాలని భావిస్తున్నారు. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ... భారత్, అమెరికా రాజకీయ చర్చల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న పలువురు భారతీయులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్యవసానాలపై ఆందోళనతో రాజకీయ అంశాలపై తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితి లేకుండా పోతుందని, ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై మే 5వ తేదీ వరకూ యూఎస్‌సీఐఎస్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది.

విదేశాలకు వెళ్లొస్తే... సమాధానం చెప్పాల్సిందే

గ్రీన్‌కార్డు, హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలు కలిగిన భారతీయ వలసదారులు విదేశాలకు వెళ్లి, వచ్చే సమయంలో భద్రతాపరమైన తనిఖీలతో అప్రమత్తంగా ఉండాలని యూఎస్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ అధికారులు సూచించారు. ఈ మేరకు ట్రావెల్ రిస్క్ అడ్వైజరీ జారీ చేశారు. పాకిస్థాన్, భూటాన్, అఫ్ఘానిస్థాన్ సహా 43 దేశాల పౌరుల ప్రయాణాలను పరిమితం చేయాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ జాబితాలో భారత్ లేకపోయినా కూడా అమెరికా వెలుపల ప్రయాణాలు చేసే భారతీయులు కఠినమైన తనిఖీలతో వీసా స్టాంపింగ్‌లో జాప్యంతో పాటు విమానాశ్రయాల్లో అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఉద్యోగం, వీసా పునరుద్ధరణ కోసం బయటి దేశాలకు వెళ్లేవారు ఊహించని అడ్డంకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

'నవోదయ' ఎంట్రెన్స్ ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 25: నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. పర్వత ప్రాంతాలు మినహా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈ పరీక్షలను 'నవోదయ విద్యాలయ సమితి' 2025 జనవరి 18న నిర్వహించింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఇచ్చిన తమ రోల్‌నెంబర్, పుట్టిన తేదీ తదితర వివరాలను ఎంటర్ చేసి ఫలితాలను తెలుసుకోవచ్చు. ఖాళీలను బట్టి అడ్మిషన్ల కోసం నవోదయ విద్యాలయాల్లో రెండు వెయిటింగ్ లిస్ట్‌లను రూపొందిస్తారు. ఎంపికైనా చేరనివారు, సరైన తేదీలోగా సర్టిఫికెట్లను సమర్పించలేని వారి స్థానంలో వెయిటింగ్ వారికి అవకాశం ఇస్తారు.

కేవీ లాటరీ ఫలితాలు వచ్చాయి

కేంద్రీయవిద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల లాటరీ ఫలితాలు వెల్లడయ్యాయి. వీటికి సంబంధించి మార్చి 7నుంచి 21వరకు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుదారులు తమ పిల్లలు ఎంపికయ్యారో లేదో తెలుసుకునేందుకు కేంద్రీయ విద్యాలయ అధికారిక వెబ్‌సైట్ చూడవచ్చు. విద్యార్థుల ధ్రువపత్రాలను వెరిఫై చేశాక అడ్మిషన్ ఫైనల్ అవుతుంది.

బంగ్లాదేశ్‌లో ఆర్మీ తిరుగుబాటు?

ఢాకా, మార్చి 25: బంగ్లాదేశ్‌లో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్ర ఇబ్బందుల్లో పడినట్టు ప్రచారం జరుగుతోంది. దేశంలో తిరుగుబాటు వాతావరణం నెలకొందని పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. రాజధాని ఢాకాలోకి సైన్యం ప్రవేశించినట్లు సమాచారం. అంతేకాదు, ఆర్మీ వర్గాలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రధాని యూనస్ సర్కారుపై తిరుగుబాటుకు సిద్ధమైనట్టు సమాచారం. దేశంలో ఎమర్జెన్సీ లేదా మార్షల్ లా విధించే అవకాశం ఉందని మీడియా పేర్కొనడం గమనార్హం. 'ఇండియా టుడే' కథనం మేరకు.. ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ యూ జమాన్ నేతృత్వంలో సోమవారం ఉన్నతస్థాయి సైనికాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్మీ చీఫ్ స్పందిస్తూ.. ప్రజల్లో అశాంతి, అపనమ్మకం పెరిగిపోయిందని ఇలాంటి సమయంలో ఆర్మీ పాత్ర కీలకం కానుందని వ్యాఖ్యానించారు.

కూలి పనికెళ్లి... మృత్యు ఒడిలోకి

» అదుపుతప్పి పొలంలోకి దూసుకొచ్చిన లారీ

» భూపాలపల్లి జిల్లాలో ఇద్దరు కూలీల మృతి

టేకుమట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకురాడంతో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్ (టి) గ్రామ శివారులో మంగళవారం జరిగింది. రామకిష్టాపూర్ (టి)కు చెందిన మోకిడి సంధ్య (28), మోకిడి పూలమ్మ (45) గ్రామ శివారులోని వరి పొలంలో ఎనిమిది మంది కూలీలు పనికి ఉపక్రమిస్తుండగా, పక్కనే ఉన్న రోడ్డు మలుపు వద్ద లారీ అదుపు తప్పి దూసుకొచ్చి బోల్తా పడింది. అందులో లోడై ఉన్న పత్తి బస్తాలు ఒక్కసారిగా సంధ్య, పూలమ్మపై పడటంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

మహిళపై ఇద్దరు దుండగుల అత్యాచారం

» అడ్డుకున్న భర్తపై దాడి.. సంగారెడ్డి జిల్లాలో ఘటన

సంగారెడ్డి క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై ఇద్దరు దుండగులు అత్యాచారం చేశారు. అడ్డుకున్న ఆమె భర్తను కొట్టారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం పరిధిలో ఈ ఘటన జరిగింది. సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండలానికి చెందిన భార్యా భర్తలు మంగళవారం తెల్లవారుజామున పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల వైపు ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో కంది మండలం మామిడిపల్లి శివారులోని తిలోత్తమ గార్డెన్స్ వద్ద ఇద్దరు దుండగులు వారిని అడ్డుకున్నారు. మహిళ(30)పై అత్యాచారానికి పాల్పడ్డారు. అడ్డుకున్న ఆమె భర్తపై దాడి చేశారు. అనంతరం పరారయ్యారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు.

ఆ 400 ఎకరాలు ప్రభుత్వానివే

» కంచ గచ్చిబౌలి భూములపై మంత్రి శ్రీధర్‌బాబు

» కొంత మంది చెప్పేది అవాస్తవమని ప్రకటన

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఆ భూమిపై కొంత మంది అవాస్తవాలు చెబుతూ వార్తలు ఇస్తున్నారని చెప్పారు. భూములపై గందరగోళ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో స్పష్టత ఇస్తూ మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా శేర్‌లింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో ఉన్న 400 ఎకరాల భూమిని 2003లో అప్పటి ఏపీ ప్రభుత్వం క్రీడా సౌకర్యాల అభివృద్ధి కోసం ఐఎంజీ అకాడమీకి కేటాయించిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అయితే ఐఎంజీ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అకాడమీ ప్రాజెక్టును ప్రారంభించలేదని, దీంతో 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించి కేటాయింపులు రద్దు చేసిందన్నారు. ఐఎంజీ సంస్థ కేటాయింపు రద్దును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా.. 2024 మార్చి 7న ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దానిపై ఐఎంజీ సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించగా 2024 మే 3న ఐఎంజీ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని ఆయన వివరించారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం..

రెవెన్యూ రికార్డుల ప్రకారం శేర్‌లింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్‌లు 400 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిగా ధ్రువీకరించారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ భూమికి, అటవీ శాఖకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారన్నారు. కొత్త భూ కేటాయింపు విధానం ప్రకారం 26-6-2024న తెలంగాణ పరిశ్రమల మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ)కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులిచ్చిందని తెలిపారు. ఆ తరువాత 1-7-2024న రెవెన్యూ అధికారులు టీజీఐఐసీకి భూమిని అప్పగించారన్నారు. టీజీఐఐసీ అభివృద్ధి చేయాలని ప్రతిపాదించిన 400 ఎకరాల్లో పశువుల కుంటలు, నెమలి చెరువులు లేవన్నారు. ఈ భూమిలోని రాతి నిర్మాణాలను, పుట్టగొడుగు ఆకారపు అపురూపమైన రాయిని గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ ప్రణాళికను కూడా సిద్ధం చేసి అమలు చేయనున్నట్లు వివరించారు. టీజీఐఐసీ హైదరాబాద్ విశ్వవిద్యాలయం భూములను ఆక్రమించలేదని, నీటి వనరులను, రాతి నిర్మాణాలను తొలగించలేదని ఆయన స్పష్టం చేశారు.

వాట్సా్ప్‌లో పది ప్రశ్నపత్రం ఘటనలో
12 మంది అరెస్టు

» మరొకరు పరారీలో.. నిందితుల్లో ఇద్దరు మైనర్లు..

» నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే ప్రశ్నపత్రం వాట్సా్ప్‌లో షేర్ అయిన ఘటనలో 12 మందిని అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి వెల్లడిచారు. మొత్తం 13 మంది నిందితులను గుర్తించగా ఈనెల 23న ఆరుగురిని, మంగళవారం మరో ఆరుగురిని అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని వివరించారు. నిందితులో ఇద్దరు మైనర్లు ఉన్నారని తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21వ తేదీన నకిరేకల్‌లో పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత వాట్సాప్ గ్రూపుల్లో తెలుగు పరీక్ష ప్రశ్నపత్రం షేర్ అవ్వడం ప్రారంభమైంది. నిందితులు తమ బంధువుల పిల్లలకు ఎక్కువ మార్కులు రప్పించాలనే ఉద్దేశంతోనే పేపర్ లీకేజీకి కుట్ర పన్నారని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నిందితుల్లో ముగ్గురు పరీక్ష రోజున స్కూటీపై టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(బాలికల) పాఠశాల వద్దకు వెళ్లి, గేటు వద్ద పోలీసులు ఉండడంతో పరీక్షాకేంద్రం వెనక వైపునకు వెళ్లారని, అప్పటికే అక్కడ మరో నిందితుడు ఉన్నాడని ఆయన చెప్పారు. వారిలో రాహుల్(ఏ11) అనే నిందితుడికి పరిచయం ఉన్న అమ్మాయి పాఠశాల వెనుక గోడ వైపు ఉన్న గదిలో కిటికీ వద్ద పరీక్ష రాస్తుండడంతో రాహుల్ ఆమెను ప్రశ్నపత్రం చూపించమని అడగగా, ఆమె చూపించడంతో మిగిలిన నిందితుల సహాయంతో ఫొటోలు తీసుకున్నాడని తేలిందన్నారు. గోడ దిగి వెంటనే ఫొటోలను షేర్ చేసుకున్నారని ఆయన వెల్లడించారు. అందులోని ప్రశ్నలకు సమాధాలను జిరాక్స్‌లు కూడా తీయించి తమకు తెలిసిన విద్యార్థులకు ఇచ్చేందుకు నిందితులు పరీక్షా కేంద్రాలకు కూడా వెళ్లి పోలీసులకు దొరికిపోతామేమోనన్న భయంతో వెనక్కి వెళ్లిపోయారని శివరాం రెడ్డి తెలిపారు.

12 మంది అరెస్ట్.. ఒకరు పరారీలో

నిందితులు చిట్ల ఆకాశ్(ఏ1 డ్రైవర్), చిట్ల శివ(ఏ2, డీజే ఆపరేటర్), బండి శ్రీను(ఏ3), గుడుగుంట్ల శంకర్(ఏ4, ప్రైవేట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు), బ్రహ్మదేవర రవిశంకర్(ఏ5, జిరాక్స్ దుకాణం, మీసేవ నిర్వాహకుడు)లతో పాటు ఓ మైనర్ నిందితుడిని ఈనెల 23న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని శివరాం రెడ్డి చెప్పారు. మిగిలిన నిందితులు పోగుల శ్రీరాములు(ఏ6, గీత వృత్తి), తలారి అఖిల్‌కుమార్(ఏ7, ఇంటర్ విద్యార్థి), ముత్యాల వంశీ(ఏ8, డిగ్రీ విద్యార్థి), పలాస అనిల్‌కుమార్(ఏ9, గీత వృత్తి), పళ్ల మనోహర్ ప్రసాద్(ఏ10, కూలీ), మరో మైనర్‌ను మంగళవారం అరెస్టు చేశామని, రాహుల్(ఏ11) పరారీలో ఉన్నాడని ఆయన వెల్లడించారు. ఈ కేసులో ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పాక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరుపుతున్నామని డీఎస్పీ చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

తంగళ్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు.. మరో వైపు ఉపాధి లేక రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామానికి చెందిన పవర్‌లూం కార్మికుడు పరికిపెల్లి రాజు(65) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజు సోమవారం రాత్రి బాత్‌రూమ్ కడిగే యాసిడ్ తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రాజుకు భార్య పద్మ, కొడుకు రాకేశ్, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేయడంతో రాజుకు రూ.5లక్షల వరకు అప్పులయ్యాయి. కొద్ది రోజులుగా ఉపాధి లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అప్పులు భారమై.. రైతు ఆత్మహత్య

మోమిన్‌పేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అప్పులు భారమై.. జీవితంపై విరక్తితో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అమ్రాదికలాన్ గ్రామానికి చెందిన ఈర్లపల్లి కుమార్ (42)కు ఎకరా 15 గుంటల భూమి ఉండగా వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ అవసరాల కోసం, కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో చికిత్స నిమిత్తం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పుల భారం ఎక్కువై వాటిని తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం పొలంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఆనంద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీడీఎస్ పథకంలో పంపిణీ చేసే బియ్యానికిగాను క్వింటాలుకు రూ. 300 కమీషన్ ఇవ్వాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడంలో డీలర్ల పాత్ర క్రియాశీలకంగా ఉందని అన్నారు. ప్రభుత్వం డీలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఏదో ఒక నేరంలో నిందితుడో, దోషో అయినంతమాత్రాన నోటీసులు ఇవ్వకుండా, స్పందించడానికి తగినంత సమయం ఇవ్వకుండా, చట్టాలూ నిబంధనలూ పాటించకుండా నేరుగా బుల్డోజర్లతో పోయి వారి నివాసాలను నేలమట్టం చేయడం అన్యాయం, అంతకుమించి రాజ్యాంగ విరుద్ధం అని నాలుగు నెలలక్రితమే సుప్రీంకోర్టు గట్టిగా చెప్పినా, ఈ ఆదేశాలను బేఖాతరుచేసి, మళ్ళీ అదే దుర్నీతితో వ్యవహరిస్తున్న సదరు రాష్ట్రాలను, అధికారులను ఏం చేయాలి? కూల్చివేతల విషయంలో కాస్తంత మానవీయంగా ఉండండి అని సుప్రీంకోర్టు సోమవారం మళ్ళీ చెప్పింది. ఇలా పలుమార్లు చెప్పాల్సివస్తుండటం న్యాయస్థానానికి ఆగ్రహమో, అసహనమో కలిగించవచ్చును కానీ, ఒకవర్గం మీద ప్రత్యేకంగా కక్షతీర్చుకోవడానికీ, మరోవర్గం ఓట్లుపెంచుకోవడానికీ కూల్చివేతలను ఒక విధానంగా అమలుచేస్తున్న పాలకులకు సుప్రీం చీవాట్లు అవమానం కలిగించవు.

నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టిన నిర్మాణాలను నాశనం చేయాల్సిన సందర్భంలోనూ పద్ధతులు పాటించాల్సిందేనని న్యాయస్థానం అంటోంది. కానీ, ఈ బుల్‌డోజర్ న్యాయంలో జరుగుతున్నదల్లా ముందుగా ఇళ్లను కూల్చివేయడం, ఆ తరువాత వాటిని అక్రమకట్టడాలనీ, దురాక్రమణలనీ ముద్రవేయడం. బుల్‌డోజర్ బాబాగా ప్రసిద్ధిచెందిన యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలోని ఉత్తర్ ప్రదేశ్ ఈ విషయంలో, ఆయన పార్టీకి చెందిన మిగతా పాలకులకు మార్గదర్శి కూడా. మిగతా ఘనకార్యాలను పక్కనబెడితే, 2021లో ప్రయాగ్‌రాజ్‌లో యూపీ పోలీసులు అతీఖ్ అహ్మద్ అనే గ్యాంగ్‌స్టర్ పొలిటీషియన్‌ను ఎన్‌కౌంటర్ చేశారు, అతడికే చెందినవేనంటూ కొన్ని ఇళ్ళూవాకిళ్ళను కూడా అధికారులు కూల్చివేశారు. అలా కూల్చివేసినవి గ్యాంగ్‌స్టర్‌వి కావు, మావి అని ఇద్దరు వితంతువులతో సహా కొందరు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కేసుపోవడంతో, వారంతా సుప్రీంకోర్టుకు వచ్చారు.

'మహా' బుల్డోజర్

ముందురోజు రాత్రి నోటీసులు ఇచ్చి మర్నాడు ఉదయాన్నే కూల్చివేయడంలో వీసమెత్తు న్యాయమైనా ఉందా? అని ద్విసభ్యధర్మాసనం అటార్నీ జనరల్‌ను ప్రశ్నించింది. జవాబు చెప్పుకోవడానికి కూడా గడువు ఇవ్వకుండా ఇంత నిర్దయగా ఇళ్ళను కూల్చివేస్తుంటే సహించం, భరించం అంటూ ఆగ్రహించింది.

ఇక, బీజేపీ ఏలుబడిలో ఉన్న మరో రాష్ట్రం–మహారాష్ట్రలో అమలయిన బుల్‌డోజర్ న్యాయం మరీ విచిత్రమైనది. ఫిబ్రవరి 23న భారత్–పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంలో ఒక ఇంట్లోనుంచి ఒక పిల్లవాడు పాకిస్థాన్ అనుకూల, ఇండియా వ్యతిరేక నినాదాలు చేశాడంటూ కొందరు స్థానికులు ఆరోపించడంతో ఆ ఇంట్లోవారిని పోలీసులు అరెస్టుచేశారు. కొద్దిగంటల్లోనే ఆ పిల్లవాడిని వదిలిపెట్టి, తల్లిదండ్రులు ఇద్దరూ నిర్బంధంలో ఉండగానే, వారి ఇంటినీ, పాత ఇనుము–చెత్త దుకాణాన్ని అధికారులు ఆగమేఘాలమీద కూల్చివేశారు. ఈ విధ్వంసం ముగిసిన మర్నాడే దంపతులు ఇద్దరూ మేజిస్ట్రేట్ బెయిల్‌మీద బయటకు వచ్చారు. ఈ పరిణామాలన్నింటినీ న్యాయస్థానానికి విన్నవించుకుంటూ, గత ఏడాది నవంబరు 13న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ చర్యలు ఉల్లంఘిస్తున్నాయని సదరు బాధితుడు న్యాయమూర్తులకు గుర్తుచేశాడు. తన ఆస్తిని పునరుద్ధరించి, తగిన పరిహారం ఇప్పించవలసిందిగా ప్రార్థించాడు.

ఒకపక్క ఈ కేసుల్లో సుప్రీంకోర్టు నోటీసులు ఇస్తున్న క్షణాల్లోనే, నాగపూర్‌లో ఒక ఇంటిని బుల్‌డోజర్ కూల్చేసింది. మార్చి 17న జరిగిన మతహింసకు కారకుడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇంటిని మునిసిపల్ అధికారులు మార్చి 20న అక్రమ నిర్మాణమని ప్రకటించి, 24న కూల్చేశారు. నోటీసులమీద నోటీసులు ఇవ్వాలి, కనీసం పదిహేను రోజులు గడువు ఉండాలి అంటూ నవంబరులో దేశవ్యాప్తంగా వర్తించే మార్గదర్శకాలను విడుదలచేసిన సుప్రీంకోర్టు, వారంలోనే బుల్‌డోజర్ న్యాయాన్ని అమలు చేసిన కనీసం రెండుకేసుల్లో అధికారులు, పాలకులను ఎలా శిక్షిస్తుందో చూడాలి. 142వ అధికరణ ద్వారా సంక్రమించిన విశేషాధికారాలను వినియోగించుకుంటూ, గీసిన గీతదాటి దూకుడుగా వ్యవహరించే అధికారుల మీద ధిక్కరణ చర్యలు తీసుకుంటాననీ, బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని వీరి నుంచి ముక్కుపిండి వసూలు చేస్తాననీ 95 పేజీల ఆ తీర్పులో న్యాయమూర్తులు బుల్డోజర్ ఘాతుకాలను నిలువరించేందుకు చేసిన ఆ ప్రయత్నం వృథాపోకూడదు.

న్యాయవ్యవస్థ పతనానికి కారణం ఎవరు?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

మృగాలు వేటాడి తమ ఆకలిని తీర్చుకున్న తర్వాత శాంతిస్తాయి కాని అవినీతి అనే ఆకలి ఉన్న మనిషి అంత త్వరగా శాంతించడు. ఆఫీసుల్లో, రహదారుల కూడళ్లలో, ప్రార్థనా మందిరాల్లో అంతటా మనిషి మనిషిని వేటాడడం మనకు కనిపిస్తోంది. ఎన్నికల రాజకీయాల్లో కోట్ల రూపాయలు ప్రవహిస్తూనే ఉంటాయి. రాజకీయ పార్టీలకు నిధుల సమీకరణ ఎవరి ద్వారా చేయాలో బాగా తెలుసు. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి నిధుల సమీకరణకు అనేక మార్గాలు ఉంటాయి. ఎందుకంటే అన్ని వ్యవస్థలూ వారికి అనుకూలంగా పనిచేస్తాయి. హవాలా మార్గాలు దేశమంతటా విస్తృతంగా పనిచేస్తూనే ఉంటాయి. పార్లమెంట్‌లో కీలకమైన ఓటింగ్ జరిగినప్పుడు ప్రజాప్రతినిధులను ప్రలోభపరిచిన ఉదంతాలు, నిండు సభలో నోట్ల కట్టలు రెపరెపలాడిన సంఘటనలు ఎన్నో. ఈ దేశంలో పెద్ద నోట్ల రద్దు జరిగినప్పుడు కూడా డబ్బు ప్రవాహం ఆగనే లేదు. అప్పుడప్పుడూ ఆదాయపన్ను శాఖ, ఈడీ అధికారులు దాడులు చేసి కోట్ల రూపాయల నోట్ల కట్టలను ఏ మంత్రి పీఏ ఇంటిలోనో, ఏ అధికారి నివాసంలోనో పట్టుకున్నట్లు వార్తలు వస్తాయి. కాని ఇది కంటితుడుపు మాత్రమే.

భారతదేశంలో అవినీతి సర్వాంతర్యామి. 62 శాతం మంది భారతీయులు తమ పనులకోసం ఎప్పుడో ఒకప్పుడు లంచాలు చెల్లించినవారేనని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. గత ఏడాది ఈ సంస్థ ప్రకటించిన నివేదిక ప్రకారం 180 దేశాల్లో భారతదేశం అవినీతి 96వ ర్యాంకును సాధించింది. స్కూలు అడ్మిషన్ల నుంచి సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు వరకూ ఏ రంగమూ అవినీతికి మినహాయింపు కాదని, లైసెన్స్‌రాజ్ రద్దయినా ఈ దేశంలో ప్రైవేట్ రంగం అత్యధికంగా ప్రభుత్వ రంగంలో పెద్దల చుట్టూ తిరగాల్సి వస్తోందని అందరికీ తెలుసు. 'భారత దేశంలో ఏ బడా ప్రైవేట్ సంస్థ ప్రభుత్వ ప్రాపకం లేకుండా ఎదిగిందో చెప్పండి'. అని కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఒక సందర్భంలో ప్రశ్నించారు. భారతదేశంలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఎంత బలంగా వేళ్లూనికొని ఉన్నదో రాజకీయ నాయకుల కంటే ఎవరికి ఎక్కువ తెలుసు?

ఈ నేపథ్యంలో గతవారం ఢిల్లీ హై కోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో నోట్లకట్టలు దొరికాయని వార్తలు రావడం పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. న్యాయమూర్తులు సంపాదనకు అతీతులని ఈ దేశంలో ఎంతమంది విశ్వసిస్తున్నారు? న్యాయమూర్తులను ప్రలోభపెట్టి తీర్పులను అనుకూలంగా తెప్పించుకునేందుకు, లేదా కేసులను వాయిదా వేయించుకునేందుకు నిరంతర ప్రయత్నాలు చేసేవాళ్లు నిరంతరం ఎక్కడో ఒకచోట తటస్థిస్తూనే ఉంటారు. 'న్యాయమూర్తులేమీ దేవతలు కాదు, వారు కూడా ఇదే సమాజంలో భాగం' అని ప్రముఖ న్యాయవాది రాంజెత్మలానీ ఒక సందర్భంలో చెప్పారు.

న్యాయవ్యవస్థ లోపాల గురించి అనేక రచనలు వచ్చాయి. రావి శాస్త్రి న్యాయవ్యవస్థలో కుళ్లును బట్టబయలు చేశారు. 'కోర్టు అంటే ఏమిటో తెలుసా.. అదొక పెద్ద అడవి. అడవిలోకి వచ్చినవాడిదే పొరపాటు కాని మనది కాదు. అక్కడ హైనాల వంటి పెద్ద పెద్ద జంతువులుంటాయి. జాగ్రత్తగా ఉండకపోతే అవి మననే తినేస్తాయి..' అని రావి శాస్త్రి రచించిన 'మాయ' అనే కథలో న్యాయస్థానాల గురించి అభివర్ణిస్తారు. 'ప్లీడరు బాబూ సెప్తున్నా విను. ఏ మనిషీ మంచోడని ఎవరు చెప్పినా నేను నమ్మను. ఈ లోకంలో డబ్బా యాపారం తప్ప మరేటీ లేదు' అని ముత్యాలమ్మ అనే సారా అమ్ముకునే స్త్రీ ద్వారా ఆయన చెప్పిస్తారు.

న్యాయమూర్తుల్లో ఎంత శాతం మంది అవినీతి పరులో అన్న విషయంపై చాలా కాలంగా చర్చ జరుగుతూనే ఉన్నది. సుప్రీంకోర్టు, హై కోర్టు న్యాయమూర్తుల్లో 50 శాతం మంది అవినీతిపరులేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న మార్కండేయ కట్జూ కూడా ఒకప్పుడు వ్యాఖ్యానించారు. మార్కండేయ కట్జూ కూడా యశ్వంత్ వర్మ మాదిరే అలహాబాద్‌కు చెందినవారే. అలహాబాద్ హై కోర్టులో తీవ్ర అవినీతికి పాల్పడుతున్న న్యాయమూర్తుల జాబితాను తాను అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లహోటీకి ఇచ్చానని, కాని ఆయన ఏ చర్యా తీసుకోలేదని ఖట్జూ వెల్లడించారు. తాను వారి అవినీతి గురించి సాక్ష్యాధారాలతో సహా బయటపెడతానని ఖట్జూ అన్నప్పుడు అలా చేయవద్దని జస్టిస్ లహోటీ ఆయనను బతిమిలాడారు. 'దయచేసి అలా చేయకండి. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి మనమే ప్రచారం చేస్తే రాజకీయ నాయకులు దాన్ని తమకు అనువుగా వాడుకుంటారు. జాతీయ జ్యుడిషియల్ కమిషన్‌ను నియమిస్తారు.' అని జస్టిస్ లహోటీ ఆయనను అభ్యర్థించారు. అవినీతిపరులైన ఆ న్యాయమూర్తుల్లో కొందరిని బదిలీ చేసి ఊరుకున్నారు. ఇప్పుడు జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో అదే జరిగింది.

అసలు న్యాయవ్యవస్థలో ఉన్న బలహీనతలను అధికారంలో ఉన్నవారు వాడుకొననిది ఎప్పుడు? అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వం న్యాయవ్యవస్థ తనకు అనుకూలంగా ఉండాలనే భావిస్తుంది. దీన్ని ప్రతిఘటించి తన స్వతంత్రతను కాపాడుకునే ప్రయత్నాలు చేసిన, ప్రభుత్వాలు తప్పు చేస్తే నిలదీసిన న్యాయమూర్తులు లేకపోలేదు. న్యాయమూర్తుల నియామకాల్లో రాజకీయ జోక్యం ఉండరాదని తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కానియా నెహ్రూకు లేఖ రాసి స్పష్టం చేశారు. 1994లో జస్టిస్ వెంకటాచలయ్య పదవీ విరమణ తర్వాత ప్రభుత్వాలను బలంగా ప్రశ్నించే ప్రధాన న్యాయమూర్తులు అడపాదడపా మాత్రమే ప్రత్యక్షమవుతున్నారు. క్రమంగా న్యాయవ్యవస్థ బలహీనపడుతున్నదనే అభిప్రాయం సర్వత్రా ఏర్పడుతోంది.

ఢిల్లీ హై కోర్టు న్యాయమూర్తి నివాసంలో డబ్బులు దొరకడం గురించి అనేక కథనాలు వచ్చినప్పటికీ ఎక్కడా ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదు. అదంతా ఆయన ఊళ్లో లేనప్పుడు జరిగిన కుట్ర అని, దీని వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉన్నదని వాదించేవారు కూడా ఉన్నారు. అత్యంత శక్తివంతమైన ఢిల్లీ హై కోర్టు, కొలీజియంపై అలహాబాద్‌కు చెందిన న్యాయమూర్తుల పట్టు ఉన్నదని, దాన్ని సడలించేందుకే ఈ ఉదంతం జరిగిందని ఒక సీనియర్ న్యాయవాది చెప్పారు. ఏదిఏమైనా ఈ ఉదంతంతో ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పట్టు బిగించే అవకాశం లభించిందని మాజీ న్యాయమూర్తి ఒకరు అన్నారు. గతంలో జస్టిస్ లహోటీ భయపడినట్లే జాతీయ జ్యుడిషియల్ కమిషన్ నియామకానికి మరోసారి ప్రభుత్వం ప్రయత్నించేందుకు రంగం సిద్ధమవుతున్నదేమో? న్యాయ వ్యవస్థ తీవ్రంగా అప్రతిష్ఠపాలయినప్పుడు దాన్ని సరిదిద్ది న్యాయమూర్తుల నియామకాన్ని ఒక స్వతంత్ర సంస్థకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు హర్షించవచ్చు. కాని న్యాయవ్యవస్థ బలహీనపడటానికి బాధ్యులు ఎవరు?

ఒక ప్రైవేట్ కంపెనీకి అనుకూలంగా తీర్పునిచ్చేందుకు ఒక హై కోర్టు అదనపు న్యాయమూర్తి మరో ఇద్దరు న్యాయమూర్తులను ఒత్తిడి చేశారన్న ఫిర్యాదుపై ఇటీవల లోక్‌పాల్ విచారణకు సిద్ధపడితే సుప్రీంకోర్టు స్టే విధించింది. 'ఇది చాలా ఆందోళనకరం' అని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు, అధికారులతో సమానంగా హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కూడా విచారించే అధికారం లోక్‌పాల్‌కు ఉన్నదా లేదా అని తామే తేల్చాలని సుప్రీంకోర్టు నిర్ణయించుకుంది. నిజానికి లోక్‌పాల్ కూడా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ ఆధ్వర్యంలో ఉన్నదే. మరి లోక్‌పాల్‌కు హై కోర్టు న్యాయమూర్తులపై విచారించే అధికారం ఎందుకు లేదు? అంతర్గత విచారణ పేరుతో తమ న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలను తమే రహస్యంగా విచారించి ఏ చర్యా తీసుకోకుండా వదిలేయడం, మహా అయితే బదిలీ చేయడం సుప్రీంకోర్టు కొలీజియం ఇంతకాలం చేస్తూవస్తోంది. 'స్థానం మారినంత మాత్రాన అవినీతి లక్షణాలు మారుతాయా?' అని ప్రముఖ న్యాయకోవిదుడు ఉపేంద్ర బక్షి ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నించారు.

న్యాయమూర్తుల అవినీతి, అక్రమాల గురించి బయట విస్తృతంగా చర్చకు వస్తే న్యాయవ్యవస్థ అప్రతిష్ఠపాలవుతోందని, ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల గౌరవం పోతుందని వారు భయపడుతున్నారు. కాని న్యాయవ్యవస్థలో అవినీతిని కప్పిపుచ్చినంత మాత్రాన ప్రజలకు గౌరవం కలుగుతుందా? ఇది పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగితే తనను ఎవరూ గమనించరని భావించినట్లే ఉన్నది. సుప్రీంకోర్టు కొలీజియంలో ఉన్న న్యాయమూర్తులు ఒకరి అస్మదీయులను మరొకరు నియమించుకుని పదవులు పంచుకున్న ఉదంతాలు ఎన్నో చర్చకు వచ్చాయి. తద్వారా బంధువులు, మిత్రులు, స్వవర్గీయులు అందలమెక్కిన సందర్భాలు కూడా ప్రజల దృష్టి నుంచి దాటిపోలేదు. సుప్రీంకోర్టు కొలీజియం ఆశ్రిత పక్షపాతంతో, తమకు నచ్చినవారిని నియమిస్తోందని, షెడ్యూల్డు కులాలు, జాతులు, ఇతర అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ప్రముఖ ప్రగతిశీల న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ ఎప్పుడో చెప్పారు. దళితులకు న్యాయవ్యవస్థలో అవకాశం దక్కడం లేదని ఒకప్పుడు రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఏర్పడిన తర్వాత 39 సంవత్సరాల పాటు ఒక్క మహిళను కూడా న్యాయమూర్తిగా నియమించలేదు.

ఒక రకంగా న్యాయవ్యవస్థ తన ఉనికిని, ప్రతిష్ఠను, స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోలేకపోవడానికి కొందరు న్యాయమూర్తులే కారణం. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉండాలంటే పదవీవిరమణ తర్వాత న్యాయమూర్తులు మరే పదవినీ నిర్వహించకూడదని 1958లో లా కమిషన్ సూచించింది. కాని పదవీ విరమణ అనంతరం పోస్టులకోసం వెంపర్లాడే న్యాయమూర్తులు ఎందరో ఉన్నారు. తాము తప్పులకు పాల్పడి ప్రభుత్వ పెద్దలు తమను శాసించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడే బాధ్యత చట్టసభలు, ప్రభుత్వంపై ఉన్నది. అన్ని వ్యవస్థలతో పాటు న్యాయవ్యవస్థ కూడా తమ అడుగులకు మడుగులొత్తాలని పాలకులు భావిస్తే మాత్రం మనం చేయగలిగింది ఏమీ లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



> ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టల ఉదంతంతో ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పట్టు బిగించే అవకాశం లభించిందని మాజీ న్యాయమూర్తి ఒకరు అన్నారు. గతంలో జస్టిస్ లహోటీ భయపడినట్లే జాతీయ జ్యుడిషియల్ కమిషన్ నియామకానికి మరోసారి ప్రభుత్వం ప్రయత్నించేందుకు రంగం సిద్ధమవుతున్నదేమో? న్యాయమూర్తుల నియామకాన్ని ఒక స్వతంత్ర సంస్థకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు హర్షించవచ్చు. కాని న్యాయవ్యవస్థ బలహీనపడటానికి బాధ్యులు ఎవరు?

రోగం కన్నా ఔషధమే ప్రమాదకరమైతే ఎలా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 15న రాష్ట్ర శాసనసభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానం ఇస్తూ, సుమారు రెండున్నర గంటలపాటు అనర్గళంగా, సమగ్రంగా, వ్యూహాత్మకంగా చేసిన సుదీర్ఘ ప్రసంగం ఆయన విమర్శకులను సైతం ఆకట్టుకున్నది. ప్రధానంగా మీడియా, అందునా డిజిటల్ మీడియా బాధ్యతకు, ప్రవర్తనా నియమావళికి సంబంధించి రేవంత్ సూటిగా ప్రసంగించారు. ఇద్దరు మహిళా యూట్యూబ్ జర్నలిస్టుల ప్రవర్తన దీనికి నేపథ్యం. తనపై వ్యక్తిగతంగా, అవమానకరంగా, దూషణాత్మక అంశాలతో వీడియో పోస్ట్ చేసినందుకు వారిద్దరూ అరెస్ట్ అయ్యారని రేవంత్ వెల్లడించారు. దూషణాత్మక కంటెంట్‌ను అప్‌లోడ్ చేయడంపై ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తుందని, కాకపోతే, 'నేను చేసే ప్రతిచర్యను చట్ట పరిమితుల్లోనే చేస్తాన'నీ ముఖ్యమంత్రి ప్రకటించారు. అసభ్యకరంగా, నిరాధారంగా, దూషణాత్మకంగా వ్యాఖ్యలు చేసే వ్యక్తులు జర్నలిస్టులు కాదని, వారిని నేరస్తులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు మీడియాలో, మేధా జనబాహుళ్యంలో చర్చనీయాంశమయ్యాయి.



> శాసనసభలో మీడియా పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదర్శించిన ఆగ్రహం వెనుక సమర్థమైన కారణమే ఉండవచ్చు గానీ, ఆయన స్పందనలోని తీవ్ర పదజాలం మాత్రం భిన్నంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎప్పుడు ప్రతిస్పందించాలి, ఎప్పుడు మౌనం పాటించాలి అనే విషయాన్ని తెలుసుకోవడంలోనే రాజకీయ ప్రౌఢత ఇమిడి ఉంటుంది.

మీడియా కొన్ని హద్దులను పాటించాలా? దాన్ని ఒక స్వతంత్ర పౌర సమాజం లేదా వృత్తిపరమైన సంస్థ పర్యవేక్షించాలా? అనే విషయాలపై విస్తృత చర్చ జరగాలి. భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం స్వేచ్ఛ హక్కు కింద రక్షణ పొందుతున్నది. ఇది భారత ప్రజాస్వామ్య విశిష్టతకు సంకేతంగా పరిగణించబడుతున్నది. మీడియా నిష్పాక్షికత, బాధ్యత, ప్రతిస్పందనశీలత వంటి ప్రమాణాలను అనుసరించాలని ఈ హక్కు ఆశిస్తుంది. ఈ ప్రమాణాలు 'ఫోర్త్ ఎస్టేట్' అనే భావనలో అంతర్భాగం. హక్కులు, ప్రత్యేకాధికారాలను బాధ్యతలు, కర్తవ్యాలతో సమతుల్యం చేయకపోతే ఏ వ్యవస్థ అయినా సమర్థవంతంగా పనిచేయదు.

కాకపోతే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఉపయోగించిన హెచ్చరిక పదాలు, తనను వ్యక్తిగతంగా దూషించినవారిని ఉద్దేశించినవే అయినప్పటికీ, వాటి తీవ్రత ఆ వీడియో కంటెంట్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన వారిని సైతం విభ్రాంతికి గురి చేసింది. "ముసుగును తొలగించి బట్టలు ఊడదీసి కొడతాం, ప్రజల ముందు ఊరేగిస్తాం," అనే వ్యాఖ్యలు ఒకింత ఆందోళన కలగచేశాయి. వ్యక్తిగతంగా అవమానపరుస్తూ, అసభ్య పదజాలంతో దూషణాత్మకంగా సాగే జర్నలిజాన్ని నిర్ద్వంద్వంగా ఖండించాల్సిందే. అయితే, ముఖ్యమంత్రిని ఈ స్థాయికి నడిపించిన ఆ ఆగ్రహావేశం "రుగ్మత కన్నా ఔషధమే ఆందోళనకరమైతే ఎలా?" అనే పాత సామెతను గుర్తుచేస్తున్నది. ఇది తనకు తానే నష్టం కలిగించుకునే చర్య.

పత్రికా విలువలు కాపాడాలనే విషయంలో ఎవరూ రాజీపడకూడదు. తప్పుడు సమాచారాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. కానీ, "ప్రజాస్వామ్య ఆలయం"గా పరిగణింపబడే శాసనసభ మధ్యలో, తీవ్ర పదజాలాన్ని ఉపయోగిస్తూ ప్రతిదాడికి దిగడం అనవసరం. ఆ ఇద్దరు యూట్యూబ్ మహిళా జర్నలిస్టులు హద్దులు దాటి వ్యవహరించారనేది నిజమే కావచ్చు. చట్టపరమైన చర్య తీసుకోవడం కూడా పూర్తిగా సమంజసమే కావచ్చు. అయితే, వారి చర్య హద్దులు మీరినదైతే, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సభ గడప దాటి, అంతస్తు దాటి, మొత్తం భవనాన్ని దాటి వెళ్లాయి!

తప్పుడు సమాచార ప్రసారానికి ప్రభుత్వ బాధ్యతకు మధ్య జరిగిన ఈ యుద్ధంలో ప్రభుత్వ ప్రతిస్పందన మరింత శాంతంగా, సూక్ష్మంగా ఉండాల్సింది. జర్నలిస్టుల కథనం మార్గభ్రష్టమైనదే కాబట్టి, వాస్తవాధారంగా చేయాల్సిన ఖండన లేదా చట్టపరమైన తీవ్రమైన చర్య సరిపోయేది. శాసనసభ వేదిక నుండి ముఖ్యమంత్రి కటువైన పదజాలంతో జరిపిన ఈ మౌఖిక దాడి సమస్యను మరింత జటిలం చేయడమే గాక, ఆ ఇద్దరు మహిళా జర్నలిస్టుల పట్లే సానుభూతిని పెంచేదిగా ఉంది.

విచిత్రమేమిటంటే– అదే శాసనసభలో గౌరవ సభ్యులు స్వేచ్ఛగా మాట్లాడే హక్కును పూర్తిగా వినియోగించుకుంటారు. తీవ్ర ఆరోపణలు, పరస్పర దూషణలు కూడా అక్కడ జరుగుతుంటాయి. శాసనసభ వెలుపల నేతల మధ్య జరిగే వాగ్వివాదాలైతే మరీ శ్రుతిమించిపోతాయి. ఇదంతా మనం రాజకీయ వ్యూహంలో భాగంగా పరిగణించి పట్టించుకోవటం మానేశాం. రాజకీయ నాయకుల అనియంత్రిత వ్యాఖ్యలు సహజంగా అంగీకరించబడినప్పుడు, ఆ యూట్యూబ్ వీడియోలో వాడిన పదజాలం విషయంలో అంతస్థాయి నైతిక ఆగ్రహం వ్యక్తీకరించడం, చట్టపరమైన చర్యలకు మించి అడుగులు వేసే ప్రయత్నం చేయడం అవసరమా అన్న ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతుంది.

నాయకులు అన్యాయమైన విమర్శలకు గురి కావడం రాజకీయ వృత్తి జీవితంలో సహజం. అంతమాత్రాన అనవసరమైన తీవ్రతతో స్పందించడం వల్ల, ప్రత్యర్థి వేదికను మరింత బలపరిచినట్లే అవుతుంది. దీనివల్ల సంఘర్షణ వాస్తవాల స్థాయిలో కాకుండా, భావోద్వేగాల స్థాయిలోకి మారిపోతుంది. ఉన్నత స్థాయిలో కనిపించాలనుకునే వ్యక్తే ఆగ్రహావేశంతో స్పందిస్తే, అది అవమానానికి గురి చేసిన వారికి సానుభూతిని కలిగించే ప్రమాదం ఉంది. రాజకీయ నాయకులే ఉన్నత ప్రమాణాలను పాటించనప్పుడు, యూట్యూబ్ లేదా సోషల్ మీడియా జర్నలిస్టులు బాధ్యతగా వ్యవహరించాలని ఎలా ఆశించగలం?

ఇటీవల రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి, ఇతర బీఆర్ఎస్ నాయకుల గురించి మాట్లాడుతూ, "గౌరవం (స్టేచర్) గురించి మాట్లాడుతున్నారు. కానీ వారు ఇప్పటికే స్ట్రెచర్‌పై ఉన్నారు. త్వరలోనే మార్చురీలో చేరతారు," అని వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ వేదికను పిల్లల పాఠశాల స్థాయిలో తిట్ల యుద్ధంగా మార్చడమే. మీడియా నుండి గౌరవాన్ని కోరుకుంటూనే, రాజకీయ వేదికలపై తిట్లతో విరుచుకుపడటం అంటే– 'నేను చెప్పినట్లు చేయాలి, నేనూ చేసేలా కాదు' అన్నట్లే!

మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఒక వేదిక మీద మాట్లాడుతూ 'వివేకం, గౌరవం, మర్యాద' అనే మూడు విలువలు ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. ఇవి 'చర్చించు, వాదించు, నిర్ణయించు' అనే మూడు సూత్రాల ఆధారంగా మనగలుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. బహిరంగంగా ప్రకటనలు చేసే సమయంలో ఈ ప్రామాణిక సూత్రాన్ని గుర్తుపెట్టుకునే రాజకీయ నాయకులు చాలా తక్కువ.

శాసనసభలో మీడియా పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదర్శించిన ఆగ్రహం వెనుక సమర్థమైన కారణమే ఉండవచ్చు గానీ, ఆయన స్పందనలోని తీవ్ర పదజాలం మాత్రం భిన్నంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎప్పుడు ప్రతిస్పందించాలి, ఎప్పుడు మౌనం పాటించాలి అనే విషయాన్ని తెలుసుకోవడంలోనే రాజకీయ ప్రౌఢత ఇమిడి ఉంటుంది.

• వనం జ్వాలానరసింహారావు

హిందీని రుద్దింది కాంగ్రెస్ పార్టీయే!

మార్చి 1న ఆంధ్రజ్యోతిలో పి.చిదంబరం 'త్రిభాషా విద్యలో హిందీ తప్పనిసరా?' శీర్షికన వ్యాసం రాస్తూ కాంగ్రెస్ పార్టీ తప్పులను నిర్లజ్జగా సమర్థించారు. హిందీ భాషని త్రిభాషా విధానం ద్వారా అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మేము స్కూల్లో చదువుకునే రోజుల్లో (1960లలో) హిందీని మూడో భాషగా మానెత్తిన రుద్దింది కాంగ్రెస్ పార్టీయే. హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని డీఎంకే చేపట్టినప్పుడు, దానికి ముందు రాజాజీ, కామరాజ్, సి.సుబ్రహ్మణ్యం వంటి కాంగ్రెస్ నాయకులు ఏమి చెప్పిందీ, త్రిభాషా విధానాన్ని సమర్థించిందీ చిదంబరానికి తెలియదా? త్రిభాషా విధానంలో హిందీ నిర్బంధం కాదు. మాతృ భాష, ఇంగ్లీష్‌తో పాటుగా మరో భారతీయ భాషా చదవడమన్నది ఆ భాషా విధానం రూపొందించినప్పుడు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా వున్న త్రిగుణ సేన్ చేసిన ప్రకటన చిదంబరానికి తెలియదా? ఆ సమయంలో హర్యానాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడి పాఠశాలలో మూడో భాషగా తెలుగు ప్రవేశపెట్టింది. ఇప్పుడు తమిళనాడు కూడా హిందీ అమలు చేయాల్సిన అవసరం లేదు. తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో ఒకదానిని నేర్చవచ్చు. భాషా ఉద్యమ రాజకీయం నడుపుతున్న స్టాలిన్‌ను నిర్ద్వంద్వంగా ఖండించాల్సిన చిదంబరం, డీఎంకే విదిల్చే ఒకటి, రెండు సీట్ల కోసం కక్కుర్తిపడుతూ హిందీ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు పలకటం నీచం. డీఎంకే తమిళనాట తెలుగును ఎలా అణిచివేసిందీ అందరికీ తెలుసు. తమిళులది భాషా అభిమానం కాదు, అది దురభిమానం. ఇతర భాషలను ద్వేషించే దురభిమానం చాలా ప్రమాదకరం.

– దుగ్గరాజు శ్రీనివాసరావు, విజయవాడ

బిహార్‌లో మరో కుమార సంభవం?

ఢిల్లీ దంగల్ తరువాత రాజకీయ రణ రంగస్థలం బిహార్‌కు మారింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా యూపీలో ఎదురైన పరాజయ– పరాభవాల నుంచి తేరుకొని, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వరుస విజయాల ఊపుమీదున్న బీజేపీ– రాజధానిని దక్కించుకున్నంత సునాయాసంగా బిహార్‌లో ప్రభావ– ప్రాభవాలు చాటుకోగలదా అన్నది ప్రస్తుతానికి అనుమానమే.

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఆరేడు నెలల గడువు ఉన్నప్పటికీ, ఇప్పటికే రంగు మారుతున్న రాజకీయం భవిష్యత్తు చిత్రపటాన్ని సూచాయగా ఆవిష్కరిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి నితీశ్ అడుగుజాడల్ని అనుమానాలు నీడల్లా వెన్నాడుతున్నాయి. ఆరో దశకం చివర్లో హరియాణాలో పురుడుపోసుకున్న 'ఆయారామ్.. గయారామ్' సంస్కృతిని పునికిపుచ్చుకొని, రాష్ట్రంలో ఏ పార్టీ గెలిచినా.. తనే ముఖ్యమంత్రిగా ఉండేలా పల్టురామ్ అవతారమెత్తిన నితీశ్, వయసు మీద పడిన దృష్ట్యా మరోసారి అలాంటి దుస్సాహసానికి తెగబడకపోవచ్చు. కానీ, అధికారాన్ని సునాయాసంగా వదులుకోరని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. అందుకు ఆయన ఎలాంటి ఎత్తుగడలు వేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరం.

బిహార్‌లో రాజకీయ వాతావరణం యూపీ తదితర రాష్ట్రాల కన్నా పూర్తిగా భిన్నమైనది. హిందుత్వానికి పట్టుకొమ్మ వంటి యూపీలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అయోధ్య రాముడే గట్టెక్కించలేకపోయాడు. ఇక బిహార్‌లోనైతే హిందూ సమాజం నూటికి నూరుపాళ్లు కులాలు, వర్గాలుగా చీలికలు పేలికలై ఉంది. హిందుత్వ గొడుగు నీడలోకి చేరి, ఒకే ఓటు బ్యాంకుగా.. ఉమ్మడిగా ఓటు వేసే పరిస్థితి ఎంత మాత్రం లేదు. అలాంటిది, బిహార్‌లో మళ్లీ అధికారంలోకి వస్తే సీతామాత ఆలయం నిర్మిస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇవ్వడాన్ని బట్టి చూస్తే.. ఒక ఎన్నికల వ్యూహకర్తగా ఆ రాష్ట్రంలో క్షేత్రస్థాయి పరిస్థితి అంచనాలో ఆయన, బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా విఫలమవుతున్నాయేమో అనిపిస్తోంది. మరోవైపు ఢిల్లీ ఎన్నికల్లో 'బిగ్ జీరో'గా మిగిలిపోయాక బేరమాడే శక్తిని మరింతగా కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ, ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్తుందనేది చూడాల్సిందే.

ఎన్నికల పోరాటం స్థూలంగా చూస్తే లాలూప్రసాద్ యాదవ్ సారథ్యంలోని ఆర్జేడీ, నితీశ్ కుమార్ నాయకత్వంలోని పాలక జేడీ(యు) మధ్యేనని అనిపిస్తున్నప్పటికీ, అసలుసిసలు యుద్ధం జరిగేది మాత్రం కాంగ్రెస్, బీజేపీల నడుమే.

ముఖ్యమంత్రి నితీశ్ కుమారే తమ సీఎం అభ్యర్థిగా గోదాలోకి దిగాలని బిహార్ సంకీర్ణ సర్కారులో ప్రధాన భాగస్వామిగా ఉన్న బీజేపీ నిర్ణయించడం అనూహ్యమేమీ కాదు. జేడీ(యు)కు 12 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ మనుగడకు అవెంతో కీలకం. ఈ దృష్ట్యా జేడీ(యు)తో కలిసి సాగడం వినా బీజేపీ ముందు మరో మార్గం లేదు. అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీ నుంచే ముఖ్యమంత్రి ఎంపిక జరగాలన్న మహారాష్ట్ర ఫార్ములాకు బీజేపీ బిహార్‌లో తిలోదకాలు వదులుకొనకా తప్పలేదు. అగ్రవర్ణాల్లో పట్టుకలిగి ఉన్న బీజేపీ, నితీశ్ కారణంగా కుర్మిలు, తీవ్ర వెనుకబడిన (ఈబీసీ) కులాల ఓట్లు గంపగుత్తగా తమ కూటమికే లభిస్తాయని, దాంతో మరోసారి మంచి మెజారిటీతో గద్దెనెక్కగలమని ఆశిస్తోంది.

ఢిల్లీలో జీరో మార్కుతో డీలా పడిపోయిన కాంగ్రెస్ పార్టీ, బిహార్‌కు సంబంధించినంతవరకు లాలూ తనయుడు తేజస్వీ యాదవ్‌ను సీఎం చేయడం వరకే తన పాత్రను పరిమితం చేసుకునేలా కనిపిస్తోంది. తాను గెలవకపోయినా.. గెలిచే అవకాశం ఉన్న పార్టీని ఓడించే సత్తా మాత్రం కాంగ్రెస్‌కు పుష్కలంగా ఉందని ఢిల్లీ ఎన్నికల్లో తిరుగులేని విధంగా రుజువైన దృష్ట్యా, ఆర్జేడీ సైతం కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో సీట్లు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. అలాగని పెద్ద సంఖ్యలో స్థానాలు డిమాండ్ చేసే పరిస్థితిలో కాంగ్రెస్ ఉందా అంటే.. అదీ లేదు. మూడున్నర దశాబ్దాల క్రితం వరకు ఆ రాష్ట్రంలో ఏకచత్రాధిపత్యం కాంగ్రెస్‌దే. అనేక కుంభకోణాలు, అరాచక పాలనతో బిహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చి, తీవ్ర అప్రతిష్ఠ మూటగట్టుకున్న ఆర్జేడీకి తోక పార్టీగా నేడు అది తయారైంది. లాలూ పార్టీని మరోసారి అధికార పీఠం మీద కూర్చోబెట్టేందుకు ఉపకరించే ఒక సాధనంగా మాత్రమే మిగిలిపోయింది. ఎంతటి దురవస్థ..!

బిహార్ అసెంబ్లీలో 243 సీట్లు ఉంటే.. అందులో పాలక కూటమివి 138. వాటిలో జేడీ(యు)వి 48 కాగా, 84 సీట్లతో బీజేపీ ఆధిపత్యం కలిగి ఉంది. అయినప్పటికీ, నితీశ్ చంచల స్వభావం దృష్ట్యా దూకుడు ప్రదర్శించకుండా బీజేపీ తమాయించుకుంటూ వస్తోంది. ఇటీవలి మంత్రివర్గ విస్తరణ సందర్భంగా మొత్తం ఏడుగురిని కొత్తగా చేర్చుకున్న సీఎం నితీశ్ కుమార్, అందర్నీ బీజేపీ నుంచే తీసుకోవడం.. అందులోనూ రాజ్‌పుత్, కుష్వాహ, కుర్మి, భూమిహార్లకు చోటు ఇవ్వడం ద్వారా బీజేపీతో మైత్రి కొనసాగింపునకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు బలమైన సంకేతాలు పంపారు. అటు లాలూ సైతం రాజకీయ వ్యూహాల్లో ఆరితేరిన నేతే. తన కుమారుడిని ఎలాగైనా గద్దెనెక్కించే క్రమంలో ముఖ్యంగా ఎం–వై(ముస్లిం–యాదవ ఏకీకరణ) సూత్రాన్ని ఆయన అనుసరిస్తున్నారు. 18 శాతం ముస్లిములు, 17 శాతం యాదవుల ఓట్లకు ఆయన గురిపెట్టారు. కానీ.. ఈ మధ్య జరిగిన ఉప ఎన్నికల్లో నాలుగైదు శాతం యాదవుల ఓట్లు ఎన్డీఏ కూటమికి పడినట్లు గణాంకాల్లో వెల్లడి కావడం.. లాలూకు కలవరం కలిగించే పరిణామమే. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్, తన జన స్వరాజ్ పార్టీ తరఫున 30–40 మంది ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపే అవకాశం ఉంది. మజ్లిస్ సైతం తన ఉనికిని బలంగా చాటుకునేందుకు సిద్ధపడుతోంది. ఈ దృష్ట్యా.. కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి ముస్లిములు పూర్తిస్థాయిలో ఓట్లు వేస్తారా అన్నది అనుమానమే.



> దేశంలో ఇప్పటికే 30కి పైగా శక్తివంతమైన రాజకీయ కుటుంబాలు చక్రం తిప్పుతున్నాయి. బిహార్‌లోను ఇద్దరు వారసులు తేజస్వీ యాదవ్, చిరాగ్ పాసవాన్ తమదైన ముద్ర వేశారు. ఇప్పుడిక నిశాంత్ కుమార్ సైతం ముగ్గులోకి దిగితే.. రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగినట్టే.

నితీశ్ కుమార్ ఆరోగ్య పరిస్థితి ఇటు ఎన్డీయే కూటమినీ ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్న నితీశ్, కొంత కాలంగా పలు కార్యక్రమాలకు గైర్ హాజరవుతున్న తీరు – విపక్షం చేతిలో తాజా ఆయుధంగా మారే సూచనలు ఉన్నాయి. నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ బిహార్ రాజకీయాల్లోకి అరంగేట్రం చేయవచ్చునన్న ఊహాగానాలు... ఈ నేపథ్యంలో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. దేశంలో ఇప్పటికే 30కి పైగా శక్తివంతమైన రాజకీయ కుటుంబాలు చక్రం తిప్పుతున్నాయి. బిహార్‌లోను ఇద్దరు వారసులు తేజస్వీ యాదవ్, చిరాగ్ పాసవాన్ తమదైన ముద్ర వేశారు. ఇప్పుడిక నిశాంత్ కుమార్ సైతం ముగ్గులోకి దిగితే.. రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగినట్టే.

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ డిగ్రీ పొందిన నిశాంత్ కుమార్, ఇప్పటిదాకా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ... పుస్తకాలు, భజనలు, ధ్యానంతో గడిపేస్తున్నారు. తన వ్యాపకాలు ఏమిటో తను చూసుకుంటున్నారు. రాష్ట్రంలో బీజేపీకి చెప్పుకోదగ్గ స్థాయి కలిగిన నాయకులు లేకపోవడం, నితీశ్ కుమార్ సైతం రెండో తరం నాయకుల్ని తయారు చేసుకోని నేపథ్యంలో.. నిశాంత్ కుమార్ మరో వారసుడిగా ఎన్నికల రాజకీయాల్లోకి రంగప్రవేశం చేసే సూచనలు ఉన్నాయి. బిహార్ ఎన్నికలపై దీని ప్రభావం తథ్యం. అది ఏ స్థాయిలో ఉంటుంది, ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేం..!

■ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

అవకాశం దక్కేనా?

ప్రస్తుతం అందరి చూపు మంత్రివర్గ విస్తరణ వైపే ఉంది. మున్ముందు రాజకీయంగా మారబోతున్న సమీకరణాలేంటి? రేవంత్ కేబినెట్‌లో కొత్తగా చాన్స్ దక్కేదెవరికి? ఉన్నవారిలో ఉద్వాసన పలికేదెవరికి? అన్న చర్చతో ఉమ్మడి జిల్లా రాజకీయం హీటెక్కుతోంది. ఇప్పటికే మంత్రి పదవికి కోసం ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో.. మరికొందరు ఎమ్మెల్యేలకు కీలకమైన కార్పొరేషన్ పదవులు లేదంటే రాజకీయంగా తగిన గుర్తింపునిస్తూ పదవులను ఇస్తామని అధిష్ఠానం ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్సీగా ఎన్నికైన సినీనటి విజయశాంతి ప్రొటోకాల్ కోసం ఏ నియోజక వర్గాన్ని ఎంచుకుంటారోనన్న చర్చ కూడా మొదలైంది. ఆమె పోరుగడ్డ ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రాధాన్యమిస్తారా? లేదంటే తనకు గతంలో ఎంపీగా విజయాన్నిచ్చిన మెదక్ వైపు మొగ్గు చూపుతారా అనేది ఉత్కంఠగా మారింది. ఇదిలా ఉంటే మంత్రివర్గంలో విజయశాంతికి బెర్త్ ఖాయమైతే ఇప్పుడుతున్న అమాత్యుల్లో ఎవరికి చెక్ పడుతుందోనన్నది మరింత చర్చకు దారితీస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- నర్సంపేట ఎమ్మెల్యేకు మంత్రి పదవిపై పెరుగుతున్న ఆశలు
- దొంతి కోసం ఉత్తమ్ ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం
- మంత్రివర్గ విస్తరణపై ఆశావహుల్లో ఉత్కంఠ
- కొందరు ఎమ్మెల్యేలకు పార్టీ, కార్పొరేషన్ పదవుల ఆఫర్
- సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి 'ప్రొటోకాల్' నియోజకవర్గం ఎక్కడ?
- ఆమె చూపు పోరుగడ్డ ఓరుగల్లు వైపా! గతంలో ఎంపీగా గెలిచిన మెదక్ వైపా?
- రాములమ్మకు మంత్రి పదవి దక్కితే.. ఇప్పుడున్న వారిలో చెక్ పడేదెవరికి?
- తాజా సమీకరణలతో ఉత్కంఠగా ఉమ్మడి వరంగల్ రాజకీయం

సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఏఐసీసీ నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్న ఆయన ఉగాది పండుగకు అటుఇటుగా మంత్రివర్గాన్ని విస్తరిస్తారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో రేవంత్ క్యాబినేట్‌లో మంత్రి పదవి కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే రేవంత్ జట్టులో వరంగల్ తూర్పు, ములుగు ఎమ్మెల్యేలు కొండా సురేఖ, సీతక్కలకు అవకాశం కల్పించారు. ఇద్దరు మహిళా మంత్రుల్లో ఒకరు బీసీ, మరొకరు ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో జనరల్ కోటా నుంచి మరొకరికి అవకాశం ఇవ్వాలని చాలా రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

క్యాబినేట్‌లో బెర్త్ లభించేనా?

మంత్రి పదవుల కోసం పలువురు

మిగతా 7వ పేజీలో...

పలువురికి కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ పదవుల ఆఫర్..

మంత్రివర్గ విస్తరణపై ఆశలు పెట్టుకున్న పలువురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మినాక్షి నటరాజన్ ఇప్పటికే చర్చలు జరిపారు. పార్టీలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న వారికి పార్టీ పదవులు లేదంటే కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో ప్రాధాన్యమిస్తామని, ఆర్టీసీ చైర్మన్ లాంటి కీలకమైన పదవులు క్యాబినెట్ ర్యాంకుతో ఇస్తామని హమీ ఇచ్చారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా వరంగల్‌పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టుగా సమాచారం. నాయినికి ప్రభుత్వంలో కీలక పదవిని కట్టబెట్టేందుకు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని, కానీ అందుకు కుల సమీకరణలు కలిసి రాలేదని సమాచారం. నాయినితో పాటు పరకాల, భూపాలపలి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావులతో పాటు ఒకరిద్దరికి కీలకమైన పార్టీ పదవులు లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కుతాయనే చర్చ జరుగుతోంది.

రాములమ్మ ప్రొటోకాల్ ఎక్కడ?

సినీనటి విజయశాంతి ఇటీవలే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రతీ ఎమ్మెల్సీ తన ప్రొటోకాల్ కోసం ఒక అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. అయితే విజయశాంతి ఏ నియోజకవర్గాన్ని తన ప్రొటోకాల్ కోసం ఎంచుకుంటారనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. తన సొంత జిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగరం మండలం రామన్నగూడెంగా విజయశాంతి గతంలోనే ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే 2009లో టీఆర్ఎస్ తరఫున మెదక్ నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు. 2014లో తెలంగాణ ఏర్పాటులో ఆమె కీలకంగా ఉన్నారు. అయితే 2014లో మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీగా ప్రొటోకాల్‌ను గతంలో తాను ఓడిపోయిన మెదక్ నియోజవర్గాన్ని ఎంచుకుంటారా? లేక తన సొంత జిల్లాగా చెప్పుకొనే ఉమ్మడి వరంగల్‌లోని ఏదైనా అసెంబ్లీ స్థానాన్ని ఎంపిక చేసుకుంటారా? లేదంటే హైదరాబాద్‌లో ఏదో ఒక సెగ్మెంట్‌తో సరిపెట్టుకుంటారా అనేది చర్చనీయాంశగా మారింది. ఇదిలా ఉంటే విజయశాంతికి మంత్రివర్గ విస్తరణలో చోటు ఖాయమన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే ఓరుగల్లు రాజకీయాల్లో మార్పులు అనివార్యమని, ఇప్పటికే ఇద్దరు మహిళ మంత్రులు ఉమ్మడి వరంగల్ నుంచే ఉండటంతో మూడో మహిళ మంత్రి కూడా వరంగల్ నుంచే ఇస్తారా? లేదంటే ఎవరికైనా ఉద్వాసన పలుకుతారా? అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో మార్పు ఉండకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా.. సోషల్ మీడియాలో వివిధ రకాలుగా జరుగుతున్న ప్రచారం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి మంత్రివర్గ విస్తరణతో పాటు ఎమ్మెల్సీ విజయశాంతి ప్రొటోకాల్ నియోజవర్గం ఎంపిక అంశాలు ఓరుగల్లు పాలిటిక్స్‌ను వేడెక్కిస్తున్నాయి.



రైతన్నే దేశానికి వెన్నెముక

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- రంగశాయిపేటలో రైతు ఉత్పత్తిదారుల మేళా ప్రారంభం
- వివిధ జిల్లాల నుంచి 50 స్టాల్స్ ఏర్పాటు



స్టాల్స్‌ను ప్రాంభిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మార్క్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కలెక్టర్ సత్యశారద తదితరులు

మామునూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్నం పెట్టే రైతన్నే దేశానికే వెన్నెముక అని మాజీ మంత్రి, శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య అన్నారు. మంగళవారం వరంగల్ రంగశాయిపేటలో వ్యవసాయ, ఉద్యానవనశాఖల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేళాను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సారయ్య మాట్లాడుతూ.. రైతులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు శాస్త్రవేత్తలు సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ పద్ధతుల గురించి వివరిస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. రైతులను చైతన్యం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల గ్రూపులు ఏర్పాటు చేశామని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.375 కోట్ల ప్రోత్సాహం అందిస్తోందని, తక్కువ నీటితో ఈ పంట సాగు చేయవచ్చునని అన్నారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా వరంగల్ జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల మేళా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లానుంచి సుమారు 50 సంఘాలు స్టాల్స్ ఏర్పాటు చేశాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏసీ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ రామన్ సింగ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, పిజేటీఏయు డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ సుజాత, వ్యవసాయ అధికారి అనురాధ, ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మీ, మార్కెటింగ్ అధికారి సురేఖ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- బర్డ్‌ఫ్లూతో నష్టపోయిన పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలి
- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

7



సారయ్య జ్ఞాపకాల్లో తరాలపల్లి



ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతితో స్వగ్రామంలో విషాదం

- దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న మురళి
- సారయ్యపై రూ.25లక్షల రివార్డు



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అంకేశ్వరపు సారయ్య

కాజీపేట / మడికొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నాటి మావోయిస్టులకు కేంద్రం అయిన కాజీపేట మండలంలోని తరాలపల్లి గ్రామం మరోమారు తల్లడిల్లింది. ఈ గ్రామం నుంచి ఇప్పటికే ఉద్యమంలో చేరి ఏడుగురు మావోయిస్టులు అసువులు బాయగా.. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అంకేశ్వరపు సారయ్య అలియాస్ మురళి అలియాస్ సుధాకర్ అలియాస్ సుధీర్ (55) మృతి చెందాడు. సుమారు 35 ఏళ్ల క్రితం అప్పటి పీపుల్స్‌వార్ ఇప్పటిమావోయిస్ట్ పార్టీలో చేరిన సారయ్య పార్టీలో చేరి దండకారణ్య స్పెషల్‌జోన్ కమిటీ సభ్యుడిగా మొబైల్ పొలిటికల్ స్కూల్ ఇన్‌చార్జ్‌గా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నాడు. అంకేశ్వరపు ఎల్లమ్మ-వెంకటయ్యలకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్దకుమారుడైన సారయ్య ఐనవోలు మండలం కొండపర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో 1982-83 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేశాడు. 1985లో రాడికల్ స్టుడెంట్స్ యూనియన్‌లో తిరుగుతూ గ్రామంలో సారా నిషేధం, కూలీలకు చేసిన పనికి తగిన కూలీ డబ్బుల కోసం ప్రజలను చైతన్యం చేయడమే గాక భూస్వాముల భూముల్లో ఎర్ర జెండాలు పాతి దున్నేవాడిదే భూమి అని పేదలకు భూముల కోసం పోరాటం చేసేవాడని అతడి బాల్య మిత్రులు గుర్తుచేసుకుంటున్నారు. సారయ్య కాజీపేటకు చెందిన దివంగత మావోయిస్ట్ క్రాంతిరణదేవ్ సూచనలతో 1984లో మడికొండ గ్రామంలో సారా దుకాణం కాల్చిన ఘటనలో మొదటిసారి జైలుకెళ్లాడు. జైలునుంచి తిరిగివచ్చి మళ్లీ పోరుబాటలోనే నడిచాడు. 1985లో పీపుల్స్‌వార్‌తో సంబంధాలున్నాయనే నెపంతో సారయ్యను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. 1986లో జైలు నుంచి వచ్చి వ్యవసాయ బావులు తవ్వడానికి, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుండేవాడు. అదే క్రమంలోనే 1991లో పూర్తి స్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి సారయ్య తిరిగి గ్రామం వైపు రాలేదు. అవివాహితుడైన మావోయిస్టు పార్టీలో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యులుగా కొనసాగుతూ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. చదివింది తక్కువే అయినా పార్టీలో మావోయిస్టులకు పొలిటికల్ బోధనలో ఆయనది ప్రత్యేకం.. అందమైన చేతిరాతతో విప్లవపాఠాలు చెప్పేవారని అతని పనిచేసిన మాజీ మావోయిస్టులు గుర్తుచేసుకుంటున్నారు. సారయ్య తండ్రి నాలుగేళ్లక్రితం, తల్లి మూడేళ్ల క్రితం మరణించగా.. అతడి తమ్ముడు రవీందర్.. భార్య, పిల్లలతో గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. చెల్లెలు ప్రస్తుతం కాజీపేటలో నివాసం ఉంటున్నారు.

మావోయిస్టులకు కేంద్రం..

నాటి పీపుల్స్‌వార్, నేటి మావోయిస్టు పార్టీలకి కేంద్రం తరాలపల్లి గ్రామం, ఈ గ్రామంలోని నాటి యువత రక్తంలోనే తిరుగుబాటు ఉందని గ్రామస్థుల భావన. ఈ గ్రామం నుంచి పార్టీలో చేరిన కౌముది, బండి ఆశాలు, ముప్పిడి నాగేశ్వర్ రావు, గాజుల శ్రీనాద్, పేరాల సంపత్, కొత్తపల్లి నాగశ్వర్ రావు, ప్రస్తుతం ఎన్‌కౌంటర్ మృతి చెందిన అంకేశ్వరపు సారయ్య. పార్టీలో క్రమశిక్షణతో పనిచేసి అసువులు బాసినవారే. ఇప్పటికీ సెంట్రల్ కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్న ముప్పిడి సాంబయ్య అలియాస్ సుదర్శన్ అలియాస్ జంగ్ దాదా ఉద్యమంలోనే ఉన్నాడు. ఇక మంగళవారం ఛత్తీస్‌గడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సారయ్య మృతి చెందాడన్న వార్త తెలియడంతో తరాలపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సారయ్య గ్రామంలో ఉన్న సమయంలో అందరితో కలిసి మెలిసి ఉండటంతో పాటు గ్రామంలో ఏసమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషిచేసేవాడని మిత్రులు, స్థానికులు చర్చించుకుంటున్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ సందర్శన

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యసాధనకు విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రతతో చదవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్‌ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం సందర్శించారు. స్టడీ సర్కిల్‌లో సంబంధిత శాఖ అధికారులతో ఈ సందర్భంగా కలెక్టర్ సమావేశమై స్టడీ సర్కిల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టడీ సర్కిల్‌లోని విద్యార్థుల డార్మెటరీ, లైబ్రరీ, డైనింగ్ హాల్, వంట గదిని పరిశీలించారు. స్టడీ సర్కిల్‌లోని ఉద్యోగార్థులకు 75 రోజులపాటు చేపట్టిన ఉచిత శిక్షణా తరగతులకు కలెక్టర్ హాజరై మొదటిసారి పోటీ పరీక్షలకు విద్యార్థులకు అనుసరించాల్సిన వ్యూహంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎప్పుడు శ్రమపై దృష్టి పెట్టాలని, దృష్టి పెడితే ఖచ్చితంగా ఫలితం వస్తుందన్నారు. ఒకరికొకరు సహకరించుకోవాలని, తమకు తెలిసిన విషయాలు ఇంకొకరితో పంచుకుంటే మంచి ఫలితం వస్తుందన్నారు. ఎప్పుడు కూడా నిరాశ నిస్పృహలకు లోను కావొద్దని, ఆశావాహ దృక్పథంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధన 3,6 నెలల్లో పూర్తయ్యేవి కావని, నిరంతర ప్రక్రియగా సిద్ధమై ఉండాలన్నారు. 75 రోజుల పాటు శిక్షణ పూర్తయినప్పటికీ స్టడీ సర్కిల్ శిక్షణ సిబ్బందితో ఎల్లప్పుడు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని, నోటిఫికేషన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ స్టడీ సర్కిల్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీటీడీవో ప్రేమకళ, ఏసీఎం సారయ్య, ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపల్ లింగాల శ్రీరాములు, తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పోలీసు అధికారులు నిజాయితీగా పని చేయాలి

- పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్
- ఆత్మకూరు, దామెర పోలీసు స్టేషన్ల తనిఖీ



ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో అధికారులకు సూచనలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

ఆత్మకూరు/దామెర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి నిజాయితీగా సేవలు అందిస్తూ మంచి పేరు తీసుకురావాలని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించిన అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కంట్రోల్ రూంలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరుగుతాయి. ఎంత మంది రౌడీ షీటర్లు ఉన్నారు. రోజు ప్రమాదాల సంఖ్య, పోలీసుస్టేషన్ పరిధి, స్టేషన్ సిబ్బంది మొదలైన వివరాలను ఇన్స్‌స్పెక్టర్ సంతోష్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, పరకాల ఏసీపీ సతీష్‌బాబు పాల్గొన్నారు.

కటాక్షపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్‌లు తనిఖీలు చేసి చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసేందుకు ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధి కంఠాత్మకూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీలు నిర్వహించారు.

అనంతరం దామెర మండలంలోని పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లోని సంబంధిత రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది వివరాలతో పాటు నేరాలకు సంబంధించిన కేసుల నమోదుపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, వారిపై నియంత్రణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ వెంట ఏఎస్పీ(ట్రైనీ ఐపీఎస్)మనన్ భట్, పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి

నిధుల మంజూరు చేయాలని మంత్రి ప్రభాకర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి

పాలకుర్తి, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరి చేయాలని రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి మంగళవారం అసెంబ్లీ లాబిలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆమె మాట్లాడుతూ గత ముప్పై ఏళ్ల నుంచి వినియోగం లో రాకుండా ఉన్న బస్టాండ్‌ను ఇటీవల వినియోగంలోకి తెచ్చినట్లు ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆమె తెలిపారు. బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరి చేయాలని కోరగా, పనులను ప్రారంభించాలని ధికారులకు ఆదే శాలు జారీ చేశారన్నారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరాం ఉన్నారు.

కేయూ టెక్నికల్ సంఘం ఉపాధ్యక్షుడిగా మెట్టు రవి



మెట్టు రవి

కేయూ క్యాంపస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మెట్టు రవి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు కేయూ ఎన్నికల అధికారి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ మెట్టు రవి ఎంపికైనట్లు ప్రకటించారు. కాగా, మెట్టు రవి ప్రస్తుతం తెలంగాణ వర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులుగా ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతున్నామన్నారు. భవిష్యత్‌లో టెక్నికల్ అసోసియేషన్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తానని ప్రకటించారు. వర్సిటీలకు నిధులు పెంచి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని మెట్టు రవి డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులుగా ఎంపికైన మెట్టు రవిని పలువురు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ రెగ్యులర్ కోర్సుల 3, 4, 6 సెమిస్టర్ పరీక్షల ఫీజుల చెల్లింపునకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 2 వరకు గడవు పొడగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్యలు మంగళవారం తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 9 వరకు గడువు ఉందని స్పష్టం చేశారు.

ఉరేసుకొని ఆర్‌ఎంపీ ఆత్మహత్య



సారంగపాణి (ఫైల్)

గీసుగొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ చాగంటి సారంగపాణి(42) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సారంగపాణి ఇంటి అవసరాల కోసం హౌసింగ్‌లోన్, ద్విచక్రవాహనం లోన్, బంగారం తాకట్టు పెట్టి బ్యాంకులో రుణం తీసుకున్నాడు. దీంతో అతడు నెలకు దాదాపు రూ.25 వేల ఈఎంఐలు కట్టాల్సి రావడంతో ఆదాయం లేక అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఇంట్లోని రేకుల షెడ్డుకు గల ఇనుపరాడ్‌కు టవల్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం
- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- నష్టపోయిన మొక్కజొన్న రైతులు, అధికారులు, కంపెనీ ప్రతినిధులతో సమీక్ష





సమావేశంలో వ్యవసాయ కమిషన్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్లు, సభ్యులు, అధికారులు, పాల్గొన్న రైతులు, అధికారులు, రైతు ప్రతినిధులు

ములుగు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన గిరిజన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాలలో 2,168 ఎకరాల్లో మొక్కజొన్న విత్తన పంటను సాగుచేసిన 959మంది రైతులు సరైన దిగుబడి రాకపోవడంతో నష్టపోయారు. మూడు ప్రైవేటు కంపెనీలతో ఒప్పందంలో భాగంగా మొక్కజొన్నను సాగుచేయగా పరిహారం చెల్లింపు విషయం తేలకపోవడం, మధుకృష్ణ అనే రైతు ఆత్మహత్య చేసుకోవడంతో వ్యవసాయ కమిషన్ స్పందించింది. చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి, సభ్యులు రాములు నాయక్, గంగాధర్, నరసింహారెడ్డి, వెంకన్నయాదవ్ మంగళవారం ములుగుకు వచ్చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, రైతులు, విత్తన కంపెనీల ఆర్గనైజర్లతో సమీక్ష జరిపారు. రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపామని, మొక్కజొన్న కంకులు, ఆకులను సేకరించి డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్ ల్యాబ్‌కు పంపామని జిల్లా వ్యవసాయాధికారి సురేష్ తెలిపారు. రైతులు, విత్తన కంపెనీల ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించగా నష్టపరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమచేసేలా ప్రాథమిక అంగీకారం కూడా కుదిరిందని వెల్లడించారు. అయితే కొందరు ఆర్గనైజర్లు రైతులకు అనధికారికంగా అప్పులు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, వారిపై మనీ లెండింగ్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, ఆర్గనైజర్ల నుంచి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. స్పందించిన వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ ఈ అంశంపై అధికారుల సమగ్రమైన నివేదికను సమర్పించారని, ఏజెన్సీ ప్రాంత రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. ఆ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, వ్యవసాయ కమిషన్ అడ్వైజర్లు దొంతి నరసింహారెడ్డి, రామాంజనేయులు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుచరిత, ఆర్డీవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కూలిపనికి వెళ్లి.. మృత్యు ఒడిలోకి

- అదుపుతప్పి పొలంలోకి దూసుకొచ్చిన లారీ
- పత్తివిత్తన బస్తాలు పడి ఇద్దరు మహిళల దుర్మరణం
- భూపాలపల్లి జిల్లాలో ప్రమాదం.. నిరుపేద కుటుంబాల్లో విషాదం





మృతురాలు మోకిడి సంధ్య, పూలమ్మ



పొలంలోకి దూసుకొచ్చిన లారీ

టేకుమట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకురావడంతో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్(టి) గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రామకిష్టాపూర్ (టి)కు చెందిన మోకిడి సంధ్య (28), మోకిడి పూలమ్మ(45) గ్రామ శివారులోని వరి పొలంలో బెరుకులు ఏరడానికి ఎనిమిది మంది కూలీలతో కలిసివెళ్లారు. పొలం పనికి వీరంతా ఉపక్రమిస్తుండగా పక్కనే ఉన్న మలుపు వద్ద లారీ అదుపు తప్పి దూసుకొచ్చి బోల్తా పడింది. అందులో లోడై ఉన్న పత్తి విత్తన బస్తాలు ఒక్కసారిగా సంధ్య, పూలమ్మ పై పడటంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్రేన్, జేసీబీ సహాయంతో బస్తాలను తొలగించి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ఆస్పత్రికి తరలించారు. మృతులు సంధ్య, పూలమ్మ బంధువులవుతారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు వీరివి. రామకిష్టపూర్ (టి)కి చెందిన పూల మ్మ భర్త కిషన్ టేకుమట్లలోనిఓ ఫంక్షన్‌లో వాచ్ మన్‌గా పనిచేస్తుండగా మెకు కూడా కొన్ని రోజులుగా అక్కడే నివాసం ఉంటోంది. రామకిష్టాపూర్ (టి)శివారు వరి పొ లం లో బెరుకులు ఏరేందుకు పని ఉందని తెలిసి ఆమె అక్కడి నుంచి వచ్చి ప్రమాదానికి గురై మృతి చెందింది. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. రామకిష్టాపూర్ (టి) గ్రామానికే చెందిన సం ధ్య, ఆమె భర్త రాజు రోజు వారీ కూలి పనులకు వెళ్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. భర్త తాపీ మేస్త్రీ కింద పనికి వెళ్లగా సంధ్య వ్యవసాయ పనులకు వెళ్లి మృత్యువు బారిన పడింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ప్రమాదానికి గురై మృతి చెందడంతో రామకిష్టాపూర్ (టి)లో విషాద ఛాయలు అలుముకున్నా యి. మృతులిద్దరు బంధువులు కావడంతో ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

స్టార్టప్ కేంద్రంగా వరంగల్

- ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చౌదరి
- ఫౌండేషన్‌తో వరంగల్ నిట్ ఎంవోయు



ఎంవోయును ప్రదర్శిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధీ, చౌదరీ

హనుమకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : టైర్ టు, టైర్ త్రీ నగరాల్లో స్టార్టప్‌ల అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేఏ చౌదరి అన్నారు. మంగళవారం స్టార్టప్‌ల అభివృద్ధికి ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (కర్నాటక) వరంగల్ ఎన్ఐటీ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదిరింది. దీనిపై ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేఏ చౌదరి, వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ సందర్భంగా చౌదరీ మాట్లాడుతూ.. వరంగల్ స్టార్టప్ కేంద్రంగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. వరంగల్ ఒక అద్భుత నగరమని, ఇక్కడ స్టార్టప్‌ల అభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. వరంగల్ ఎన్ఐటీతో కలిసి పని చేయడం ద్వారా యువతలో వ్యవస్థాపకత్వాన్ని పెంపొందించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. వరంగల్‌లో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు ఈ ఎంవోయు ఎంతో తోడ్పడుతుందన్నారు. ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ చాప్టర్‌ను వరంగల్ ఎన్ఐటీలో ప్రారంభిస్తున్నట్టు చౌదరి ప్రకటించారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ మాట్లాడుతూ ఈ ఎంవోయు వరంగల్ నిట్ క్యాంపస్‌లో వ్యవస్థాపకత ప్రయత్నాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు.

ఇలాంటి భాగస్వామ్యాల ద్వారా వరంగల్ ఎన్ఐటీ వికసిత్ భారత్ లక్ష్యసాధనలో మరింత ముందుకు వెళుతుందన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు, ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించడానికి సరికొత్త బాటలను వేస్తుందన్నారు.



కొమ్మాల ఆలయ హుండీ లెక్కిస్తున్న దృశ్యం

కొమ్మాల జాతర ఆదాయం రూ. 49.11లక్షలు

గీసుగొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొమ్మాల శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర ఆదాయం మొత్తం రూ.49,11,096 ఆదాయం రాగా, అందులో హుండీల ద్వారా రూ. 20,48,615 వచ్చినట్లు ఈవో అద్దంకి నాగేశ్వరావు తెలిపారు. జాతర హుండీల లెక్కింపును మంగళవారం నిర్వహించారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం రూ.21,65,708 జాతర ఆదాయం పెరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదా యశాఖ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కాండూరి రామాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు కడారి రాజు, వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల సజీవదహనం కేసులో బాధ్యులపై చర్య తీసుకోండి

సీపీకి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లేఖ

వరంగల్‌సిటీ, మార్చి25 (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ ప్రాంతంలో ఇటీవల జరిగిన గొర్రెల సజీవ దహనం కేసులో ఇప్పటి వరకు పురోగతిలేదని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లేఖ రాశారు. గత గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా దుగ్గిరాల లక్ష్మణ్‌కు చెందిన 400ల గొర్రెలు సజీవ దహనం అయ్యాయని తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైనప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం అదే గొర్రెల ఫాంలో 9జతల గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, సీసీ ఫుటేజీ కూడా ఉందని, అప్పుడు కూడా పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సీపీ వెంటనే స్పందించి విచారణ జరిపి, నిందితులను శిక్షించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

బస్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో అపశ్రుతి

ఆర్టీసీ బస్సుపై పడిన రాయి.. తప్పిన ప్రమాదం

గిర్మాజీపేట, మార్చి25(ఆంధ్రజ్యోతి): వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో అపశ్రుతి దొర్లింది. బండరాళ్లను పేల్చుతుండగాఓ రాయి వచ్చి ఆర్టీసీ బస్సుపై పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం బస్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో భాగంగా బండరాళ్లను పేల్చారు. అందులో ఓ రాయి వచ్చి భూపాలపల్లి డిపోకు చెందిన బస్సు డ్రైవర్ పక్కన పడడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. కాగా, బస్సు అద్దాలను మరమ్మతు చేయిస్తానని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని, ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదని తెలిసింది. బస్‌స్టేషన్ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు లేకుండా పేలుళ్లు జరపడంపై ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముస్లింలతో ఎమ్మెల్యే కడియం, కలెక్టర్ రిజ్వాన్‌భాషా

ముస్లింల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి: కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ ముస్లింల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేలా అల్లా దీవించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంలోని ఏఆర్ఎల్ గార్డెన్‌లో మంగళవారం ఇఫ్తార్ విందులో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషాతో కలిసి కడియం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, వెనుకబడి ఉండడంతో ప్రభుత్వం వారిని ప్రోత్సహించేందుకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మైనార్టీ గురుకులాలను నిర్వహించడమేకాదు, బడ్జెట్‌లో మైనార్టీ వెల్ఫేర్‌కు రూ.4వేల కోట్లు కేటాయించిందన్నారు. నియోజకవర్గంలో ఇండ్ల స్థలాలు ఉండి, ఇండ్లులేని నిరుపేద ముస్లింలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, ఎమ్మీ నజీర్, ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు శ్రీకాంత్, సతీష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ జానీబాబా, మతపెద్దలు మైముద్, యాకుబ్‌పాషా, మదార్, కలీం, మాషుక్, హైమద్, ఇమ్రాన్ అసిఫ్, నాగరబోయిన శ్రీరాములు, బూర్ల శంకర్, కోతి రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

వరంగల్ కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మామునూరు ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, గ్రీన్‌ఫీల్డ్ ఇన్నర్ రింగ్‌రోడ్ పనులకు సంబంధించిన పనుల పురోగతిపై కలెక్టర్ సత్యశారద మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏనుమాముల, గీసుగొండ, ఖిలావరంగల్ ఇన్నర్ రింగ్‌రోడ్ పనులలో భూమి కోల్పోయిన రైతులకు డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో ఖిలావరంగల్, నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల్లో సర్వే పూర్తయిందని పనుల పురోగతికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గ్రీన్ కవరేజీ ఏర్పాటు చేయాలని, వారంలోగా 15వేల మొక్కలు నాటి వాటికి జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. 18 నుంచి 39 సంవత్సరాలలోపు నిరుద్యోగులను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కుట్టుశిక్షణ ఇప్పించి ప్రావీణ్యం కలిగిన వారిని ఎంపిక చేయాలని డీఆర్‌డీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, రాజ్‌కుమార్, రియాజుద్దీన్, వెంకటస్వామి, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



భట్టిని కలిసి పనుల వివరాలు చెబుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

అభివృద్ధి పనులు కొనసాగించండి

డిప్యూటీ సీఎంకు మాజీ మంత్రి ఎర్రబెల్లి వినతి

పాలకుర్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో మంజూరై ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ లాబిల్లో కలిసి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను వివరించారు. పాలకుర్తిలో మంజూరైన పనులన్నీ చేపట్టాలని వినతిపత్రం అందచేశారు.

జనగామ జిల్లాలో సాగునీరు పారకం లేక వేలాది ఎకరాల్లో వరిపొలాలు ఎండిపోయాయని, వెంటనే సాగునీరు అవదించాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7045	5800
మక్కలు (బిల్టీ రకం)	2129	2100
కందులు	6825	5540
పెసళ్లు	7422	4645
పల్లికాయ (సూక)	6000	6500
పల్లికాయ (పచ్చిది)	4300	3400
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	12700	9000
వండర్‌హాట్	14000	11500
యూఎస్341	12300	9500
దీపిక	13300	15245
దేశీ	28000	25500
సింగిల్ పట్టి	27000	24000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

జిల్లాల వారీగా ఫైర్ సిబ్బంది

- వరంగల్ జిల్లాలో ముగ్గురు ఫైర్ ఆఫీసర్లు, లీడింగ్ ఫైర్ మెన్లు 8మంది, డ్రైవర్ ఆపరేటర్లు 10 మంది, ఫైర్‌మెన్లు 27 మంది, హోంగార్డులు 23 మంది. ఆరుగురు డ్రైవర్లున్నారు.
- హనుమకొండ జిల్లాల్లో ఇద్దరు స్టేషన్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 15మంది లీడింగ్ ఫైర్ మెన్‌లు, నలుగురు డ్రైవర్ ఆపరేటర్లు, ఐదుగురు ఫైర్ హోంగార్డులు, 18మంది ఫైర్‌మెన్‌లు, ఒక డ్రైవర్ విధులు నిర్వర్తిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఇద్దరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు ఉండగా.. నలుగురు లీడింగ్ ఫైర్ మెన్లు, ఐదుగురు ఫైర్ మెన్‌లు, 12మంది హోంగార్డులు, ఇద్దరు డ్రైవర్లు పనిచేస్తున్నారు.
- జనగామ జిల్లాలో ముగ్గురు స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, ఒక లీడింగ్ ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఒక డ్రైవర్ ఆపరేటర్, తొమ్మిది మంది ఫైర్ మెన్లు, ఇద్దరు డ్రైవర్లు విధుల్లో ఉన్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు లీడింగ్ ఫైర్ మెన్‌లు, ఒక డ్రైవర్ ఆపరేటర్, తొమ్మిది మంది ఫైర్ మెన్లు, ఇద్దరు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.
- ములుగు జిల్లాకు సంబంధించి ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్ మెన్లుగా, ఒక డ్రైవర్ ఆపరేటర్, ఒక హోంగార్డు, ఒక డ్రైవర్ పని చేస్తున్నారు.

అగ్నితో రణం..



ఫైర్ సిబ్బంది

భరోసా లేక భయం..

ఎదుగూ.. బొదుగూ లేని 'అగ్నిమాపక' కొలువు

- సమస్యలతో సతమతమవుతున్న ఫైర్ సిబ్బంది
- ఆరోగ్య భద్రత, పదోన్నతులు లేక ఫైటర్స్ ఆందోళన
- అలవెన్స్, ఎక్స్‌గ్రేషియా సదుపాయం కల్పించాలని డిమాండ్

మట్టెవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే గుర్తుకొచ్చేది అగ్ని మాపక సిబ్బంది. 101 నెంబరుకు డయల్ చేస్తే ఏ క్షణమైనా అగ్నిమాపక యంత్రంతో ప్రజలకు చెంతకు చేరి సేవలందిస్తారు. ప్రమాద సమాచారం తెలియగానే ఫైర్ ఇంజన్‌తో ఘటనా స్థలికి చేరుకుని తమప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలను, ఆస్తులను కాపాడుతుంటారు. నిత్యం.. నిప్పుతో పోరాడుతారు. అలాంటి ఫైర్ ఫైటర్స్ అటు ఆరోగ్య భద్రత లేక.. ఇటు కొలువుల్లో ఎదుగూ బొదుగూ లేక బేజారవుతున్నారు.

ఈ కొలువు అంత తేలిక కాదు..

అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బరువైన పరికరాలను ఎత్తాల్సి ఉంటుంది. వాటిని పట్టుకొని పరుగులు తీయాల్సి ఉంటుంది. ఎవరైనా మంటల్లో చిక్కుకుపోతే వారిని కాపాడేందుకు ప్రాణాలను పణంగా పెట్టాల్సి ఉంటుంది. భవంతులు ఎక్కడం ప్రమాదకర పరిస్థితుల్లో పై నుంచి దూకడం లాంటి సహసాలు కూడా చేయాల్సి వస్తుంది. పరిశ్రమలు, రసాయన గోదాములు, పత్తి మిల్లులు, బహుళ అంతస్తులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, టింబర్ డిపోలు, ఆస్పత్రులు ఇలా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో విషవాయువులు, పొగ ప్రభావంతో అగ్ని మాపక సిబ్బంది అనారోగ్యానికి గురవుతుంటారు. అగ్ని ప్రమాదాల సమయంలో గాయపడడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోవడం జరుగుతుంలాయి. అయితే గాయపడిన వారికి కనీసం మెడికల్ అలవెన్స్‌లు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగి మరణిస్తే ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో అగ్ని ప్రమాదాల్లో మరణించిన సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నారు. ఆరోగ్య భద్రత పథకాలు అమలవుతున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఎలాంటి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అంద డం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏటా 600 లకు పైగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు 250 మంది సిబ్బంది పని చేస్తున్నారు. మంటలార్పే సమయంలో విషవాయువులు, పొగ వల్ల వీరు ఊపిరితిత్తుల సమ స్యలకు గురవుతారు. క్రమంగా అది ప్రాణాంతకంగా మారుతోంది. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు కార్బన్ మోనాక్సైడ్ వెలువడితే నిమిషాల్లో స్పృహ కోల్పోతారు. ఇలా ప్రాణాలకు తెగించి పనిచేసే ఫైర్ సిబ్బందికి ప్రభుత్వం ఎలాంటి రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వడం లేదు. సంవత్సరానికి రూ. 3500 యూనిఫాం అలవెన్స్ మాత్రమే ఇస్తున్నారు. ఈఎల్ 30రోజులు ఇస్తున్నారు. పదోన్నతులు, ఎక్స్‌గ్రేషియా అందడం లేదు.

ఆరోగ్య భద్రత కల్పించాలి..



అగ్ని మాపక సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించాలి. రిస్క్ అలవెన్స్ ఇవ్వాలి. ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. యూనిఫాం అలవెన్స్ పెంచాలి. ఈఎల్‌లను 30 రోజుల నుంచి 40 రోజులకు పెంచాలి. సీనియార్టీ ప్రకారం ఫైర్ మెన్‌లకు అసిస్టెంట్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా ప్రమోషన్ కల్పించాలి. ఏఎస్ఎఫ్‌వో పోస్టులు మంజూరు చేసి ఫైర్‌మెన్‌లకు ప్రమోషన్ ఇవ్వాలి.

- వి.సుధాకర్, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



ఫైర్ ఇంజన్

వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా

అభివృద్ధి చేయాలి

- బర్డ్‌ఫ్లూతో నష్టపోయిన పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలి
- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య మంగ ళవా రం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిన్నదని, నష్టపోయిన పౌల్ట్రీ యజమానులను ఆర్థి కంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధిచి కేంద్ర పాడిపరిశ్రమ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సానుకూలంగా సమాధానం ఇచ్చా రు. డాక్టర్ కావ్య మాట్లాడుతూ తాను కాకతీయులు ఏలిన గడ్డపై జన్మించిన బిడ్డనని గుర్తు చేశారు. వరంగల్ కాకతీయుల రాజధానిగా విలసిల్లిన నేల అని, ఈ ప్రాం తానికి అద్వితీయమైన సాంస్కృతిక వారసత్వం, అద్భుతమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. వేయిస్తంభాలగుడి, కాకతీయుల కళాతోరణం, ఓరు గల్లు కోట, యునెస్కో గుర్తించిన రామప్ప, ప్రతీ రెండేళ్ల కొకసారి కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరయ్యే సమ్మక్క సారలమ్మ జాతర తదితర పర్యా టక ప్రాంతాలు ఉన్నాయని వివరించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని డాక్టర్ కావ్య కోరారు. వరంగల్‌ను ముఖ్య టూరిజం హబ్‌గా చేయడం వల్ల ఈ ప్రాంతాలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ దృష్ట్యా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని ఆమె అభ్యర్థించారు.

పౌల్ట్రీ రైతులను ఆదుకోండి



తెలంగాణలో బర్డ్ ఫ్లూ వల్ల లక్షలాది కోళ్ల మృత్యువాత పడ్డాయనీ, దీంతో పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ తరుణంలో పౌల్ట్రీ పరిశ్రమదారులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బర్డ్‌ఫ్లూ వల్ల నష్టపోయిన పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది..?, ఈ పరిశ్రమపై ఆధారపడిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎలాంటి పథకాలను చేపట్టబోతున్నది, మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువుల మార్కెటింగ్‌కు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నది తెలియజేయాలని కోరారు. ఇందుకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానం ఇస్తూ బర్డ్ ఫ్లూ గురించి విడిగా, వివరంగా తెలియ చేస్తానని చెప్పారు. బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమకు జరిగిన నష్ట నివారణకు ఏం చేయాలనే విషయంలో కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పాడిపరిశ్రమను ప్రస్తావిస్తూ దేశంలో పాల ఉత్పత్తి అద్భుతంగా జరుగుతోందని, దేశంలో 95 శాతం పాల సేకరణ డేయిరీల ద్వారానే సాగుతోందని అన్నారు. 39 శాతం పాల ఉత్పత్తి అసంఘటిత రంగంలోనే జరుగుతోందని చెప్పారు. మహిళలు ఎక్కువగా ఆధారపడే పాల ఉత్పత్తిని పూర్తిగా సంఘటిత రంగంలోకి తీసుకువచ్చేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు కృషి చేస్తోందన్నారు. తద్వారా పాడి రైతులకు, ముఖ్యంగా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

నందిని సిధారెడ్డి చేతుల మీదుగా సత్కారం (ఫైల్)



సాహితీ పద సంపద

లగిశెట్టి

- సాహిత్య అవార్డులు ఆయన సొంతం
- సామాజిక స్పృహలో లఘుచిత్రాల నిర్మాణం



లగిశెట్టి ప్రభాకర్

జనగామ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాహితీరంగంలో ఎనలేని కృషి చేస్తూ ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంటున్నారు లగిశెట్టి ప్రభాకర్. జనగామ జిల్లా కేంద్రంలో లగిశెట్టి రామస్వామి, కిష్టమ్మ దంపతులకు 1956లో జన్మించిన లగిశెట్టి ప్రభాకర్.. ఎం.ఏ, బీఈడీ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్న క్రమంలోనే పేరడీ పాటలు రాశారు. 1967-68 సంవత్సరాల్లో ఆయన విత్రులు మసురం రాజేంద్రప్రసాద్ సంపాదకత్వంలోని ఉదయకిరణాలు పత్రికలో తొలిసారిగా ప్రభాకర్ రాసిన సంక్రాంతి కవిత అచ్చు వేశారు. ఉద్యోగ నిర్వహణలో ఉన్న సమయంలో వీడ్కోలు, స్కూల్‌డే లాంటి సందర్భాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రభాకర్ పెద్దదిక్కు. అనే లఘునాటిక, నృత్యగీతాలు రచించి విద్యార్థులచే ప్రదర్శింపజేసి మంచి శిక్షకుడిగా, నిర్వాహకులుగా పేరు సంపాదించారు. తెలంగాణ యాసలో, కవన హస్తాలతో సమాజాన్ని మేల్కొలిపే భావజాలం, మస్తిష్క మేధోమథనంతో సాహిత్యాన్ని సృజిస్తూ సాహిత్యక్షేత్రంలో విహరిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుతెచ్చుకున్నారు.

1150 కవితలు..

ఉద్యోగ విరమణ తర్వాత లగిశెట్టి ప్రభాకర్ పూర్తి స్థాయిలో కవిత్వంపై దృష్టి పెట్టారు. మానవత్వం, కుటుంబ బంధాలు, సామాజిక చైతన్యం, ప్రేమ కవితలు పేరుతో దాదాపు 1150 కవితలు రాశారు. 'ప్రతిలిపి' అనే యాప్‌లో కవితలను అప్లోడ్ చేసి సాహితీ ప్రపంచానికి చేరువయ్యారు. ఆయన కవితలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తెలంగాణ సాహిత్యకళా పీఠం, వాగ్దేవీ సాహిత్య కళావేదిక, శ్రీశ్రీ కళావేదిక, కవి హృదయం సాహిత్య వేదిక, జీవైగిరి ఫౌండేషన్, జనగామ రచయితల సంఘం (జరసం), కవులు కళాకారుల ఐక్యవేదిక సార థ్యంలో నిర్వహించినకవి సమ్మే ళనాలు, సాహితీ కార్యక్రమాల్లో ప్రభాకర్ పాల్గొని కవితా పఠ నం చేసి అవార్డులు, రివార్డు లు, ప్రశంసాపత్రాలు అందుకు న్నారు. తాను రాసిన కవిత్వం వల్ల ప్రజల్లో మార్పుకు నాంది పలికితే ఆశయం నెరవేరినట్లే అని భావిస్తున్న ప్రభాకర్ కేవలం కవిగానే కాకుండా నటు డు, వ్యాఖ్యాత, ఏకపాత్రాభిదారి, పల్లెసుద్దు లు కథకులుగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే సామాజిక అంశాలను స్పృశిస్తూ తనదైన శైలిలో లగిశెట్టి ప్రభాకర్ లఘు చిత్రాలను సైతం నిర్మించారు. సీసీసీ జన గామ యూట్యూబ్ చానల్‌లో 'తనదాకా వస్తే', 'ఎవరు మారాలి', 'ముదురు మొగు డు - ముద్దుల పెళ్లాం', 'మీదే బాధ్యత', 'ఇచ్చి అడుగబోతే' మొదలగు లఘుచిత్రా లకు కథను సమకూర్చి, దర్శకత్వం వహించి, నటించారు. అంతేగాకుండా 'ఓ వయసు పోరగా' పాటలో రాజకీయ నాయకుని పాత్రలో కనిపించారు.

సన్మాన, సత్కారాలివే..

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు సాహిత్య సంస్థలు ఏర్పాటు చేసే సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో సత్కారాలు అందుకున్నారు. వాగ్దేవీ సాహితీ వేదిక, సేవా ప్రాధాన్య సాహితీ వేదిక, కుసుమ ధార్మిక కళాపీఠం, విమల సాహితీ సమితి, కవితారల వేదిక లాంటి సాహితీ సంస్థల్లో నిర్వహించిన కవితా పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. తన స్వీయ రచనలను పుస్తక రూపంలో పొందుపరిచిన లగిశెట్టి రేపటి వెలుగు, నవ్య నానీలు పుస్తకాలు విడుదలయ్యాయి. కాగా రేపటి వెలుగు పుస్తకానికి గాను ప్రభాకర్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కమిటీ చైర్మెన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా 'తెలుగు కీర్తి' సాహిత్య పురస్కారం అందుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త లింగంపల్లి రామచంద్ర, తెలంగాణ సాహిత్య అకాడెమీ తొలి అధ్యక్షులు నందిని సిధారెడ్డి చేతుల మీదుగా గౌరవ సత్కారం సైతం అందుకున్నారు.



లగిశెట్టి రచించిన రేపటివెలుగు పుస్తకం

ఆహ్లాదం పంచేలా..

పర్యాటకులు మెచ్చేలా..



కట్టపై నుంచి బోటింగ్ పాయింట్ వద్దకు వెళ్లేందుకు ఆకర్షణీయంగా నిర్మించిన మెట్లు

- అభివృద్ధి దిశగా పాకాల సరస్సు ప్రాంతం
- పర్యాటకులకు వసతుల కల్పనకు ఏర్పాట్లు

ఖానాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలకు, రమణీయ దృశ్యాలకు నెలవు పాకాల సరస్సు. ఈ సరస్సు చుట్టూ ఉన్నా అభయారణ్యం, చెట్లు చేమలు, ఎత్తైన కొండల మధ్య నిండుకుండలా కనిపించే పాకాల సరస్సు ప్రకృతి రమణీయతకు ఆలవాలంగా విలసిల్లుతోంది. సరస్సు మధ్యలో ఉండే చిలుకల గుట్ట, కట్ట వెంబడి ఉన్న తూములు, మత్తడి ప్రదేశం, బటర్‌ఫ్లై గార్డెన్, తూములపై నుంచి సరస్సు అందాలను వీక్షిస్తూ పర్యాటకులు మురిసిపోతుంటారు. ఈ క్రమంలో పాకాల సరస్సు సందర్శనకు వచ్చే పర్యాటకుల మదిని దోచేలా సొబగుల కల్పనకు అడుగులు పడుతున్నాయి. పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసేందుకు పాకాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పాకాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి.

ఆహ్లాదం పంచేలా.. పర్యాటకులు మెచ్చేలా...

పాకాల పర్యాటనకు వచ్చే పర్యాటకులు ఆహ్లాద వాతావరణంలో విహరించేలా, వారి మనసును దోచుకునేలా పాకాలలో ఎకో టూరిజంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.30లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాకాలలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. బోటింగ్ పాయింట్ వద్దకు వెళ్లేందుకు కట్టపై నుంచి బోటింగ్ పాయింట్ వరకు మెట్ల నిర్మాణం చేపట్టి ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన క్రొకొడైల్ సఫారీ ఆర్చి పర్యాటకులను ఆకట్టుకొంటోంది. అదేవిధంగా కట్టపై బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పర్యాటకులు కట్టపై విహరిస్తూ సరస్సు అందాలను వీక్షించేందుకు బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు బటర్ ఫ్లై గార్డెన్ ఆధునీకరణ, వ్యూపాయింట్ ఏర్పాటు, బండ్ ప్లాంటింగ్, చిల్డ్రన్ గార్డెన్, నైట్ క్యాంపింగ్ ఏరియా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బ్యాటరీ వాహనం



పాకాల సరస్సు వ్యూ పాయింట్



పాకాలలో ఏర్పాటు చేసిన బోటింగ్ పాయింట్

టూరిజం సర్క్యూట్‌గా పాకాల

పాకాల అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించారు. టూరిజం సర్క్యూట్‌గా పాకాలను అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. పాకాలలో ట్రెక్కింగ్ సౌకర్యంతో పాటు జంగిల్ సఫారీ, పాకాల నుంచి భీమునిపాదం మీదుగా పులిమడుగు తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా పాకాలను అభివృద్ధి చేయనున్నారు.

వీటిపై కూడా దృష్టి సారించాలి..

పాకాల సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇంతకాలం సరైన వసతులు, సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాకాలలో ఏర్పాటు చేసిన హరిత రెస్టారెంట్ నిర్వాహణ సరిగా లేక పోవడం, భోజన వసతి లేక పర్యాటకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కనీసం పాకాలలో ఆహారం, తాగునీరు, కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాకాలలో గతంలో ఏర్పాటు చేసిన అధ్యాయన కేంద్రం, జిప్‌లైన్ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి వాటిని పునరుద్ధరించాల్సిన అవస రం ఉంది. అదేవిధంగా ఔషధ వనంలోని మొక్కలు ఎండిపోయాయి. పాకాల కట్టపైన గ్రీనరీ లేకపోవడంతో పాకాల పరిసరాలు కళావిహీనంగా దర్శనవిస్తున్నాయి. వీటిపై దృష్టిసారించి పర్యాటకులను ఆకర్షించే విధంగా పాకాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉంటుందని పర్యాటకులు ఆశిస్తున్నారు.

అవకాశం.. దక్కేనా?

మంత్రి వర్గ విస్తరణపై ఆశావహుల్లో ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినా.. కులసమీకరణలు కలిసి రాకపోవటంతో వారికి నిరాశే ఎదురవుతోంది. అయితే త్వరలో జరగబోయే విస్తరణలో కొత్తగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేరు తెరపైకి వస్తోంది. అయితే సీఎం రేవంత్ రెడ్డితో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్న దొంతి మాధవరెడ్డికి అసలు మంత్రివర్గంలో చోటు ఎలా దక్కుతుందనే చర్చ కూడా మొద లైంది. ఎన్నికలకు ముందు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో హత్‌సే హత్ జోడో యాత్రను నిర్వహించారు. కానీ అప్పట్లో ఆయన నర్సంపేట నియోజకవర్గానికి మాత్రం రాలేకపోయారు. మాధవరెడ్డి సహకరించకపోవటంతోనే రేవంత్ రెడ్డి నర్సంపేటలో పర్యటించలేదనే చర్చ ఉంది. అంతేకాకుండా సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా మర్యాదపూ ర్వకంగా కూడా దొంతి కలవలేదనే ప్రచారం ఉంది. పైగా ఈ 15నె లల కాలంలో సీఎం రేవంత్ నాలుగై దు సార్లు ఉమ్మడి వరంగల్ పర్యటనకు వచ్చినా.. మాధవరెడ్డి దూరా న్ని పాటించారు. సీఎంతో కలిసి ఒక్క సభలో కూడా పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి కోసం మాధవరెడ్డి ఢిల్లీ స్థాయిలో ఏఐసీసీ నేతలతో తీవ్ర లాబీయింగ్ చేశారనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న క్రమంలో మాధవరెడ్డికి మంత్రి పదవిని ఇప్పించేందుకు ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా జరుగుతోంది. అయితే నల్లగొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం సుముఖంగా లేకపోతే.. అదే సామాజిక వర్గానికి చెందిన మాధవరెడ్డికి మంత్రి పదవి పక్కా అని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో భరోసా కల్పించడంతో పాటు కొత్తగా పార్టీలోకి వచ్చేవారికి పార్టీ అండగా ఉంటుందన్న సంకేతాలు ఇచ్చేందుకు ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్ఠానంపై ఒత్తిడి పెరుగుతోందన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే సీనియర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అవకాశం దక్కవచ్చుననే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబంధాలు కడియం శ్రీహరికి కలిసొస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తిరుపతిలో భద్రకాళి శేషుకు సత్కారం

అగమ విద్వన్మణి పురస్కారం ప్రదానం



సత్కారం అందుకుంటున్న భద్రకాళి శేషు

హనుమకొండ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉగాది పర్వాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన విశ్వవిద్యాలయ వార్షికోత్సవ సమారోహణలో వరంగల్ నగరానికి చెందిన భద్రకాళి అలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు అగమ విద్వన్మణి బిరుదుతో ఘనంగా సత్కారం అందుకున్నారు. సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ జి. ఆర్‌ఆర్ కృష్ణమూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్త రాఘవేంద్ర చేతుల మీదుగా భద్రకాళి శేషు సత్కారాన్ని పొందారు. ఈ సందర్భంగా భద్రకాళి శేషు తిరుపతి నుంచి ఆంధ్రజ్యోతిలో మాట్లాడుతూ.. తిరుపతిలో జరిగిన తన సత్కారంతో తన జన్మ ధాన్యమైందన్నారు. అమ్మవారి కృపవల్లే తనకు ఈ అవకాశం లభించిందన్నారు.

న్యాయవాది ఇజ్రాయేల్ హత్య అమానుషం

• ఖండించిన న్యాయవాదులు • విధుల బహిష్కరణ

వరంగల్ లీగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఇజ్రాయేల్‌ను హత్య చేయడం అమానుషమని వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ హిమయత్‌నగర్‌లోని తన ఇంటి వద్ద బైక్‌పై వెళ్తుండగా కత్తితో దాడి చేసి హత్య చేయడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. ఈ చర్యను నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు వరంగల్ జిల్లా కోర్టు ఎదుట విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా ప్రజలపై కేసులు వాదిస్తున్న న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వాలు న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లాడే రమేష్, సీనియర్ న్యాయవాదులు ఎం. సహోదర్‌రెడ్డి, పులి సత్యనారాయణ, అల్లం నాగరాజు, విజేందర్, రఘుపతి, కె. అంబరీష్‌రావు, బొమ్మ నాగరాజు, శామంతుల శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులు, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలను
సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి 31 వరకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు హనుమకొండ జిల్లా కేంద్రంలోని గ్రామీణ ప్రాంతాలోని విద్యార్థులకు ఉచితంగా వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. అదే విధంగా ఈ శిక్షణ శిబిరాల్లో తాత్కాలిక కోచ్‌లుగా పని చేసేందుకు పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు ఏప్రిల్ 15వ తేదీ లోపు హనుమకొండ లోని డీఎస్‌ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 93929 97668 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన పీసీ అండ్ పీఎన్‌డీటీ అథారిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్ట నియమాలను పాటించాలని, సక్రమంగా రికార్డులు నిర్వహించాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన బోర్డును అందరికి కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. వైద్యాధికారులు రిజిస్టర్ అయిన కేంద్రాలనేకాక రిజిస్టర్ గాని ఆసుపత్రులను కూడా తనిఖీ చేయాలన్నారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు పబ్లిక్ స్థలాల్లో పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. ప్రజలలో అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులను కూడా భాగస్వాములు చేయాలన్నారు. వీరు గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించడమే కాక గర్భిణీ స్త్రీలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఇవి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

జంతుశాస్త్రంలో కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేయూ జంతుశాస్త్ర విభాగం పరిశోధకురాలు బూర్గుల కవిత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కవిత 'ఎక్స్‌ట్రాక్షన్, ఐసోలేషన్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ బయో యాక్టివ్ ప్రిన్సిపుల్స్ ప్రం కేలట్రోపిస్ ప్రొసీరా రూట్ ఎక్స్‌ట్రాక్ట్ అండ్ ఎవాల్యూవేషన్ ఆఫ్ ఇట్స్ యాంటీ బ్యాక్టీరియల్ పొటెన్షియల్ అగైన్స్ హ్యూమన్ పాతోజినిక్ బ్యాక్టీరియా' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కవిత పలు సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన కవితను పలువురు అభినందించారు.

ఆశా కార్యకర్తలపై దాడి అమానుషం



పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వస్తున్న ఆశాలు

వడ్డెపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్లు హైదరాబాద్‌లోని మెడికల్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారిపై నిర్దాక్షిణ్యంగా పోలీసులు దాడి చేయడం అమానుషమని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. ఆశాలపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ. 18 వేల వేతనం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయకుండా దాటవేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్‌యూనియన్ సీఐటీయూ జిల్లా నాయకురాళ్లు సీహెచ్. రాజేశ్వరి, శోభ, లీల, గొర్రె పుతిలి, రమ, భాగ్య, సంపూర్ణ, స్వప్న, కవిత, తారలతో పాటు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యువత అంకుర సంస్థలు స్థాపించాలి

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : యువత ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూడకుండా అంకుర సంస్థల స్థాపనకు కృషి చేయాలని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ చైర్మన్ జేఏహెచ్ చౌదరి పిలుపునిచ్చారు. కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం జూనియర్ కార్నివాల్ పేరుతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన అనిరుధ్ గౌడ్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ వాహిణిదేవి, ప్రొఫెసర్ కె. రాజిరెడ్డి, ప్రొఫెసర్ కృష్ణమాచారి, ప్రిన్సిపాల్ శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

జులైవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి మహ్మద్ ముస్తాక్ నేహల్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ కిట్లను పంపిణీ చేశారు. మంగళవారం రెవెన్యూ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ మల్లారెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

కొత్త నిబంధనలు వర్సిటీలకు నిరోధకం

» ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు అంజన్‌రావు
» కేయూలో ఎస్ఎఫ్ఐ 52వ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌రావు

కేయూ క్యాంపస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ఇటీవల తెచ్చిన యూజీసీ కొత్త నిబంధనలు రాష్ట్ర వర్సిటీలకు ప్రతిబంధకాలుగా మారుతున్నాయని సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ ఏ.అంజన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూ మ్యాథ్స్ విభాగంలో ఎస్ఎఫ్ఐ కేయూ 52వ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యక్షుడు సాయికిరణ్, డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, కృష్ణయ్యలు జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభల్లో అంజన్‌రావు, శ్రీధర్ లోథ్‌లు మాట్లాడారు. రాష్ట్రాల్లోని వర్సిటీలకు వీసీ నియామకాలపై గవర్నర్ల పెత్తనాన్ని పెంచి కేంద్రం వర్సిటీలను తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. వీసీలకు 10 ఏళ్ళ ప్రొఫెసర్ అనుభవాన్ని తొలగించడాన్ని ఖండించారు. విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. వర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వర్సిటీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నూరి, కార్యదర్శిగా బీరెడ్డి జశ్వంత్, ఉపాధ్యక్షులుగా ఎం. పరిమళ, సహాయ కార్యదర్శులుగా పురుషోత్తం, సాయి కిరణ్, ఇప్ప మల్లేశ్, కమిటీ సభ్యులుగా అజయ్, సియా న్, ప్రశాంత్, సందీప్‌రాజ్, రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కాగా, ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. గడ్డం కృష్ణయ్య, అంజన్‌రావు,తో పాటు బొట్ల చక్రపాణి, బొచ్చు కల్యాణ్, బొచ్చు ఈశ్వర్, ఎమ్డీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



విందులో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు, అడిషనల్ జేసీ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టు గుట్ట కేఎల్ఎన్ ఫంక్షన్ హాలులో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, అడిషనల్ జాయింట్ కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పాల్గొని ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యమన్నారు. ఉపవాస దీక్షను చేస్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సామూహిక నమాజ్ అనంతరం ఉపావాస దీక్షచేపట్టిన వారికి ఫలహారాలు తినిపించి ఉపావాస దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చల్ల ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఎస్సై శ్రీకాంత్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, కార్పొరేటర్ అరుణకుమారి, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మని శేఖర్‌రావు, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహెందర్‌రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అన్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మడికొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) మడికొండలోని బురుజు వద్ద మంగళవారం చెత్త డంపింగ్ యార్డుపై అవగాహన కలిగిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఆటోలకు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా అడహక్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ చెత్త డంపింగ్ యార్డు సమస్య తీవ్రతపై ప్రతీ ఒక్కరిలో అవగాహన రావాలని సమస్య వల్ల జరిగే నష్టాన్ని తెలుసుకోవాలని కోరారు. అందరూ ముందుకు వచ్చి పోరాటం చేస్తేనే మన సమస్యను మనం పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆర్ఎంవోలకు అభినందన

వరంగల్ మెడికల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆర్ఎంవోలు 1, 2 ఇన్‌చార్జిలుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అంబి శ్రీనివాస్, డాక్టర్ శశికుమార్‌లకు టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులు మంగళవారం పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. టీఎన్‌జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కార్యాలయంలో వారికి అభినందనలు తెలిపారు.



ఆర్ఎంవోలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

చలివేంద్రం ప్రారంభం

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దాహార్తిని తీర్చడంలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగుల పాత్ర అద్వితీయమని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ, టీఆర్‌వికేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి జాన్సన్ ఆధ్వర్యంలో హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సీఎండీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వెలుగుల జ్యోతిని నింపడంతో సామాజిక సేవలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ముందుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, టి. మధుసూదన్, సీజీఎంలు రవీంద్రనాద్, వెంకటరమణ, జీఎంలు వేణుబాబు, హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు మధుసూదన్, గౌతంరెడ్డి, హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ ప్రతినిధులు ఫాతిమారెడ్డి, ప్రభాకర్, రఘు, మధుసూదన్‌రెడ్డి, రాజు, నరేందర్‌పాల్ పాల్గొన్నారు.

భరోసా, షీ టీమ్ కేంద్రాల పరిశీలన

వరంగల్ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వరంగల్ కమిషనరేట్ క్రైం డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్ మంగళవారం భరోసా, షీటీమ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐలు సువర్ణ, సుజాతలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. భరోసా సెంటర్ ద్వారా లైంగిక దాడులకు గురైన బాలికలు, మహిళలకు అందిస్తున్న సేవల గురించి ఇన్‌స్పెక్టర్ సువర్ణ వివరించారు. అలాగే షీటీం పనితీరుతో పాటు మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను షీటీం ఇన్‌స్పెక్టర్ సుజాత డీసీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో షీటీం ఇన్‌స్పెక్టర్ కంచి విద్యాసాగర్, షీటీం సిబ్బంది పూర్ణ, లక్ష్మీ, వంశీ, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

హసన్‌పర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంగళవారం హసన్‌పర్తి బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు యువకులు తమ ప్రాణాలను పోగొట్టుకొని తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డు నుంచి అనంతసాగర్ వరకు 8 ప్రమాదాలు జరిగే స్థలాలు ఉన్నాయన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు, కుల సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

» వేసవిలో తరగతుల నిర్వహణ సరికాదు
» డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి

హనుమకొండ చౌరస్తా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధలనకు విరుద్ధంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కాలేజీలపై జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. తిరుపతి డిమాండ్ చేశారు. మంగ ళవారం హనుమకొండ బాలసముద్రంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో తిరుపతి పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి మానసిక ప్రశాంతత అవసరమని డాక్టర్లు చెబుతున్న అవేమి పట్టించుకోకుండా ప్రైవేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలు కోచింగ్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు ధ్వజమెత్తారు. వేసవిలో కోచింగ్‌ల పేరుతో విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న ప్రైవేటు కాలేజీలకు ర్యాంకులే కావాలి తప్ప విద్యార్థుల ఆరోగ్యం అవస రం లేదని, కోచింగ్‌ల పేరుతో వేలాది రూపాయాలు వసూలు చేస్తుంటే జిల్లా ఇంటర్ విద్యా శాఖాధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంటర్ బోర్డు షెడ్యూల్ ప్రకటించక ముందే అడ్మిషన్లు నిర్వహిస్తూ, ముందస్తు తరగతులు, కోచింగ్‌లు నిర్వహిస్తున్న ప్రైవేట్ జూని యర్ కాలేజీల పై చర్యలు తీసుకోవాలని, లేదంటు డీవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తిరుపతి హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, వరంగల్ జిల్లా కార్యదర్శి డి. సాంబమూర్తి, నాయకులు మంద సుచందర్, చిరంజీవి, యువన్, కర్ణాకర్, అనిల్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

అందరికి అందుబాటులో వైద్యం

హరిత మెడికల్ ఆఫీసర్, పూరిగుట్ట బస్తీ దవాఖాన



ఆంధ్రజ్యోతి : మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా ?

మెడికల్ ఆఫీసర్ : అన్ని మందులతో పాటు కుక్కకాటుకు సంబంధించిన మందులు సైతం అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ఆస్పత్రి టైమింగ్స్ ఎప్పుడు ?

మెడికల్ ఆఫీసర్ : ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.

ఆంధ్రజ్యోతి : ఎంత మంది స్టాఫ్ ఉన్నారు ?

మెడికల్ ఆఫీసర్ : మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సుతోపాటు సపోర్టింగ్ స్టాఫ్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : ఏఏ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు ?

మెడికల్ ఆఫీసర్ : సీబీపీ, లిక్విడ్ ప్రొఫైల్, థైరాయిడ్, ఎల్ఎఫ్‌టీ, ఆర్ ఎఫ్‌టీ, హెచ్‌బీఏఎల్‌సీ పరీక్షలు నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి : రోజు ఓపీ పరీక్షలను ఎంత మందికి చూస్తారు ?

మెడికల్ ఆఫీసర్ : ప్రతిరోజూ 50 నుంచి 70 మందికి ఓపీ పరీక్షలు నిర్వహిస్తాం, పూరిగుట్ట, పోలీసు కాలనీ, ఆర్టీసీ, పరిమళ, సప్తగిరి కాలనీలతో పాటు మరికొన్ని కాలనీల ప్రజలు వైద్య పరీక్షల కోసం వస్తారు.

వడ్డెపల్లి, (ఆంధ్రజ్యోతి)

పార్ట్‌టైం అధ్యాపకుల నోటిఫికేషన్ జారీ చేయాలి

కేయూ క్యాంపస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో గత పదేళ్లుగా పార్టుటైం అధ్యాపకుల నోటిఫికేషన్ జారీ చేయకుండా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడుతున్నారని కేయూ పార్టుటైం అశవాహుల సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూ లైబ్రరీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేతల డాక్టర్ పాలమాకుల కొమురయ్య, మహ్మద్ పాషాలు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో వర్సిటీలను ప్రక్షాలన చేస్తామని, నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రకటించి ఓట్లను దుండుకుని అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. సీఎం మాటలన్ని నీటిమూటలయ్యాని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంతో పాటు ఇతర అధికారులకు విన్నవించామన్నారు. పార్టుటైం నియామకాలు చేపట్టకపోతే వర్సిటీలో నిరవధిక నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని నోటిఫికేషన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. వీసీ ప్రతాప్‌రెడ్డి వర్సిటీ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, డాక్టర్ అరూరి రంజిత్‌కుమార్, డాక్టర్ వంగా మల్లేశ్ గౌడ్, డాక్టర్ ఓర్సు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సప్తగిరికాలనీ, ఆర్టీసీ కాలనీ ఏరియాలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 వరకు, ప్రశాంత్‌నగర్ (రామాలయం, పోచమ్మటెంపుల్, తేజస్వీ పాఠశాల)సమీప ఏరియాలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రవీందర్

హసన్‌పర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కేయూ ఎస్సై ఓ.రవీందర్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం జాగృతి కళా బృందం, కేయూ పోలీస్‌స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై కలిగే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రవిందర్ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దన్నారు. చదువు ప్రాముఖ్యత, గుడ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి తెలియజేశారు. సైబర్ మోసాల బారిన పడవద్దని, సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 వినియోగంపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉంటామని యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ యాంటి డ్రగ్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, నాగార్జునరెడ్డి, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ఆఫీసర్లు, కళాబృందం ఇంచార్జి ఉమెన్ ఏఎస్సై నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, కానిస్టేబుళ్లు పూల్‌సింగ్, హోంగార్డులు శ్రీనివాస్, విక్రంరాజు, చిరంజీవితో పాటు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట హుండీ ఆదాయం రూ. 7,22,549

మడికొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ. 7,22,549 ఆదాయం వచ్చిందని మంగళవారం దేవస్థాన ఈవో శేషభారతి వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని వరంగల్ దుర్గేశ్వరస్వామి దేవస్థానం ఈవో ప్రసాద్ సమక్షంలో లెక్కించారు. శివాలయం హుండీల ద్వారా రూ. 2,57,619లు, రామాలయం హుండీల ద్వారా రూ. 37,548, సేవా టికెట్ల ద్వారా రూ. 4,27,282 మొత్తం రూ. 7,22,549 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారిపెల్లి సత్యనారాయణశర్మ, రాజరాజేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కేయూ క్యాంపస్ టోర్నమెంట్

రన్నింగ్, జంపింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

కేయూ క్యాంపస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్ కళాశాల టోర్నమెంట్ క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. 10 రోజులుగా కేయూ క్యాంపస్ క్రీడామైదానంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కుమార్ నేతృత్వంలో వర్సిటీలోని 28 విభాగాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. క్యాంపస్‌లోని అన్ని విభాగాల మొదటి, రెండో ఏడాది విద్యార్థులను జట్లుగా విభజించారు. కబడ్డీ, క్రికెట్, లాంగ్ జంప్, హై జంప్, అథ్లెటిక్స్‌తో పాటు ఇతర క్రీడా అంశాల్లో విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు విడుతలుగా పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. 800, 400, 100 మీటర్ల లాంగ్ జంప్, హై జంప్ క్రీడాపోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. అలాగే 400 మీటర్ల షాట్‌పుట్ , డిస్క్‌త్రో, జావలీన్ త్రో పోటీలు జరిగాయి. అలాగే సాయంత్రం లాంగ్ జంప్, హై జంప్, త్రిపుల్ జంప్ 800 మీటర్ల పోటీలు జరిగాయి. అలాగే 800, 400, 100 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఏప్రిల్‌లో నిర్వహించే కళాశాల స్పోర్ట్స్, కల్చరల్ డేను పురస్క రించుకుని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తారు.



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం



ఫ్యాషన్

అన్నిసార్లూ తీరికగా సింగారించుకునే సమయం ఉండదు. ఒక్కోసారి క్షణాల్లో తయారు కావల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో తక్కువ శ్రమతో ఎక్కువ ఆకర్షణీయంగా కనిపించాలనుకుంటే, నిస్సందేహంగా జంప్‌సూట్స్‌ను ఎంచుకోవచ్చు. ఈ వినూత్న డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా?

ఈ డ్రస్‌లు అన్ని వయసుల వారికీ నప్పుతాయి. వైవిధ్యంగా, విభిన్నంగా కనిపించాలనుకుంటే, మరో ఆలోచన లేకుండా జంప్‌సూట్స్‌ను ఎంచుకోవాలి. అన్ని సందర్భాలకూ, వేడుకలకూ నప్పే ఈ దుస్తులు భారీ హంగులతో కూడా రూపొందుతున్నాయి. ఫ్యూజన్ లుక్‌తో కనిపించేలా పట్టుతో కూడా తయారవుతున్నాయి. శాటిన్, సింథటిక్, కాటన్...ఇలా పలు రకాల వస్త్రాల్లో దొరుకుతున్నాయి.



జంప్‌సూట్స్ జోరు

సొబగులు జోడించి...

జంప్‌సూట్‌లో సంప్రదాయబద్ధంగా కనిపించాల నుకుంటే ఆక్సిడైజ్డ్ ఝుంకాలు, చాంద్‌బాలీలు పెట్టుకోవాలి. మెరుపులీనే నెక్లెస్, జుత్తీలు, కోల్హాపురి చెప్పులతో మ్యాచ్ చేయాలి. ఆధునికంగా కనిపించాలనుకుంటే స్లింగ్ బ్యాగ్, హైహీల్స్ ధరించాలి. స్లీవ్‌లెస్ జంప్‌సూట్ వేసవి సెలవుల విహారాలకు అనువుగా ఉంటాయి. ఎక్కువ వదులుగా ఉండే కాటన్ జంప్‌సూట్స్ స్నేహితులతో కాలక్షేపం చేసే సాయంకాలపు విహారాలకు అనువుగా ఉంటాయి.

శరీరాకృతికి తగ్గట్టు...

పియర్ షేప్ ఉన్నవారు వెడల్పాటి కాళ్లతో కూడిన జంప్‌సూట్ ఎంచుకోవాలి. యాపిల్ శరీరాకృతి కలిగిన వాళ్లు సన్నని నడుమును హైలైట్ చేయడం కోసం ఒంటికి హత్తుకునే జంప్‌సూట్ వేసుకోవాలి. ఆకర్షణీయమైన శరీరాకృతి కలిగిన వాళ్లు ర్యాప్ జంప్‌సూట్ వేసుకోవచ్చు. ఇక అవర్‌గ్లాస్ శరీరాకృతి కలిగిన వాళ్లు బెల్టెడ్ జంప్‌సూట్ ఎంచుకోవాలి. మిక్సింగ్, మ్యాచింగ్ ఇబ్బంది లేదు కాబట్టి నచ్చిన జంప్‌సూట్స్‌ను అందుబాటులో ఉంచుకుంటే, చటుక్కున అందుకుని క్షణాల్లో సిద్ధమైపోవచ్చు.

శిక్షణ ఇస్తే... వాళ్లూ మెరికలే

సంకల్పం

ఆదివాసీ పిల్లల దుర్భర పరిస్థితులను చూసి ఆమె చలించిపోయారు. సరైన దిశానిర్దేశం ఉంటే వారూ మెరికల్లా తయారవుతారని భావించారు. అందుకు ఒక సంస్థను నెలకొల్పి... దాని ద్వారా వేలమంది అణగారిన వర్గాలవారికి ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. 'బొల్లినేని మెడ్‌స్కిల్స్' వ్యవస్థాపకుల్లో ఒకరు, సంస్థ అకడమిక్ డైరెక్టర్... లక్ష్మీపద్మజతో 'నవ్య' మాటామంతి.



"సరిగ్గా పదేళ్ల కిందట... అప్పుడు మేం హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. మా అమ్మాయి ఇంటర్ పూర్తయింది. ఎంసెట్ రాస్తే శ్రీకాకుళం మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. మాకు ఒక్కతే అమ్మాయి. తనను ఒంటరిగా పంపడం ఇష్టంలేక మేం కూడా శ్రీకాకుళం వచ్చాం. ఇక్కడకు వచ్చాక ఆదివాసీలు, అణగారిన వర్గాల వారి జీవన స్థితిగతులు ప్రత్యక్షంగా చూశాం. ముఖ్యంగా బంగరు భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు ఆరంభంలోనే మసిబారిపోతున్నాయి. ఇది నన్ను కలచివేసింది. దీనికి కారణాలు అన్వేషిస్తున్న క్రమంలో ప్రధానంగా నేను గమనించింది ఏంటంటే... వాళ్లల్లో నైపుణ్యానికి కొదవ లేదు. కానీ కెరీర్‌కు సంబంధించి సరైన మార్గనిర్దేశం లేక వెనకబడిపోతున్నారు. ఎవరో ఏదో కోర్సు చేస్తున్నారంటే ఆ ప్రాంతంలో మిగిలినవారు కూడా మరో ఆలోచన లేకుండా అటే పరుగెత్తేవారు. అలా కాకుండా వారిలోని నైపుణ్యాన్ని బయటకు తీసి, సరైన దారిలో నడిపించగలిగితే మంచి ఫలితాలు వస్తాయనిపించింది. దీని కోసం ఒక సంస్థను నెలకొల్పాలని నేను, మావారు నాగేశ్వరరావు అనుకున్నాం. మా ఆలోచనను 'కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్' ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు గారితో పంచుకున్నాం. ఆయన మార్గదర్శకత్వంలో 'బొల్లినేని మెడ్‌స్కిల్స్'ను 2016లో నెలకొల్పాం. హెల్త్‌కేర్ కోర్సులు అందించే ఉద్దేశంతో ఏర్పాటైన సంస్థ ఇది. దీని ద్వారా ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. బతుకు బండి నడవడానికి ఉద్యోగం చేసుకొంటూనే చదువుకొనేలా ఇక్కడ కోర్సులు డిజైన్ చేశాం.

ఉద్యోగాలు వదిలేసి...

మా స్వస్థలం కృష్ణాజిల్లా చినఓగిరాల. అయితే నా చిన్నప్పుడే మా కుటుంబం బళ్లారి జిల్లా కంప్లీకి వెళ్లిపోయింది. అమ్మ ధనలక్ష్మి, నాన్న వీరచందర్‌రావు... ఇద్దరూ వ్యవసాయం చేసేవారు. నాకు ఇద్దరు అన్నలు. నా పాఠశాల విద్యాభ్యాసం అంతా సండూరు రెసిడెన్షియల్ హాస్టల్‌లోనే సాగింది. ధార్వాడ్‌లో బీఎస్సీ బీజెడ్‌సీ చదివాను. గోల్డ్ మెడల్ సాధించాను. మా గ్రామంలో మొట్టమొదటి గ్రాడ్యుయేట్‌ను నేనే. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో, కోచింగ్ కోసం ఢిల్లీ వెళ్లాను. మా అమ్మ ధనలక్ష్మి మద్దతు లేకపోతే అది సాధ్యమయ్యేది కాదు. ఐఎఫ్ఎస్ మెయిన్స్ వరకు వెళ్లాను. కానీ ఇంటర్వ్యూలో పోయింది. కోచింగ్ తీసుకొంటూనే ఢిల్లీ వర్సిటీలో ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ కోర్సు చదివాను. పీజీ అయ్యాక నాకు పెళ్లి చేశారు. నేను, మావారు మంచి ఉద్యోగాల్లో ఉన్నాం. కానీ ఎందుకో అందులో మాకు సంతృప్తిగా అనిపించలేదు. నేర్చుకున్నది తిరిగి ఈ సమాజానికి ఇవ్వాలనే తపన నాది. ఆయన ఆలోచనలు కూడా కలవడంతో 'మెడ్‌స్కిల్స్' సంస్థ పురుడు పోసుకుంది. ప్రస్తుతం దానికి నేను అకడమిక్ డైరెక్టర్‌గా ఉన్నాను. మార్కెటింగ్ లాంటివి మావారు చూస్తారు.

ఉన్నతంగా తీర్చిదిద్దాలి...



ఎంత పని ఒత్తిడి ఉన్నా... నేను కూడా పాఠాలు చెబుతుంటాను. ఇక్కడకు రాకముందు 'ఫిట్జీ'లో బోధించేదాన్ని. అలాగే కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ ఇస్తాను. వేరే కళాశాలలకు కూడా వెళుతుంటాను. ఇక మా అమ్మాయి 'యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ ఫ్లోరిడా'లో పీజీ చేస్తోంది. సైన్స్‌కు సంబంధించి మూడు పుస్తకాలు కూడా రాశాను. బయాలజీ, కెమిస్ట్రీ టెస్ట్ పేపర్స్ చేశాను. పలు పబ్లిషింగ్ హౌస్‌ల కోసం కంటెంట్ ఇచ్చాను. ఎస్సీఈఆర్టీ తదితర పరీక్షలకు ప్రశ్నపత్రాలు తయారు చేశాను. కొన్ని సంస్థలు గౌరవ సత్కారాలు, పురస్కారాలూ ఇచ్చాయి. ఈ సంస్థను మరింత విస్తరించి, మరింతమంది పేదలు, మహిళలకు ఉన్నతమైన కెరీర్ అందించాలనేది నా లక్ష్యం.

వర్సిటీలకు అనుబంధంగా...

మా సంస్థ ద్వారా దాదాపు 52 హెల్త్‌కేర్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నాం. తదనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. నాలుగు నెలల నుంచి నాలుగున్నర ఏళ్ల వరకు పారామెడికల్ డిప్లమో, పీజీ కోర్సులు, హెల్త్‌కేర్ రంగానికి సంబంధించిన నైపుణ్య శిక్షణ తరగతులు ఇందులో ఉన్నాయి. ఎన్‌టీఆర్, కాళోజీ నారాయణ, ఆంధ్రా, అంబేడ్కర్ తదితర విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా కోర్సులు అందిస్తున్నాం. అలాగే టాటా, టెక్ మహీంద్రా, జీఈ హెల్త్‌కేర్, ఏపీ పారామెడికల్ కౌన్సిల్‌తో కూడా కలిసి పని చేస్తున్నాం. శ్రీకాకుళంలో ప్రారంభమైన 'మెడ్‌స్కిల్స్' ఇప్పుడు దేశ వ్యాప్తంగా పదకొండు ప్రాంతాల్లో విస్తరించింది.

విదేశాల్లో స్థిరపడ్డారు...

ఇప్పటివరకు పన్నెండు వేల మందికి పైగా శిక్షణ తీసుకున్నారు. వారిలో తొంభై శాతం మంది హెల్త్‌కేర్ రంగంలో స్థిరపడ్డారు. నాలుగు వేల మంది ఆదివాసీ యువతకు శిక్షణ ఇచ్చాం. సంపాదిస్తూ చదువుకోవాలనేది మా కోర్సుల ప్రధాన ఉద్దేశం. ఆర్థికంగా వెనకబడినవారికి నైపుణ్య శిక్షణ ఉచితంగానే అందిస్తున్నాం. ఇటీవలే మా విద్యార్థులు ఇద్దరు లండన్ వెళ్లారు. నెలకు మూడు లక్షల జీతం పొందుతున్నారు. ఇంకొక అమ్మాయి సింగపూర్‌లో పని చేస్తోంది. ఇలా చాలామంది ఉన్నారు. కొబ్బరికాయలు కొట్టే ఒక వ్యక్తి వచ్చి... 'మా అమ్మాయి మంచి ఉద్యోగంలో స్థిరపడిందండి' అని చెబుతుంటే నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. ఇదే మేం కోరుకున్న మార్పు. ఇంతకుమించిన సంతృప్తి, సంతోషం ఏముంటుంది!

మహిళా సాధికారతకు...

ప్రస్తుతం అన్ని కేంద్రాలలో కలిపి రెండు వేల మందికి పైగా విద్యార్థులున్నారు. వాళ్లల్లో మహిళలు 73 శాతం, గిరిజనులు యాభై శాతానికి పైగా ఉంటారు. మహిళలను సాధికారత దిశగా అడుగులు వేయించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. అలాగే అనీమియా, పీసీఓడీ, నెలసరి సమయంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. పెళ్లయిన మహిళలకు వారి సౌకర్యాన్నిబట్టి శిక్షణ ఇచ్చి, ఇంటి వద్ద నుంచే పని చేసే వెసులుబాటు కల్పిస్తున్నాం. పదేళ్ల కిందట ఇక్కడ మా కార్యకలాపాలు ప్రారంభించేనాటికి... గిరిజనుల అమ్మాయిలు ఉద్యోగాల కోసం వేరే ఊళ్లకు వెళ్లేందుకు వెనుకాడేవారు. కానీ ఇప్పుడు నిస్సంకోచంగా వెళ్లగలుగుతున్నారు. మేం గమనించిన అతి పెద్ద మార్పు ఇది."

• హనుమా

పిల్లలు ఎప్పుడూ ఆడుతూ పాడుతూ ఉల్లాసంగా ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటూ ఉంటారు. అందుకు తల్లిదండ్రులు ఈ చిట్కాలు పాటిస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

రోజంతా ఉల్లాసంగా..

- పిల్లలకు కనీసం ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. అందుకే వాళ్లను రాత్రిపూట త్వరగా పడుకోబెట్టి ఉదయాన్నే నిద్ర లేపాలి. అప్పుడే వాళ్ల శరీరం, మెదడు విశ్రాంతి పొందుతాయి. పిల్లలు రోజంతా చురుకుగా ఉంటారు.
- పెద్దలకే కాదు పిల్లలకు కూడా వ్యాయామం అత్యవసరం. రోజూ కనీసం 20 నిమిషాలపాటు ప్రాణాయామం, సైక్లింగ్, స్కిప్పింగ్ లాంటివి చేయించాలి. దీంతో శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడి రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- రోజూ పోషకాలతో నిండిన అల్పాహారం తినిపించాలి. దీనివల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఎదుగుతారు.
- పిల్లల్లో చురుకుదనం, ఏకాగ్రత పెరగాలంటే శారీరక శ్రమతోపాటు ఆలోచన తీరుని మెరుగుపరచి, బుర్రకు పదునుపెట్టే ఆటలను ఆడించాలి. టెన్నిస్, చదరంగం, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, కరాటే లాంటివి ఇందుకు దోహదం చేస్తాయి. తోటివారితో ఆడుతూ ఉంటే పిల్లలు ఎప్పుడూ ఉత్సాహంగానే ఉంటారు.



- పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వాళ్లను చిన్నచిన్న పనుల్లో భాగస్వాములను చేయాలి. ఒత్తిడి, ఆందోళన లేకుండా చదువుకునేలా ప్రోత్సహించాలి. పడుకునేముందు కథలు చెప్పాలి.
- పిల్లలు ఏదైనా తప్పు చేసినా కోప్పడకుండా మెల్లగా వివరించి చెప్పాలి. సమస్య వచ్చినప్పుడు నేర్పుగా పరిష్కరించుకునే విధానాలను తెలియజెప్పాలి. దీంతో పిల్లలు చిన్న విషయాలకే ఆందోళన పడకుండా ధైర్యంగా ఉండగల్గుతారు.

మంచి అలవాట్లతో శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి అనారోగ్యమూ దరి చేరదు. అందంగా ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు ఇవే.

- చేతులను తరచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలి. సబ్బు లేదా హ్యాండ్ వాష్‌తో కనీసం ఇరవై సెకన్లు రుద్దుతూ కడుక్కోవాలి. అప్పుడే చేతులపై ఉండే హానికర బ్యాక్టీరియాలు, వైరస్‌లు నశిస్తాయి.

అందంగా.. ఆరోగ్యంగా..

- రోజుల తరబడి తువాళ్లను ఉతకకుండా ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరం. రెండు రోజులకు ఒకసారి తువాళ్లను ఉతకాలి. తడి తువాలుతో తుడుచుకోవడం కూడా మంచిది కాదు. ఒకసారి ఉపయోగించిన తరవాత తువాలును ఎండలో ఆరవేయాలి.
- గోళ్లను వారానికి ఒకసారి కత్తిరించుకోవాలి. గోళ్లలో మురికి చేరకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. గోళ్ల విషయంలో అశ్రద్ధ కనబరిస్తే శరీరంలోకి హానికారక క్రిములు ప్రవేశిస్తాయి.
- టూత్‌బ్రష్‌లో కూడా హానికర బ్యాక్టీరియాలు చేరుతూ ఉంటాయి. కాబట్టి టూత్‌బ్రష్‌ను కనీసం మూడు నెలలకు ఒకసారి మార్చుకుంటూ ఉండాలి. రోజుకి రెండుసార్లు బ్రష్ చేయాలి.
- ముఖాన్ని చేతులతో పదేపదే తాకకూడదు. చేతుల మీద ఉండే క్రిములవల్ల ముఖంపై మొటిమలు, బ్లాక్‌హెడ్స్ ఏర్పడతాయి. రోజూ ముఖాన్ని సున్నిపిండితో రుద్ది చల్లని నీళ్లతో కడుక్కోవాలి.



- మేకప్ కిట్స్, రేజర్లు, దువ్వెనలు, తువాళ్లు, చేతిరుమాళ్లు ఇతరులతో పంచుకోవద్దు. దీనివల్ల వ్యక్తిగత శుభ్రత మెరుగుపడుతుంది.
- బజారు నుంచి తీసుకొచ్చిన పళ్లు, కూరగాయలను ఉప్పు, పసుపు వేసిన నీళ్లతో కడగడం మంచిది. దీనివల్ల వాటిపై ఉండే పురుగుమందుల అవశేషాలు, హానికారక క్రిములు నశిస్తాయి.
- షూస్, చెప్పులను ఇంట్లో ఉంచకూడదు. వారానికి ఒకసారి వీటిని శుభ్రం చేసుకోవాలి. సాక్స్‌ని ఉతకకుండా ధరించకూడదు. బకెట్ వేడి నీళ్లలో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు వేసి కలిపి అందులో పాదాలు ఉంచి అరగంట తరవాత సబ్బుతో రుద్ది కడుక్కుంటే పగుళ్లు, అలెర్జీలు దరి చేరవు.



కిటికీల దగ్గర వీటిని ఉంచవద్దు..!

ఇంట్లో కిటికీల కింద అమర్చే చిన్న అరల మీద రకరకాల వస్తువులు పెడతాం. అయితే కిటికీల దగ్గర కొన్ని రకాల వస్తువులు ఉంచకూడదని నిపుణులు చెబుతున్నారు.

- కిటికీల దగ్గర డియోడరెంట్, పర్‌ఫ్యూమ్, స్ప్రే లాంటివి పెట్టకూడదు. అలా పెడితే బయటి నుంచి వచ్చే సూర్యరశ్మి వీటిపై పడి అవి ప్రభావితమవుతాయి. ఒక్కోసారి అవి పేలవచ్చు కూడా.
- అద్దాల తలుపులు ఉన్న కిటికీల దగ్గర దుప్పట్లు, దుస్తులు ఉంచవద్దు. అద్దం మీద సూర్యరశ్మి పడినప్పుడు మంటలు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.
- కిటికీ అరను వస్తువులతో నింపితే ఇంట్లోకి గాలి, వెలుతురు సరిగా ప్రసరించవు. అంతేకాకుండా బయటి నుంచి వచ్చే దుమ్ము, వాన నీటి వల్ల వస్తువులు పాడవుతాయి.
- కిటికీ అర మీద పెద్దవాళ్లు వేసుకునే మందు బిళ్లల షీట్లు, చిన్న పిల్లలు తాగే సిరప్ సీసాలను ఉంచకూడదు. బయటి నుంచి వచ్చే వేడి వల్ల అవి పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి.
- కొంతమంది కిటికీ అరను మొక్కలు పెంచే కుండీలతో నింపేస్తూ ఉంటారు. దీనివల్ల కిటికీని తరచూ శుభ్రం చేయడం వీలు కాకపోవచ్చు. కిటికీ మొత్తం దుమ్ము, ధూళితో నిండడంతో అపరిశుభ్రమైన గాలి ఇంట్లోకి వచ్చి అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది.
- వేసవికాలంలో కిటికీ అర మీద కొవ్వొత్తులు, లాంతర్లు లాంటి వాటిని పెట్టకూడదు.

నిందను మోసి... నిరపరాధిగా..

"పది మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు. ఒక నిర్దోషికి మాత్రం శిక్ష పడకూడదు" అనేది సహజ న్యాయ సూత్రాల్లో ప్రధానమైనది. బాలీవుడ్ నటి రియా చక్రవర్తి కేసులో ఈ న్యాయ సూత్రం గెలిచిందనిపిస్తుంది. నాలుగున్నరేళ్ల క్రితం ప్రముఖ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య కేసులో రియా ప్రధాన నిందితురాలు. ఆమెను విలన్‌గా పేర్కొంటూ సోషల్ మీడియాలో కొన్ని వేల వీడియోలు సుడిగాలిలా వ్యాపించాయి. "నా తప్పు లేదు.." అని ఆమె ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఎవరూ వినిపించుకోలేదు. నాలుగున్నరేళ్ల విచారణ తర్వాత- సీబీఐ ఈ కేసులో రియా తప్పు లేదని తేల్చింది. దీనితో మళ్లీ మరోసారి ఆమె వార్తల్లో వ్యక్తి అయింది. ఇన్ని సంచలనాలకు కారణమైన రియా కథేమిటంటే...

బాలీవుడ్‌లో అవకాశాలు కోసం ముంబాయికి ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది వస్తూ ఉంటారు. అలాంటి వారిలో రియా కూడా ఒకరు. రియా తండ్రి ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసేవారు. ఆర్మీ నేపథ్యం ఉంది కాబట్టి ఆమె దేశంలోని అనేక ప్రాంతాల్లో చదువుకుంది. చిన్నప్పటి నుంచే మోడలింగ్‌పై ఆసక్తి ఉన్న రియా... 2009లో 'ఎంటీవీ- టీవీఎస్ స్కూటీ టీన్ దీవా' అనే కార్యక్రమానికి యాంకర్‌గా ఎంపికయింది. ఆ తర్వాతి కాలంలో కొన్ని మోడలింగ్, వీడియో జాకీ (వీజే) అవకాశాలు లభించాయి. కానీ బాలీవుడ్‌లో మాత్రం ప్రవేశం దొరకలేదు. అయితే 2012లో తెలుగులో 'తూనీగ... తూనీగ' సినిమాలో హీరోయిన్ అవకాశం లభించింది. ఆ తర్వాత ఆమెకు బాలీవుడ్‌లోనూ అవకాశాలు మొదయలయ్యాయి. కానీ అగ్రశ్రేణి నటిగా మాత్రం ఎదగలేకపోయింది. ఈ నేపథ్యంలో... అప్పుడప్పుడే బాలీవుడ్‌లో ఎదుగుతున్న సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆమెకు పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆరునెలలలోనే వారిద్దరూ సహజీవనం మొదలుపెట్టారు. రియా తమ్ముడు షవిక్‌తో కలిసి సుశాంత్ సింగ్- ' వివిడ్ రేజ్ రిహాలిటిక్స్' అనే ఒక స్టార్టప్‌ను కూడా ప్రారంభించాడు. అంతా సజావుగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో - 2020, జూన్ 14వ తేదీన సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త దేశాన్ని కుదిపేసింది. సుశాంత్ ఆత్మహత్య చేసుకోవటానికి ఒక వారం ముందే రియా వేరుగా వెళ్లిపోయిందని, సుశాంత్‌కు డ్రగ్స్ అలవాటు చేసింది ఆమే అనీ రకరకాల వార్తలు వ్యాపించాయి. ఆ తర్వాత సుశాంత్ తండ్రి... తన కుమారుడి మరణానికి రియా కారణమని పోలీసు కేసు పెట్టారు. కొన్ని రోజులకే దాన్ని సీబీఐకి బదిలీ చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డు (ఎన్‌సీబీ), ఈడీలతో కలిపి ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేయటం మొదలుపెట్టింది. దీనికి బదులుగా రియా కూడా సుశాంత్ సోదరీమణులు ప్రియాంక, మీతూ సింగ్‌లపై కేసులు పెట్టింది. సుశాంత్ మరణానికి దారి తీసిన పరిస్థితులకు వీరిద్దరే కారణమని ఈ కేసుల్లో పేర్కొంది.

వాన వెలిసి...



కొద్దికాలం తర్వాత కోర్టులో రియాకు బెయిల్ లభించింది. 'ఎంటీవీ రోడ్డీస్'లో ఆమెకు మళ్లీ అవకాశం వచ్చింది. 'రియా- చాప్టర్ 2' అనే పాడ్‌కాస్ట్‌ను కూడా ప్రారంభించింది. పరిస్థితులు నెమ్మదిగా చక్కబడ్డాయి. ఈ సోమవారం రియాకు క్లీన్‌చిట్ ఇస్తూ... కోర్టులో సీబీఐ పిటిషన్ ఫైల్ చేసింది. దీనితో ఈ కేసు నుంచి రియాకు పూర్తిగా విముక్తి లభించినట్టయింది. గత ఆరేళ్లుగా న్యాయపోరాటాలతోనే కాలం గడిపిన ఆమెకు ఇకనైనా బాలీవుడ్‌లో అవకాశాలు లభిస్తాయో లేదో కాలమే చెప్పాలి.

అల్లకల్లోలం...

ఒక వైపు ఈ కేసుల్లో దర్యాప్తు జరుగుతుండగానే- మరో వైపు రియాను ఎన్‌సీబీ అరెస్ట్ చేసింది. దీనితో రియాపై మరోసారి సోషల్ మీడియాలో ట్రోలింగ్ ప్రారంభమయింది. ఒక వైపు జైలు.. మరో వైపు సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌లతో ఆమె జీవితం అతలాకుతలమైపోయింది. బాలీవుడ్‌లో వచ్చిన అవకాశాలన్నీ మాయమైపోయాయి. ఈ సమయంలో రియాకు ఆమె కుటుంబమే అండగా నిలబడింది. "అలాంటి సమయంలో ఏ ఒక్క చిన్న తప్పు మాట మాట్లాడినా ఆమె జీవితంలో పెనుమార్పులు వస్తాయి. అందుకే రియా కుటుంబం మౌనంగా ఉండి.. ఆమెకు అవసరమైన ధైర్యాన్ని ఇచ్చింది. ఆమె కూడా చాలా ధైర్యంగా పోరాడింది" అంటారు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సతీష్ మణిషిండే.



చిత్రజ్యోతి
SINCE 1965

రష్మిక సంతోషించారు
- శ్రీలీల



"రాబిన్‌హుడ్ చిత్రంలో హీరోయిన్‌గా రష్మిక చేయాల్సి ఉంది. ఆమెకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. కానీ డేట్స్ కుదరకపోవడం వల్ల దర్శకుడు వెంకీ కుడుముల నన్ను సంప్రదించారు. తను చేయల్సిన పాత్రను నేను చేసినందుకు రష్మిక ఎంతో సంతోషించారు" అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. ఈ చిత్రంలో ఆమె నితిన్‌కు జోడీగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీలీల మీడియాతో ముచ్చటించారు.

- ఇదొక ఫీల్‌గుడ్‌మూవీ. 'రాబిన్‌హుడ్' చిత్రంలో కథ విభిన్నంగా ఉంటుంది. ఇందులో పూర్తిస్థాయి వినోదం పంచే పాత్ర చేశాను. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్‌తో కాంబినేషన్ సీన్స్ ఆకట్టుకుంటాయి. నితిన్ నాకు మంచి మిత్రుడు. వెంకీ కథను మలిచిన తీరు ప్రేక్షకులను మెప్పిస్తుంది.
- 'పుష్ప 2' విడుదలయ్యాక 'కిస్సిక్' లాంటి ప్రత్యేక గీతాలు చేయమని చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ అంగీకరించలేదు. 'పుష్ప' సినిమాకు జాతీయ స్థాయిలో ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రత్యేక గీతం చేశాను. ఇతర సినిమాల్లో అలాంటి గీతాల్లో నర్తించాలనుకోవడం లేదు. పాటల్లో నృత్యభంగిమలపై మహిళా కమీషన్ స్పందించడం, సమాజంలో చర్చ జరగడం ఆహ్వానించదగిన పరిణామం. నృత్యభంగిమలు అమ్మాయిలకు ఇబ్బందికరంగా ఉండకూడదు. ఒకవేళ అసభ్యకరంగా ఉంటే అది చిత్రీకరణ సమయంలోనే తెలిసిపోతుంది.
- గత ఏడాది చాలా బిజీగా గడిచింది. నేను నటించినవి అరడజన్‌కు పైగా సినిమాలు విడుదలయ్యాయి. అందుకే ఈ ఏడాది సినిమాలను తగ్గించాను. ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ కావడంతో చదువుపై దృష్టిపెట్టాను. చాలా మంచి సినిమాలు వదులుకున్నాను. ఇకపై వరుసగా సినిమాలు చేస్తాను. తెలుగు అమ్మాయిగా సందేశాత్మక చిత్రాలు చేయాలనుకుంటున్నాను.
- బోర్డర్ దాటిన వెంటనే గాలి మారదు కదా. తెలుగు ఇండస్ట్రీ నా సొంతిల్లు. హిందీ చిత్రాలకే పరిమితమవ్వాలనే ఆలోచన లేదు. అన్నీ బ్యాలన్స్ చేయాలనుకుంటున్నాను. ప్రస్తుతం రవితేజతో 'మాస్ జాతర' చిత్రం చేస్తున్నాను. తమిళంలో సుధ కొంగర దర్శకత్వంలో చేస్తున్న 'పరాశక్తి' చాలా గొప్ప ప్రాజెక్ట్ అవుతుంది. కన్నడలో 'జూనియర్' చిత్రం చేస్తున్నాను.

సెట్స్‌లో గొడవ.. ఇప్పుడంతా ఓ.కే!



నయనతార ప్రధాన పాత్రలో దర్శకుడు సుందర్.సి 'మూకుతి అమ్మన్ 2' (అమ్మోరు తల్లి 2) చిత్రాన్ని ఇటీవల ప్రారంభించిన సంగతి తెలిసిందే. 2020లో విడుదలై ఘనవిజయం సాధించిన మూకుతి అమ్మన్ (అమ్మోరు తల్లి) చిత్రానికి ఇది సీక్వెల్. అయితే షూటింగ్ ప్రారంభించిన కొన్ని రోజులకే సెట్స్‌లో నయనతారకు, అసిస్టెంట్ డైరెక్టర్‌కు మధ్య విభేదాలు వచ్చాయట. ఒక దశలో కోపాన్ని అణుచుకోలేక నయనతార ఆ అసిస్టెంట్ డైరెక్టర్‌పై పెద్దగా అరిచేశారట. దీంతో ఈ సమస్య సద్దుమణిగేవరకూ దర్శకుడు సుందర్ షూటింగ్‌ను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. ఇటువంటి సరిస్థితుల్లో ఇక నయనతారతో పని చేయడం కష్టమనీ, సినిమాలో ఆమెకు బదులుగా తమన్నాను తీసుకుంటే బాగుంటుందేమో అనే ఆలోచన దర్శకుడు సుందర్‌కి వచ్చినట్లు చెబుతున్నారు. అయితే చిత్ర నిర్మాత ఇషారి.కె.గణేశ్ జోక్యం చేసుకోవడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయనీ... షూట్ కూడా తిరిగి ప్రారంభమైందని తాజా సమాచారం. ఈ సినిమా కోసం నయనతార నాన్ వెజ్ కూడా మానేసి భక్తి శ్రద్ధలతో పాత్రను పోషిస్తుండడం గమనార్హం.

పవన్‌కల్యాణ్ కరాటే గురువు
షిహాన్ హుసైని కన్నుమూత



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చిన షిహాన్ హుసైని(60) మరణించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. షిహాన్ హుసైని 1986లో విడుదలైన 'పున్నగై మన్నన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయం అయ్యారు. కాగా, షిహాన్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పోస్టు పెట్టారు. 'షిహాన్ హుసైని' తుదిశ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు గురయ్యాను. ఆయన వద్ద కరాటేలో శిక్షణ పొందాను. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని నాలుగు రోజుల క్రితమే తెలిసింది. ఈనెల 29న చెన్నై వెళ్లి పరామర్శించాలని అనుకున్నా. ఈలోపే దుర్వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదు. 'తమ్ముడు' సినిమాలో సన్నివేశాలకు ఆయన ఇచ్చిన శిక్షణే ఉపయోగపడింది' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

భారతీరాజా కుమారుడు మనోజ్ ఇకలేరు
- కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం



తమిళ దర్శక దిగ్గజం భారతీరాజా కుమారుడు, నటుడు, దర్శకుడు మనోజ్(48) హఠాన్మరణం చెందారు. కొన్ని నెలల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ ఆయన చేయించుకున్నారు, మంగళవారం సాయంత్రం కార్డియాక్ అరెస్ట్ కావడంతో చెట్‌పట్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1999లో 'తాజ్‌మహల్' అనే చిత్రం ద్వారా వెండితెరకు హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'సముద్రం', 'కడల్ పూక్కల్', 'సముద్రం, 'అల్లి అర్జున', 'వరుష మెల్లాం వసంతం', 'ఈర నిలమ్' వంటి పలు విజయవంతమైన తమిళ చిత్రాల్లో హీరోగా నటించారు. 2023లో 'మార్గళి తింగల్' అనే సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. మలయాళ నటి అశ్వతి అలియాస్ నందనను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆయనకు అర్శిత, మదివదని అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, మనోజ్ మరణవార్త తెలియగానే కోలీవుడ్ చిత్రపరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మనోజ్ ఆకస్మిక మృతిపట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

భావోద్వేగాలు అలరిస్తాయి



మాధవన్, నయనతార, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ప్రధాన తారాగణంగా రూపొందిన క్రీడా నేపథ్య చిత్రం 'టెస్ట్'. ఎస్. శశికాంత్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఏప్రిల్ 4న తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకొస్తోంది. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా మాధవన్ మాట్లాడుతూ 'అందరినీ కట్టిపడేసే భావోద్వేగాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రికెట్ ఆట నేపథ్యంలో తెరకెక్కిన చిత్రంగా మాత్రమే దీన్ని చూడొద్దు. సినిమాలో అంతకు మించి ఉంది. జీవితంలోని ఎత్తుపల్లాలు, మానవీయ విలువలను ప్రతిబింబించే కథ ఇది' అన్నారు.

దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది
- సూర్యదేవర నాగవంశీ



'పుష్ప-2' ఘన విజయం తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమాలపై అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అల్లు అర్జున్ చేతిలో అట్లీ, త్రివిక్రమ్, సందీప్‌రెడ్డి వంగా సినిమాలు ఉన్నాయి. అయితే వీటిలో తొలుత ఏది సెట్స్‌పైకి వెళ్తుందనే విషయమై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. అట్లీ చిత్రం పక్కా కమర్షియల్ అని, అలాగే త్రివిక్రమ్ తెరకెక్కించనున్న సినిమాలో అల్లు అర్జున్‌ది సుబ్రమణ్యేశ్వర స్వామి పాత్ర అని టాలీవుడ్‌లో ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నిర్మాత సూర్యదేవర నాగ వంశీ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. 'మ్యాడ్ స్క్వేర్' ప్రమోషన్‌లో భాగంగా తాజాగా తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'త్రివిక్రమ్, అల్లు అర్జున్‌లతో మైథాలజీ సినిమా చేస్తున్నాం. ఆ సినిమా చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది. మన పురాణాల్లో ఉన్న ఓ దేవుడి గురించి చూపించబోతున్నాం. అందరికీ తెలిసిన దేవుడు ఆయన. ఆయన కథతో ఈ సినిమా చాలా గ్రాండ్‌గా ఉండబోతుంది' అని తెలిపారు. కాగా, అల్లు అర్జున్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' సినిమాలు బాక్సాఫీసు వద్ద ఎంతటి ఘన విజయాలు నమోదు చేశాయో తెలిసిన విషయమే. తాజాగా నాగవంశీ ప్రకటనతో వీరిద్దరి సినిమాపై అంచనాలు తార స్థాయికి చేరుకున్నాయి.



వార్నర్‌కు రాజేంద్రప్రసాద్
క్షమాపణలు

ఆస్ట్రేలియన్ స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ క్షమాపణలు చెప్పారు. హీరో నితిన్- డేవిడ్ వార్నర్ నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డేవిడ్ వార్నర్‌పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈవెంట్‌కు తాగి వచ్చారా? అంటూ రాజేంద్రప్రసాద్‌పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తప్పు తెలుసుకున్న రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ వార్నర్‌కు బహిరంగ క్షమాపణలు చెబుతూ వీడియో విడుదల చేశారు. 'నేను ఉద్దేశపూర్వకంగా ఎవరినీ బాధించలేదు. నితిన్-వార్నర్ నాకు పిల్లల్లాంటి వారు. సరదాగా చేసిన ఆ వ్యాఖ్యల వల్ల ఎవరైనా ఇబ్బందిపడుంటే క్షమించండి' అని ఆ వీడియోలో పేర్కొన్నారు.



ట్రెండ్‌కు తగ్గ చిత్రం
వి.సముద్ర

వేణుగోపాల్, పార్థు, అనూష జైన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'సీతన్నపేట గేట్'. వై.రాజ్‌కుమార్ దర్శకత్వంలో ఆర్.శ్రీనివాస్ నిర్మించారు. ఏప్రిల్ 4న సినిమా విడుదలవుతోంది. మంగళవారం, చిత్రబృందం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ "ఇప్పటి ట్రెండ్‌కు సరిపోయే చిత్రమిది. ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "మానవ సంబంధాల చుట్టూ తిరిగే కథ ఇది. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించాం. ఊహించని మలుపులతో సినిమా ఉంటుంది" అని చిత్రదర్శకుడు వై.రాజ్‌కుమార్ చెప్పారు. "బలమైన కంటెంట్‌తో రూపొందిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ అందరినీ ఆకట్టుకుంటుంది" అని నిర్మాత ఆర్.శ్రీనివాస్ తెలిపారు.

ఆకట్టుకునే పాటలతో...



డాక్టర్ సాయివెంకట్ టైటిల్ పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జయహో రామానుజ'. జో శర్మ కథానాయిక. సుమన్ కీలకపాత్రలో నటించారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మించారు. త్వరలో పలు భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. సాయివెంకట్ మాట్లాడుతూ 'తెలుగు ప్రజలకు రామానుజాచార్యుల గొప్పదనాన్ని తెలియజేసేందుకు ఈ సినిమా చేశాను. ఈ చిత్రంలోని పాటలన్నీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది' అని తెలిపారు.

ఐపీఎల్‌లో నేడు	వేదిక గువాహటి
రాజస్థాన్ x కోల్‌కతా	రా.7.30

‘ఇంపాక్ట్’ మంచిదే!



చెన్నై: ఐపీఎల్‌లో ‘ఇంపాక్ట్ ఆటగాడి’ నిబంధనపై ధోనీ అభిప్రాయం మారింది. 2023లో మెగా లీగ్‌లో తొలిసారి ఈ రూల్‌ను ప్రవేశపెట్టినప్పుడు మహీ దానిని వ్యతిరేకించాడు. అయితే ఆ నిబంధన టీ20ల పురోగతికి దోహదం చేసిందని అతడు ఇప్పుడు అంటున్నాడు. ఈ నిబంధనతో..పరిస్థితులకు తగ్గట్టుగా జట్లు అదనంగా ఓ బ్యాటర్‌నో లేదా బౌలర్‌నో తీసుకొని ప్రయోజనం పొందుతున్నాయి.

మహిళల ముక్కోణపు సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు

కొలంబో: ఎన్నికల కారణంగా మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఆతిథ్య లంకతోపాటు భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఈ సిరీస్‌లో ఆడనున్నాయి. గతంలో మే 1, 4, 6, 8 తేదీల్లో షెడ్యూల్ చేసిన మ్యాచ్‌లను మే 2, 4, 7, 9 తేదీలకు మార్చారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ప్రేమదాస స్టేడియంలో మే 6న జరగాల్సిన మ్యాచ్ ఆ తర్వాతి రోజు అంటే 7వ తేదీ జరగనుంది. ముక్కోణపు సిరీస్ ఏప్రిల్ 27న శ్రీలంక-భారత్ మ్యాచ్‌తో మొదలవనుండగా.. 29న భారత్-దక్షిణాఫ్రికా, మే 2న శ్రీలంక-దక్షిణాఫ్రికా, 4న శ్రీలంక-భారత్, 7న భారత్-దక్షిణాఫ్రికా, 9న శ్రీలంక-దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. మే 11న ఫైనల్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు.

కాంస్య పతక రేసులో సునీల్

అమ్మాన్ (జోర్డాన్): భారత రెజ్లర్ సునీల్ కుమార్ ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచాడు. 87 కిలోల సెమీఫైనల్ బౌట్‌లో సునీల్ 1-3తో యాసిన్ (ఇరాన్) చేతిలో ఓడాడు. దీంతో సునీల్ ఇక కాంస్యం కోసం పోరాడనున్నాడు.

ఒక్క గోల్ కూడా లేకుండానే..

భారత్-బంగ్లా సాకర్ పోరు డ్రా

షిల్లాంగ్: ఏఎఫ్‌సీ ఆసియా కప్ (2027) మూడో రౌండ్ క్వాలిఫయింగ్ పోరులో భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశే ఎదురైంది. మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ గోల్ చేయడంలో విఫలమైంది. ఇరుజట్లూ ఒక్క గోల్ కూడా నమోదు చేయకపోవడంతో మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిసింది.

అయ్యారే.. పంజాబ్

శ్రేయాస్ త్రుటిలో సెంచరీ మిస్
పోరాడి ఓడిన గుజరాత్



శ్రేయాస్ అయ్యర్ (42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో 97 నాటౌట్)

అహ్మదాబాద్: ఉత్కంఠ విజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్‌లో శుభారంభం చేసింది. శ్రేయాస్ అయ్యర్ (42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 నాటౌట్) బ్యాట్‌తో చెలరేగితే.. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పేసర్ విజయ్‌కుమార్ వైశాక్ (3-0-28-0) వ్యూహాత్మకంగా ప్రత్యర్థి జోరును అడ్డుకొన్నాడు. దీంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 243/5 స్కోరు చేసింది. ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 47), శశాంక్ సింగ్ (16 బంతుల్లో 44 నాటౌట్) రాణించారు. సాయి కిశోర్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో గుజరాత్ ఓవర్లన్నీ ఆడి 232/5 స్కోరు మాత్రమే చేసింది. సాయి సుదర్శన్ (74), బట్లర్ (54), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (46) పోరాటాలు వృథా అయ్యాయి. అర్ష్‌దీప్ రెండు వికెట్లు పడగొట్టాడు. శ్రేయాస్ అయ్యర్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ దక్కింది.

ఆఖర్లో.. అలా..: ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్, కెప్టెన్ గిల్ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, ధాటిగా ఆడుతున్న గిల్‌ను మ్యాక్సీ క్యాచవుట్ చేయడంతో.. ఆరు ఓవర్లకు గుజరాత్ 61/1తో నిలిచింది. అనంతరం బట్లర్‌తో కలసి సుదర్శన్ స్కోరు బోర్డును నడిపించాడు. ఈ క్రమంలో 10వ ఓవర్‌లో సుదర్శన్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. గుజరాత్ స్కోరు సెంచరీ దాటింది. క్రీజులో కుదురుకొన్న బట్లర్ మ్యాక్సీ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో గేర్ మార్చాడు. అయితే, సుదర్శన్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రూథర్‌ఫోర్డ్ కూడా ధాటిగా ఆడడంతో టైటాన్స్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, 15 ఓవర్‌లో వైశాక్ బౌలింగ్‌కు రావడం మ్యాచ్ గతిని మార్చింది. బ్యాటర్‌కు అందకుండా వ్యూహాత్మకంగా బంతులేసిన వైశాక్.. పరుగుల జోరుకు కళ్లెం వేశాడు. జెన్సన్ కూడా అతడినే అనుసరించడంతో క్రమంగా సాధించాల్సిన రన్‌రేట్ పెరిగింది. విజయానికి 18 బంతుల్లో 57 పరుగులు కావల్సి ఉండగా.. జెన్సన్ బౌలింగ్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న బట్లర్ బౌల్డ్ అయ్యాడు. ఆఖరి ఓవర్‌లో గుజరాత్ గెలుపునకు 27 పరుగులు కావాల్సిన దశలో.. తెవాటియా (6), రూథర్‌ఫోర్డ్‌ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ పంజాబ్‌ను గెలిపించాడు.

బాదుడే.. బాదుడు: సూపర్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయాస్ సెంచరీ పూర్తి చేసుకోలేకపోయినా.. కీలక భాగస్వామ్యాలతో జట్టుకు భారీ స్కోరును అందించాడు. ప్రియాన్ష్ ఆర్యతో కలసి రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించిన అయ్యర్.. స్టొయినిస్ (20)తో కలసి ఐదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇక, డెత్ ఓవర్లలో శశాంక్‌తో కలసి ఆరో వికెట్‌కు అజేయంగా 28 బంతుల్లో 81 పరుగులు జోడించడంతో పంజాబ్ అలవోకగా 240 మార్క్ దాటింది. అరంగేట్రం ఓపెనర్ ఆర్య పవర్ హిట్టింగ్‌తో పంజాబ్ స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (5) స్వల్ప స్కోరుకే అవుటైనా.. అయ్యర్‌తో కలసి ప్రియాన్ష్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. ఐదో ఓవర్‌లో అర్షద్ బౌలింగ్‌లో ఆర్య 4,4,6,4తో మొత్తం 21 పరుగులు పిండుకోవడంతో.. పవర్‌ప్లేను పంజాబ్ 73/1తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రషీద్, సాయి కిశోర్ కట్టుదిట్టంగా బంతులేస్తూ పంజాబ్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. డేంజరస్‌గా ఆడుతున్న ఆర్యను రషీద్ క్యాచవుట్ చేయగా.. 11వ ఓవర్‌లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (16), మ్యాక్స్‌వెల్ (0)ను వరుస బంతుల్లో కిశోర్ అవుట్ చేయడంతో పంజాబ్ 105/4తో నిలిచింది. రన్‌రేట్ తగ్గుతున్న క్రమంలో 13వ ఓవర్‌లో కిశోర్ బౌలింగ్‌లో అయ్యర్ రెండు సిక్స్‌లు, ఫోర్‌తో ఒక్కసారిగా గేర్ మార్చాడు. ఆ తర్వాతి ఓవర్‌లో రషీద్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లతో శ్రేయాస్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఆల్‌రౌండర్ స్టొయినిస్‌ను కూడా కిశోర్ వెనక్కిపంపాడు. కానీ, డెత్ ఓవర్లలో అయ్యర్, శశాంక్ గుజరాత్ బౌలర్లను ఊచకోత కోశారు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 17వ ఓవర్‌లో శ్రేయాస్ మూడు సిక్స్‌లు, ఫోర్‌తో 24 పరుగులు రాబట్టాడు. అనంతరం 6,4,6తో జోరు చూపిన శశాంక్.. ఆఖరి ఓవర్‌లో మరో ఐదు బౌండ్రీలతో శివాలెత్తాడు. దీంతో శ్రేయాస్‌కు శతకం పూర్తి చేసుకొనే చాన్స్ దక్కలేదు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సాయి సుదర్శన్ (బి) రషీద్ 47, ప్రభ్‌సిమ్రన్ (సి) అర్షద్ (బి) రబాడ 5, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 97, అజ్మతుల్లా (సి) అర్షద్ (బి) సాయి కిషోర్ 16, మ్యాక్స్‌వెల్ (ఎల్బీ) సాయి కిషోర్ 0, స్టొయినిస్ (సి) అర్షద్ (బి) సాయి కిషోర్ 20, శశాంక్ సింగ్ (నాటౌట్) 44, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 243/5; వికెట్ల పతనం:** 1-28, 2-79, 3-105, 4-105, 5-162; **బౌలింగ్:** సిరాజ్ 4-0-54-0, రబాడ 4-0-41-1, అర్షద్ ఖాన్ 1-0-21-0, రషీద్ ఖాన్ 4-0-48-1, ప్రసిద్ధ్ కృష్ణ 3-0-41-0, సాయి కిషోర్ 4-0-30-3.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 74, గిల్ (సి) ఆర్య (బి) మ్యాక్స్‌వెల్ 33, బట్లర్ (బి) జాన్సెన్ 54, రూథర్‌ఫర్డ్ (బి) అర్ష్‌దీప్ 46, తెవాటియా (రనౌట్) 6, షారుక్ ఖాన్ (నాటౌట్) 6, అర్షద్ ఖాన్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 232/5; వికెట్ల పతనం:** 1-61, 2-145, 3-199, 4-217, 5-225; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-36-2, అజ్మతుల్లా 2-0-29-0, జాన్సెన్ 4-0-44-1, మ్యాక్స్‌వెల్ 2-0-26-1, స్టొయినిస్ 2-0-31-0, చాహల్ 3-0-34-0, విజయ్‌కుమార్ వైశాక్ 3-0-28-0.

‘టాప్’ లేపిన అనహత్



న్యూఢిల్లీ: స్క్వాష్ యువ క్రీడాకారిణి అనహత్ సింగ్ భారత్ తరఫున మహిళల్లో నెంబర్ వన్ ర్యాంకర్‌గా నిలిచింది. గత వారం చెన్నైలో జరిగిన ఇండియన్ టూర్ టైటిల్ గెలిచిన 17 ఏళ్ల అనహత్.. తాజాగా ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్ మహిళల విభాగంలో ఏకంగా 14 స్థానాలు మెరుగై 68వ ర్యాంక్‌ను సాధించింది. దీంతో ఇప్పటిదాకా భారత్ నుంచి నెంబర్‌వన్ ర్యాంకర్‌గా ఉన్న ఆకాంక్ష సాలుంఖేను అనహత్ అధిగమించింది. జోష్న చినప్ప 133వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్-3లో ఉంది. పురుషుల విభాగంలో రమిత్ టాండన్ 33వ, వెలవన్ సెంథిల్ కుమార్ 39వ స్థానంలో కొనసాగుతున్నారు.

భర్తపై బాక్సర్ స్వీటీ ‘పంచ్’లు!



హిసార్ (హరియాణా): వరల్డ్ చాంపియన్ బాక్సర్ స్వీటీ బూరా.. తన భర్త, కబడ్డీ ఆటగాడు దీపక్ హుడాపై పోలీస్ స్టేషన్ సాక్షిగా దాడి చేసింది. ఈ ఘటనకు సంబంధించి వీడియో తాజాగా నెట్టింట వైరల్ అవుతోంది. దీపక్ హుడా తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, దౌర్జన్యం కూడా చేస్తున్నాడని ఆరోపిస్తూ స్వీటీ విడాకుల కోసం దాఖలు చేసింది. అంతేకాదు..భర్తపై హిసార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి తన వివరణ ఇచ్చేందుకు దీపక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా..భర్తపై స్వీటీ దాడి చేసినట్టు తెలుస్తోంది. స్టేషన్‌లో రెండు కుటుంబాల సమక్షంలోనే.. ఒక్కసారిగా భర్త హుడాపైకి దూసుకెళ్లిన స్వీటీ అతడి గొంతు పట్టుకొని పిడి గుద్దులు కురిపించడం వీడియోలో కనిపించింది. దాంతో ఇరు కుటుంబాల సభ్యులు జోక్యం చేసుకొని స్వీటీని విడదీయాల్సి వచ్చింది. ‘పోలీసులు నన్ను ప్రశ్నిస్తున్న సమయంలోనే స్వీటీ, ఆమె తండ్రి నన్ను దుర్భాషలాడారు. నాకు రెండు చోట్ల గాయాలయ్యాయి’ అని దీపక్ తెలిపాడు. కాగా, భర్త నుంచి భరణాన్ని ఆశించడం లేదనీ, తనకు విడాకులు ఇస్తే చాలంటూ స్వీటీ ఓ వీడియో విడుదలజేసింది.

భారత షట్లర్లకు క్లిష్టమైన డ్రా

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

నింగ్బో (చైనా): వచ్చేనెల 8 నుంచి 13 వరకు ఇక్కడ జరిగే ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగం పోటీల్లో భారత షట్లర్లకు క్లిష్టమైన డ్రా ఎదురైంది. పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో లక్ష్యసేన్.. ఈ ఏడాది ఆల్‌ఇంగ్లండ్ ఓపెన్ ఫైనలిస్టు లీ చియా చావో (చైనీస్ తైపీ)తో తలపడనున్నాడు. ఇక, గువాంగ్ జూ లూ (చైనా)తో హెచ్ఎస్ ప్రణయ్, కంటఫాన్ వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)తో ప్రియాన్షు రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ తొలి రౌండ్ ఆడనున్నారు. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్లో ఈస్తర్ నురుమి (ఇండోనేసియా)తో పీవీ సింధు, మాజీ ప్రపంచ చాంపియన్ ఇంటనాన్ రచానోక్ (థాయ్‌లాండ్)తో అనుపమ, ఫాంగ్ జి గావో (చైనా)తో మాళవిక అమీతుమీ తేల్చుకోనున్నారు. మహిళల డబుల్స్‌లో క్వాలిఫయర్ జంటతో గాయత్రి/ట్రీసా జాలీ జోడీ తమ పోరు ఆరంభించనుంది.

బిజినెస్

ఏటీఎం నుంచి డబ్బు తీస్తున్నారా...
మీ జేబుకి చిల్లే

మే 1 నుంచి కొత్త చార్జీలు



ఏటీఎం నుంచి డబ్బు తీసుకోవడం సామాన్య మానవులకి మరింత భారం కానుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రాయల్‌పై ఇంటర్ చేంజ్ ఫీజు పెంచడమే ఇందుకు కారణం. మే ఒకటో తేదీ నుంచి ఈ కొత్త చార్జీలు అమలులోకి వస్తాయని దూరదర్శన్ ఒక నివేదికలో తెలిపింది. తమ కస్టమర్లకు ఏటీఎం సేవలందిస్తున్నందుకు ఏదైనా బ్యాంకు.. ఏటీఎం నడుపుతున్న బ్యాంకుకు చెల్లించే ఫీజునే ఇంటర్ చేంజ్ ఫీజుగా వ్యవహరిస్తారు. నిర్వహణ వ్యయాలు పెరిగిపోయిన కారణంగా ఏటీఎం విత్‌డ్రాయల్ చార్జీలు పెంచాలన్న వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు చేసిన అభ్యర్థన మేరకు ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీడీ తెలిపింది.

ఉచిత లావాదేవీలెన్ని..

2014 అక్టోబరు 10వ తేదీన ఆర్‌బీఐ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం మెట్రో నగరాల్లో (ముంబై, న్యూఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్) ఒక బ్యాంకు కస్టమర్లు మరో బ్యాంక్ ఏటీఎం వద్ద చేసే ఉచిత లావాదేవీల సంఖ్య (ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలన్నీ కలిపి) నెలకి 5 నుంచి 3కి తగ్గింది. ఈ నగరాలు కాకుండా ఇతర ప్రాంతాల్లో అయితే నెలకి 5 ఉచిత లావాదేవీలను అనుమతిస్తున్నారు. అయితే ఫెయిల్ అయిన లావాదేవీలను మాత్రం అధీకృత లావాదేవీగా పరిగణించవద్దని కూడా ఆర్‌బీఐ బ్యాంకులకు స్పష్టం చేసింది.

ఎంత భారం పడుతుంది?

సాధారణంగా ప్రతి బ్యాంకు తమ కస్టమర్లకు నిర్దిష్ట పరిమితిలో ఉచిత ఏటీఎం విత్‌డ్రాయల్ సదుపాయం అందిస్తోంది. ఆ ఉచిత విత్‌డ్రాయల్ పరిమితి దాటి చేసే ఏ లావాదేవీపై అయినా ఈ అదనపు భారం తప్పదు. గతంలో ఒక్కో ఆర్థిక లావాదేవీకైతే (ఏటీఎం విత్‌డ్రాయల్) ఒక్కో దానిపై రూ.17 ఫీజు వసూలు చేసే వారు. దీన్ని తాజాగా రూ.19కి పెంచారు. నాన్ ఫైనాన్షియల్ లావాదేవీకైతే (బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్ వంటివి) ఒక్కో దానిపై రూ.6 వసూలు చేసే వారు. దీన్ని రూ.7కి పెంచారు. ప్రధానంగా చిన్న బ్యాంకుల కస్టమర్లపై ఈ భారం అధికంగా ఉంటుంది. ఏటీఎం మౌలిక వసతులు, సేవల కోసం చిన్న బ్యాంకులు పెద్ద ఆర్థిక సంస్థలపై ఆధారపడుతూ ఉండడమే ఇందుకు కారణం.

ఢిల్లీ హైకోర్టులో ‘నాట్కో’కు ఊరట

ఎస్ఎంఏ ఔషధ తయారీకి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే నాట్కో ఫార్మాకు ఢిల్లీ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ‘రిస్‌డిప్లాన్’ అనే పేటెంట్ ఔషధాన్ని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జెనరిక్ రూపంలో తయారు చేసి విక్రయించేందుకు న్యాయమూర్తి జస్టిస్ మినిపుష్కరణ అనుమతించారు. ఈ ఔషధాన్ని ప్రస్తుతం స్విస్ ఫార్మా కంపెనీ రోచే భారత్‌లో మార్కెట్ చేస్తోంది. వెన్నుపూస, మెదడులోని నరాల క్షీణతకు కారణమయ్యే స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే అరుదైన వ్యాధి చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారు. స్విస్ కంపెనీ ప్రస్తుతం ఈ ఔషధంతో కూడిన ఒక్కో సీసాను రూ.6 లక్షల చొప్పున విక్రయిస్తోంది. ఇరవై కిలోల కంటే ఎక్కువ బరువు ఉన్న ఒక్కో ఎస్ఎంఏ రోగికి ఈ సీసాలోని ఔషధం 12 రోజులకు మాత్రమే సరిపోతుంది. అంటే సంవత్సరానికి 30 సీసాల చొప్పున ఏటా రూ.1.8 కోట్లు కేవలం ఈ ఔషధం కొనుగోలుకే సరిపోతుంది. దీంతో విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాట్కో ఫార్మా జెనరిక్ రూపంలో చౌకగా ఈ ఔషధాన్ని తయారు చేసేందుకు అనుమతిస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

బ్యాంకుల్లోని అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లు
రూ.78,000 కోట్ల పైమాటే..

వీటిని క్లెయిమ్ చేసుకునేందుకు ఏప్రిల్ నుంచి సులభతర విధానం



న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకుల్లో అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.78,213 కోట్లు దాటాయని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకులు ఈ డిపాజిట్లను క్లెయిమ్ చేసుకునేందుకు సులభతర విధానాన్ని వచ్చే నెల నుంచి ప్రవేశపెట్టనున్నాయి. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. బ్యాంకులు తమ వెబ్‌సైట్‌లో అన్-క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను ఖాతదారుల వివరాలు, పబ్లిక్ సెర్చ్ ఫీచర్‌తో సహా ప్రదర్శించాల్సి ఉంటుంది. ఖాతాదారు లేదా నామినీ డిపాజిట్‌ను తిరిగి తీసుకునేందుకు స్టాండర్డ్ అప్లికేషన్‌తో పాటు డిక్లరేషన్ ఫామ్స్‌ను, సమర్పించాల్సిన డాక్యుమెంట్ల వివరాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. డిపాజిట్ సొమ్మును క్లెయిమ్ చేసుకునే దరఖాస్తుదారు తన పేరు, మొబైల్ నంబరు, చిరునామా వంటి వివరాలను అప్లికేషన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అనంతరం, సంబంధిత బ్యాంకు శాఖ దరఖాస్తును తనిఖీ చేసి, సొమ్మును సెటిల్ చేస్తుందని ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉన్నతోద్యోగి ఒకరు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా అన్-క్లెయిమ్డ్ డిపాజిట్ల రికవరీ విధానం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని ఉన్నతాధికారి పేర్కొన్నారు. ప్రస్తుతం అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐకి చెందిన ఉద్గమ్ పోర్టల్‌లో చెక్ చేసుకోవచ్చు. అనంతరం సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదించి సొమ్మును క్లెయిమ్ చేసుకోవచ్చు.

రూ.45,000 కోట్లు ప్రత్యేక ఫండ్‌కు బదిలీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు 2019-20 నుంచి 2024-25 (గత ఏడాది డిసెంబరు 31 వరకు) మధ్య కాలంలో రూ.45,000 కోట్లకు పైగా అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐ నిర్వహణలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేశాయి. కేంద్ర ఆర్థిక శాఖ స్వయంగా ఈ విషయాన్ని లోక్‌సభకు వెల్లడించింది. సేవింగ్, కరెంట్ ఖాతాల్లో 10 ఏళ్లపాటుగా క్రియారహితంగా ఉన్న సొమ్మును లేదా కాలపరిమితి ముగిసి 10 ఏళ్లయిన టర్మ్ డిపాజిట్లను బ్యాంక్‌లు అన్-క్లెయిమ్డ్ డిపాజిట్లుగా వర్గీకరిస్తాయి.

గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌కు కేంద్రం స్వస్తి

బ్యాంకులు కొనసాగించవచ్చని ఆర్థిక శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మారుతున్న మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా బుధవారం నుంచి గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్)ను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. బ్యాంకులు మాత్రం 1-3 ఏళ్ల కాలపరిమితితో కూడిన స్వల్పకాలిక గోల్డ్ డిపాజిట్ పథకాలను కొనసాగించవచ్చని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. గత ఏడాది నవంబరు వరకు జీఎంఎస్ ద్వారా 31,164 కిలోల బంగారం సమీకరణ జరిగింది.

లాభాల స్వీకారంతో జోరుకు బ్రేక్

33 పాయింట్ల లాభానికే పరిమితమైన సెన్సెక్స్

ముంబై: వరుసగా ఆరు రోజుల పాటు అద్భుతమైన ర్యాలీలో ట్రేడయిన ఈక్విటీ మార్కెట్ జోరుకు మంగళవారం బ్రేక్ పడింది. లాభాల స్వీకారంతో ప్రారంభ లాభాలు ఆవిరైపోగా ఈక్విటీ సూచీలు స్వల్ప లాభంతోనే ముగిశాయి. వరుసగా ఏడో రోజు కూడా అదే ఉత్సాహంతో ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 757.31 పాయింట్ల లాభంతో 78,741.69 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. కాని చివరికి 32.81 పాయింట్ల స్వల్ప లాభంతో 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 10.30 పాయింట్ల లాభంతో 23,668.65 వద్ద క్లోజయింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏడు సెషన్ల ర్యాలీకి తెర దించింది. మంగళవారం డాలర్ మారకంలో 11 పైసలు నష్టపోయి 85.72 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




26వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	405
వరంగల్	397	గోదావరి	397
చిత్తూరు	470	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	105
వరంగల్	99	గుంటూరు	108
కరీంనగర్	99	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	97
విశాఖపట్నం	99	అనంతపురం	97
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,290 ▼	81,850 ▼	1,10,000 ▼
విజయవాడ	90,500 ▼	84,000 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	87,970 ▼	80,640 ▼	98,960 ▲
రాజమండ్రి	89,290 ▼	81,850 ▼	1,00,300 ▼
ప్రొద్దుటూరు	89,950 ▼	83,290 ▼	99,400 ▼
ముంబై	87,751 ▲	80,380 ▲	97,922 ▲

ఎన్‌సీసీకి రూ.10,805 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్‌కు ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.10,805 కోట్ల విలువైన భారీ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్‌లో భాగంగా ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సర్కిల్స్‌లో బీఎస్ఎన్ఎల్ చేపట్టే భారత్‌నెట్ ప్రాజెక్ట్ మిడిల్-మైల్ నెట్‌వర్క్ పనులను ఎన్‌సీసీ మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నెట్‌వర్క్ డిజైన్, సరఫరా, నిర్మాణం, ఏర్పాటు, అప్‌గ్రెడేషన్‌తో పాటు పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కూడా ఎన్‌సీసీ చేపట్టాల్సి ఉంటుంది.

రెండు కార్వీ సంస్థల రిజిస్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) నిర్వహణలోని రెండు సంస్థల రిజిస్ట్రేషన్లను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ రద్దు చేసింది. కార్వీ క్యాపిటల్ ఆల్టర్‌నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్, కేసీఏపీ ఆల్టర్‌నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఈ రెండు సంస్థలు నిబంధనలు తుంగలో తొక్కడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. సెబీ 2023 ఏప్రిల్‌లోనే కేఎస్‌బీఎల్, దాని అనుబంధ కంపెనీలను ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది.

గూగుల్, ఫేస్‌బుక్‌లకు ఊరట

డిజిటల్ ప్రకటనలపై పన్ను పోటు రద్దు

న్యూఢిల్లీ: వాణిజ్య చర్చల్లో అమెరికాను మెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో చర్య తీసుకుంది. గూగుల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఆన్‌లైన్ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వచ్చే ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ పేరుతో విధించే 6 శాతం పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. గూగుల్ ట్యాక్స్‌గా పేరొందిన ఈ పన్నును ఏప్రిల్ 1 నుంచి రద్దు చేస్తున్నట్టు తెలిపింది. దీనికి సంబంధించి ఆర్థిక బిల్లు, 2025కు చేసిన సవరణకు పార్లమెంట్ కూడా ఆమోద ముద్ర వేసింది. దీంతో అమెరికా-భారత్ మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు సానుకూలంగా ముగిసే అవకాశాలు మరింత మెరుగయ్యాయని భావిస్తున్నారు. ఈ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో దేశీయ కంపెనీలు ఇచ్చే ప్రకటనలపై 2016లో ప్రభుత్వం ఈ పన్ను విధించింది. దీనిపై అమెరికా గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్నును వెనక్కి తీసుకోకపోతే భారత్ నుంచి దిగుమతయ్యే రొయ్యలు, బాస్మతి బియ్యంపై తామూ అదే స్థాయిలో పన్ను విధిస్తామని హెచ్చరించింది. తాజా చర్యతో ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ప్రకటనల ఖర్చు తగ్గడంతో పాటు వాటి లాభాలూ పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సీనియర్ సలహాదారు సుదీర్ కపాడియా ప్రభుత్వ చర్యను తెలివైన చర్యగా అభివర్ణించారు. అమెరికాతో తలెత్తిన వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఈ చర్య ఉపకరిస్తుందన్నారు.

ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్‌లోకి ప్యూర్

ప్యూర్‌పవర్ పేరుతో విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ ప్యూర్.. ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్‌లోకి అడుగుపెట్టింది. ప్యూర్‌పవర్ పేరుతో గృహ, వాణిజ్య, గ్రిడ్ విభాగాల కోసం ఈ స్మార్ట్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించింది. మంగళవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో నీతి ఆయోగ్ శాశ్వత సభ్యుడు వీకే సారస్వత్, ప్యూర్ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి, సహ వ్యవస్థాపకుడు రోహిత్ వధేరా ప్యూర్‌పవర్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ.. సాధారణ ఇన్వర్టర్లతో పోల్చితే ఈ ఎనర్జీ సొల్యూషన్స్ పూర్తిగా ప్రత్యేకమైనవని అన్నారు. 3,5,15 కేవీఏ సామర్థ్యాల్లో తీసుకువచ్చిన ఈ ఎనర్జీ సొల్యూషన్స్‌తో ఏసీలు, గీజర్లు సహా హెవీ డ్యూటీ గృహోపకరణాలను వాడుకోవచ్చని నిశాంత్ తెలిపారు. ఏఐ యాప్ ఆధారిత మానిటరింగ్, ఉచిత మెయింటెనెన్స్, 10 ఏళ్లకు పైగా జీవితకాలం వీటి ప్రత్యేకత అని ఆయన చెప్పారు. అంతేకాకుండా ఈ ఎనర్జీ సొల్యూషన్స్‌ను సాధారణ విద్యుత్‌తో పాటు రూఫ్‌టాప్ సోలార్‌తో చార్జింగ్ చేసుకునే విధంగా డిజైన్ చేసినట్లు ఆయన వివరించారు. 3కేవీఏ ఎనర్జీ సొల్యూషన్స్ ధర రూ.74,999గా ఉండగా 5 కేవీఏ ధర రూ.99,999, 15కేవీఏ ధర రూ.1,74,999గా ఉన్నాయి. ఏప్రిల్ 1 నుంచి వీటి బుకింగ్స్‌ను ప్రారంభించి అదే నెల 30 నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నిశాంత్ తెలిపారు. హైదరాబాద్ ఐఐటీ సమీపంలోని ప్లాంట్‌లో వీటిని ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా వచ్చే ఏడాది గంటకు 4 మెగావాట్ల సామర్థ్యం గల భారీ ఎనర్జీ స్టోరేజీ సామర్థ్యం గల ప్యూర్‌పవర్ గ్రిడ్‌ను తీసుకురానున్నట్లు నిశాంత్ వెల్లడించారు.

రైతులకు సరిపడా ఎరువులు ఇస్తున్నాం

» తెలంగాణ సహా దేశమంతా మిగులు నిల్వలు: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 2024-25 రబీ సీజన్‌లో రైతులకు లోటు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఎరువులను సరఫరా చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్ని రాష్ట్రాలకు ఎరువులను సరఫరా చేయగా, అవసరాలు తీరిపోను, ఇంకా రాష్ట్రాల వద్ద మిగులు నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి పంట కాలం మొదలయ్యే ముందుగా అన్ని రాష్ట్రాల రైతులకు అవసరమైన మొత్తంలో ఎరువులు ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కిషన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు 2024-25 రబీ సీజన్‌లో 9.80 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా, కేంద్ర ప్రభుత్వం 12.02 లక్షల టన్నులను సరఫరా చేసిందని తెలిపారు. రైతులకు అమ్మగా రాష్ట్రం వద్ద ఇంకా 1.68 లక్షల టన్నుల యూరియా ఉందని చెప్పారు.

బీసీలకు బీఆర్‌ఎస్ ఏం చేసింది..?: కాసం వెంకటేశ్వర్లు

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీసీలకు బీఆర్‌ఎస్ ఏం చేసిందో ఆ పార్టీ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చెప్పాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఎంత మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చారని ప్రశ్నించారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఆగస్టు 7న అందజేసే కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారుల వయస్సు 2024 డిసెంబరు 31 నాటికి 30 ఏళ్లు నిండి, పదేళ్ల అనుభవం ఉండాలన్నారు. అలాగే చేనేత డిజైనర్ల వయస్సు 25 సంవత్సరాలు నిండడంతోపాటు 5 ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. ఏప్రిల్ 15లోగా హైదరాబాద్‌లోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ బిల్లు పెండింగ్.. కరెంట్ కట్ చేస్తామంటూ బురిడీ

హైదరాబాద్ మహిళ నుంచి 1.05లక్షల కొట్టేసిన సైబర్ నేరగాడు



మొబైల్ ఫోన్లకు వస్తున్న సందేశం ఇదే

హైదరాబాద్ సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అసలే వేసవి.. ఒక్క క్షణం కరెంట్ పోతే విలవిలలాడిపోయే పరిస్థితి.. ఇదే అదనుగా భావించిన సైబర్ నేరగాడు.. కరెంటు బిల్లు పెండింగ్‌లో ఉందంటూ ఓ మహిళను బురిడీ కొట్టించి బ్యాంకు ఖాతా నుంచి నగదు దోచుకున్నాడు. హైదరాబాద్ సిటీసైబర్ క్రైమ్ డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ(53)కు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి.. తనని తాను విద్యుత్ శాఖ ఉద్యోగిగా పరిచయం చేసుకున్నాడు. మీ కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉంది, వెంటనే చెల్లించకపోతే విద్యుత్ సరఫరా ఆపేస్తామని హెచ్చరించాడు. వాట్సా‌ప్‌కు ఓ లింక్ పంపుతా, దాని ద్వారా బిల్లు చెల్లించండి అని నమ్మబలికాడు. ఎక్కడ విద్యుత్ సరఫరా ఆపేస్తారో అనే భయంతో ఆ మహిళ.. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో చెప్పిన సూచనలను పాటించింది. ముందు రూ.5 చెల్లించండి ఆ తర్వాత మిగిలిన మొత్తాన్ని చెల్లించండన్న మాటలను నమ్మి అతగాడు పంపిన లింక్‌ను ఓపెన్ చేసింది. ముందుగా రూ.5 చెల్లించింది. ఈక్రమంలో సైబర్ నేరగాడు బాధితురాలిని మాటల్లో పెట్టి ఆమె బ్యాంకు ఖాతా వివరాలు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను తీసుకున్నాడు. అనంతరం ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1.05లక్షలను రెండు విడతల్లో కొట్టేశాడు. మోసపోయిన విషయాన్ని ఆలస్యంగా గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు రూ.18.45 కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగారు. 2016 ఆగస్టు 1నుంచి 2023 డిసెంబరు 3వరకు పలుమార్లు విదేశాలకు వెళ్లారు. అమెరికా, స్విట్జర్లాండ్‌లోని దావోస్, యూకేల్లో పర్యటించారని ఆర్‌టీఐ కార్యకర్తకు ఇచ్చిన వివరాల్లో ప్రభుత్వం వెల్లడించింది.

విదేశీ పర్యటనలకు చేసిన వ్యయం

సమయం	ఖర్చు(రూ.ల్లో)
2016 ఆగస్టు 1 నుంచి 2017 మార్చి 31 వరకు	32,72,462
2017 ఏప్రిల్ 1 నుంచి 2018 మార్చి 31 వరకు	51,99,429
2018 ఏప్రిల్ 1 నుంచి 2019 మార్చి 31 వరకు	27,76,394
2019 ఏప్రిల్ 1 నుంచి 2020 మార్చి 31 వరకు	50,35,646
2020 ఏప్రిల్ 1 నుంచి 2021 మార్చి 31 వరకు	51,68,930
2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు	94,93,980
2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు	1,50,10,155
2023 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 3 వరకు	13,85,50,524
మొత్తం	18,45,07,520


అవార్డులు అందుకున్న విద్యార్థులతో కత్రినా నాప్, డాక్టర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం తదితరులు

భారత్, ఆస్ట్రేలియా మధ్య గాఢానుబంధం

» ఆస్ట్రేలియన్ వైస్ కాన్సుల్ జనరల్ కత్రినా నాప్

» ఘనంగా వీఐటీ వర్సిటీ దినోత్సవం

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య గాఢానుబంధం వుందని చెన్నైలోని ఆస్ట్రేలియన్ వైస్ కాన్సుల్ జనరల్ కత్రినా నాప్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన 'వీఐటీ-చెన్నై' యూనివర్సిటీ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కత్రినా నాప్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాలో వున్న ఒక మిలియన్ భారతీయులు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రెండు దేశాల మధ్య సహకారానికి సంబంధించిన వివిధ రంగాల గురించి ప్రస్తావించారు. వాటిల్లో 'సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా-ఇండియా రిలేషన్స్', ప్రభుత్వం, పరిశ్రమ, విద్య, సమాజం అంతటా ఆస్ట్రేలియన్ విఎషన్ల సహకారంతో మద్దతు ఇవ్వడానికి, సులభతరం చేయడానికి ఒక వేదిక అని వివరించారు. 'మైత్రి' ద్వారా ఆస్ట్రేలియా 20 మిలియన్ డాలర్ల విలువైన ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, పరిశోధనా గ్రాంట్‌ను ప్రకటించిందని వివరించారు. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన వీఐటీ చాన్స్‌లర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా తలసరి ఆదాయం 68 వేల డాలర్లని, అది తన జీడీపీలో 5% విద్యపై ఖర్చు చేయడం వల్లనే ఇది సాధ్యమైందని చెప్పారు. వీఐటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ హ్యూమన్ రిసోర్సెస్ చీఫ్ ఆఫీసర్ సుదీప్ కన్నుమల్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం అవార్డులను అందజేశారు.

హైదరాబాద్‌లో మినీ ఫుడ్ ల్యాబ్స్

» ప్రజలే ఆహార నమూనాలను తీసుకెళ్లి పరీక్షలు చేయించేలా ఏర్పాట్లు

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత, నాణ్యత అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాక, ప్రజలకు మరింత చేరు వ చెయ్యడమే లక్ష్యంగా మినీ ఫుడ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకురానుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు సహా రాష్ట్రంలో జరిగే ఆహార వ్యాపారంలో 60 శాతానికిపైగా హైదరాబాద్‌లోనే జరుగుతుంది. దీంతో ఈ మినీ ఫుడ్ ల్యాబ్‌లను తొలుత రాష్ట్ర రాజధాని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో ఒక్కో మినీ ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు కానుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే ఈ మినీ ఫుడ్ ల్యాబ్‌లు సామాన్యులకూ అందుబాటులో ఉండనున్నాయి. ఏదైనా ఆహారంపై అనుమా నం ఉంటే వాటి నమూనాలను ప్రజలు స్వయంగా మినీ ఫుడ్ ల్యాబ్‌లకు తీసుకెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. ఆయా ఆహార పదార్థాల నాణ్యతను తెలుసుకొని తమ అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు. ఇన్నాళ్లూ ఆహార పదార్థాల నాణ్యతను ఎక్కడ పరీక్షిస్తారు ? వారిని సంప్రదించాలి ? సంబంధిత అధికా రులు ఎవరు? తదితర విషయాలపై ప్రజలకు అవగాహన లేదు. ఇప్పుడు మినీ ఫుడ్ ల్యాబ్స్ అందుబాటులోకి వస్తే ఫుడ్‌సేఫ్టీ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కానుంది. జీహెచ్ఎంసీ సహకారంతో మినీ ఫుడ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్ ఆ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మినీ ల్యాబ్‌ల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ సహకారంతో స్థలాలు ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. కాగా, ఏడాదిన్నరగా హైదరాబాద్, పరిసరాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు, డెయిరీలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు(ఎఫ్ఎస్‌వో) విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఆహార భద్రతపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. ఫుడ్ బిజినెస్ చేసే వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ లైసెన్స్‌లు జారీ చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు. కాగా, జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 23 మంది ఎఫ్ఎస్‌వోలే ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం 80 ఎఫ్ఎస్‌వో పోస్టులుండగా అందులో 20కిపైగా ఖాళీగా ఉన్నాయి. కేరళలో 160 ఎఫ్ఎస్‌వో పోస్టులతో పోలిస్తే తెలంగాణలో సగం మంది ఎఫ్ఎస్‌వోలు కూడా లేరు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఎఫ్ఎస్‌వో పోస్టుల సంఖ్యను భారీగా పెంచాలని సర్కారు నిర్ణయించింది. ఇక, ప్రస్తుతం నాచారంలో ఏకైక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఉంది. గ్రేటర్ పరిధిలో అధికారులు సేకరించిన ఫుడ్ శాంపిళ్లు అన్నీ కూడా అక్కడికే పంపుతున్నారు. నెలకు 600-700 నమూనాలను అక్కడ పరీక్షిస్తున్నారు.

50వేల యూనిట్‌కు పూర్తి రాయితీ

(మొదటిపేజీ తరువాయి)

యూనిట్‌కు 100% రాయితీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. మిగతా యూనిట్లకు కూడా 70% నుంచి 90% వరకు రాయితీలను ప్రకటించింది. అంతేకాదు.. రాయితీ మొత్తం పోను.. మిగతాదాన్ని లబ్ధిదారుడి వాటాగా కాకుండా.. బ్యాంకు రుణంగా అందజేయనున్నట్లు వెల్లడించింది. రాజీవ్ యువ వికాసం పథకానికి ఇప్పటికే ప్రత్యేక పోర్టల్ (https://tgobmmsnew.cgg.gov.in/) ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుండగా.. ఈ ప్రక్రియ ఏప్రిల్ 5 వర కు కొనసాగుతుందని, అదే నెల 6 నుంచి మే 20 వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందని వివరించింది. ఎంపికైన లబ్ధిదారులకు తెలంగాణ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా జూన్ 2 నుంచి మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొంది. ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపింది.

రాయితీలు ఇలా..

- యూనిట్ విలువను బట్టి రాయితీ మారుతుంది. రాయితీపోను మిగతా మొత్తాన్ని బ్యాంకు రుణం ద్వారా అందజేస్తారు. లబ్ధిదారుడి వాటా ఉండదు
- యూనిట్ విలువ రూ.50 వేలలోపు ఉంటే.. ప్రభుత్వం 100% రాయితీ ఇస్తుంది
- రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు ఉండే యూనిట్‌కు 90% రాయితీ ఉంటుంది
- రూ.1,00,001-రూ.2లక్షలకు 80%రాయితీ ఇస్తారు
- రూ. 2 లక్షలకు పైన విలువ చేసే యూనిట్‌కు 70% రాయితీ లభిస్తుంది

అర్హులు వీరే..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, బీసీ ఫెడరేషన్ల సభ్యులు, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ ఫెడరేషన్లు, ఈబీసీ వర్గాల వారు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల వయసు 21 నుంచి 55 ఏళ్లలోపు ఉండాలి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి గరిష్ఠ వయోపరిమితి 60 సంవత్సరాలు. దరఖాస్తుదారులకు రేషన్‌కార్డు తప్పనిసరి. ఒకవేళ రేషన్ కార్డు లేకుంటే.. ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకుండా ఉండాలి. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జారీ అయిన కుల ధ్రువీకరణ పత్రాలనే పరిగణనలోకి తీసుకుంటారు. దరఖాస్తు సమయంలో పాస్‌పోర్టు సైజు ఫొటోను అప్‌లోడ్ చేయాలి. రవాణా రంగానికి సంబంధించిన యూనిట్‌ను ఏర్పాటు చేసే వారికి డ్రైవింగ్ లైసెన్సు, వ్యవసాయ అనుబంధ యూనిట్లకు పట్టాదార్ పాస్‌పుస్తకం తప్పనిసరి. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌ను సమర్పించాలి.

వీరికి ప్రాధాన్యత..

మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులకు మొత్తం లక్ష్యంలో 25% ప్రాధాన్యత ఉంటుంది. తెలంగాణ ఉద్యమంలో, ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో పాలుపంచుకున్న వారికి ఈ పథకంలో ప్రాధాన్యత నిస్తారు. కుటుంబానికి ఒకరికి మాత్రమే లబ్ధి చేకూరుస్తారు. అంటే.. ఐదేళ్ల వరకు ఆ కుటుంబానికి చెందిన ఇతరులు ఈ పథకానికి అనర్హులు.

వచ్చేనెల 5 వరకు దరఖాస్తులు

ఈ పథకానికి ఈనెల 17 నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. వచ్చేనెల 5వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో అనుమానులు ఉంటే.. నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్క్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తారు. దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, అర్హత పత్రాలతోపాటు హార్డ్ కాపీని సంబంధిత అధికారులకు అందజేయాలి. గ్రామీణ ప్రాంతాల లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు పురపాలక సంఘాల్లో, నగరాల్లో ఉండేవారు నగరపాలక సంస్థ జోనల్ కార్యాలయాల్లో దరఖాస్తు కాపీలను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు గడువు ముగిసిన తర్వాతి రోజు నుంచే.. అంటే ఏప్రిల్ 6వ తేదీ నుంచి మే 20 వరకు నెలన్నరపాటు మండల స్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తారు. ఒకే గ్రామంలో బహుళ స్వయం ఉపాధి పథకాలకు అవకాశం ఉండదు. అర్హతకు సంబంధించిన స్క్రూటినీ పూర్తయ్యాక.. ఎంపిక చేసిన దరఖాస్తులను జిల్లా స్థాయి పరిశీలనకు పంపుతారు. మే 21 నుంచి 31 వరకు జిల్లా స్థాయిలో పరిశీల ఉంటుంది. ఆ తర్వాత ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పంపుతారు. మంత్రి ఆమోదం పొందిన దరఖాస్తులను ఈ పథకంలో లబ్ధికి ఎంపిక చేస్తారు. తెలంగాణ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. లబ్ధిదారులకు వారు ఎంపిక చేసుకున్న స్వయం ఉపాధిలో వారం నుంచి పక్షం రోజుల పాటు శిక్షణనిస్తారు. రాయితీ విడుదల అయిన 16 రోజుల్లో లబ్ధిదారుడు బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుంది.

జిల్లా, మండల స్థాయి కమిటీలు..

జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా డీఆర్డీయే పీడీ ఉంటారు. సభ్యులుగా.. అదనపు కలెక్టర్, పరిశ్రమల శాఖ జీఎం, ఎస్సీ/బీసీ కార్పొరేషన్‌ల ఈడీ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, దివ్యాంగుల శాఖ ఏడీ, డబ్ల్యూ అండ్ సీడీ శాఖ పీడీ, గిరిజన సంక్షేమ శాఖ డీటీడీవో, ఎల్‌డీఎంలు ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీవో/పురపాలక కమిషనర్, మునిసిపల్ కార్పొరేషన్‌లో జోనల్ స్థాయి అధికారి కన్వీనర్‌గా ఉంటారు. జిల్లా కలెక్టర్ నామినేట్ చేసిన మండల ప్రత్యేక అధికారి, ఆ ప్రాంతంలోని బ్యాంక్ మేనేజర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీల నుంచి ఒక ప్రతినిధి, డీఆర్‌డీఏ నుంచి ఒక సభ్యుడు ఈ కమిటీలో ఉంటారు.

ఈబీసీ సంక్షేమ సంఘం హర్షం

ఈ పథకంలో తమ వర్గానికి కూడా అవకాశం ఇచ్చినందుకు ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.

నిరంకుశ పాలనకు నిదర్శనం

» అసెంబ్లీలో క్వశ్చన్ అవర్‌ను ఎత్తేస్తారా ?

» సభలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సస్పెన్షన్లు

» బయట ప్రశ్నిస్తే పోలీసు కేసులు

» కాంగ్రెస్ ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యమే లేకుండా చేయడం: హరీశ్



మెదక్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నియంతృత్వ వైఖరితో కొనసాగుతోందని, అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేయడంతో అది తారసాయికి చేరుకుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నిస్తే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నారని, సభ వెలుపల ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ప్రజలకిస్తున్న ఏడో గ్యారెంటీతో అసలు ప్రజాస్వామ్యమే లేకుండా చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇందిరా పార్కు వద్ద ధర్నాలకూ అనుమతినివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యమిస్తే పోలీసులతో సొమ్మసిల్లేలా కొట్టించారని వాపోయారు. అంగన్‌వాడీ వర్కర్లకు ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తామని చెబుతున్నా అలా జరగడం లేదన్నారు. ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవంటూనే రూ.20 వేల కోట్లతో హెచ్ఎండీఏలో టెండర్లు ఎలా పిలుస్తున్నారని ప్రశ్నించారు. రెండులక్షల రుణమాఫీపై ఈ ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కోసం ఈ ప్రభుత్వాన్ని రైతులంతా ఎక్కడికక్కడ నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉగాదికి హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పథకం ప్రారంభం

సీఎం రేవంత్ చేతుల మీదుగా కార్యక్రమం

అనంతరం భారీ బహిరంగ సభ: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, హుజూర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ఉగాది రోజు (ఈ నెల 30)న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.45 గంటలకు హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్టు వద్ద హెలీప్యాడ్‌లో దిగుతారు. అనంతరం ఆ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న 2,160 మోడల్ కాలనీ ఇళ్లను సీఎం పరిశీలిస్తారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో పట్టణంలోని ఫణిగిరి గుట్టుకు వెళ్లే దారిలోని రాజీవ్ ప్రాంగణానికి 6.15 గంటలకు చేరుకుంటారు. ఉగాది పర్వదినం సందర్భంగా బహిరంగ సభలోనే సన్న బియ్యం పంపిణీ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. 6.15 గంటల నుంచి 7.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 7.30 గంటలకు హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 9.45 గంటలకు హైదరాబాద్‌కు వెళతారు. ఈ సభలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలో ఈ నెల 30న నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభాస్థలాన్ని, పట్టణంలోని సభా ప్రాంగణం, హెలీప్యాడ్ స్థలం, హౌసింగ్ మోడల్ కాలనీలను పౌర సరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంక, కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్‌లు మంగళవారం పరిశీలించారు. సీఎం సభకు సుమారు 50 వేల మంది వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవి అయినందున సభకు వచ్చే వారికి చల్లని నీరు, మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఫణిగిరి గుట్టు వద్ద హెలికాప్టర్ దిగే స్థలంలో విద్యుత్ లైన్లు, స్తంభాలు తొలగించాలని ఆదేశించారు.

అసంతృప్తి నిజమే: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పదవి రాకపోవడంపై అసంతృప్తి నిజమేనని శాసన మండలి సభ్యుడు జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరికైనా పదవి రాకపోతే అసంతృప్తి ఉండడం సహజమేనని, అయితే కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలను కూడా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. పదవులతో సంబంధం లేకుండా ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటానని తెలిపారు. ఈ నెల 29తో ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో విలేకరుల ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.

టన్నెల్ ప్రమాదం మల్లెల తీర్థం వల్లే!

టన్నెల్ నుంచి 20 కి.మీ లోపే ఉన్న జలపాతం.. ఒత్తిడి పెరిగి టన్నెల్‌లోకి రావడంతో ప్రమాదం

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదానికి దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని మల్లెల తీర్థం జలపాతమే కారణమా? ఆ జలపాతం నీరే టన్నెల్‌లోకి ఊటనీరుగా వెళ్లి సొరంగం పైకప్పును కూల్చిందా? అంటే.. నిపుణులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దేవాదుల మూడో దశ టన్నెల్‌ను చలివాగు కమ్మేసినట్లుగానే.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను మల్లెల తీర్థం జలపాతం ముంచిందని అనుమానిస్తున్నారు. జలపాతం నుంచి వచ్చే ఊట నీటిని బయటకు పంపకుండా గ్రౌటింగ్ ద్వారా అడ్డుకోవడంతో.. ఆ నీరు అంతా ఒక్కచోటకు చేరి టన్నెల్ పైకప్పు కూలేందుకు కారణమయిందని అంటున్నారు. వాస్తవానికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు మొదటి నుంచీ ఏదో ఒక రూపంలో ఆటంకం ఎదురవుతూనే ఉంది. దాంతో 2005లో మొదలైన ఈ సొరంగ మార్గం పనులు నేటికీ పూర్తికాలేదు. ఎస్ఎల్‌బీసీ పథకంలో భాగంగా శ్రీశైలం రిజర్వాయర్ సమీపంలోని నాగర్‌కర్నూల్‌జిల్లా దోమలపెంట నుంచి అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి దాకా 43.930 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది. దీనిని రెండు వైపుల నుంచి (ఇన్‌లెట్, ఔట్‌లెట్) తవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం రెండు టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)లను వినియోగిస్తున్నారు. ఒకటి మన్నెవారిపల్లి నుంచి, ఇంకొకటి దోమలపెంట నుంచి తవ్వుకుంటూ వస్తున్నారు. తవ్వకం పూర్తయ్యాక ఈ యంత్రాలను టన్నెల్‌లోనే పక్కకు తరలించి.. అక్కడే మట్టితో కప్పేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్‌ను 13.936 కిలోమీటర్లు తవ్వగా, అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి నుంచి 20.436 కిలోమీటర్ల వరకు తవ్వకం పూర్తిచేశారు. మరో 9.56 కిలోమీటర్ల మేర రెండువైపుల నుంచి తవ్వితే టన్నెల్ పూర్తవుతుంది.

2019 నుంచి ముందుకు సాగని పనులు..

2019 నుంచి టన్నెల్‌లోకి ఊటనీరు వచ్చిచేరడమే కాకుండా.. మట్టి, రాళ్లు కూలుతుండటంతో సొరంగం తవ్వకం పనులు ముందుకు సాగలేదు. ఊటనీటిని తోడేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు ఊటనీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా సిమెంట్, పాలియేరిథిన్ గ్రౌటింగ్ చేయించారు. అయితే ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదానికి ఇదే కారణమయిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీపేజీ (ఊటనీరు)ని గ్రౌటింగ్ చేయడంతో.. ఆ నీరు టన్నెల్ ఉదర భాగంలో ఒకే ప్రాంతంలో చేరి, ఒత్తిడితో టన్నెల్‌లోకి వచ్చిందని నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవానికి దోమలపెంటలోని టన్నెల్ నుంచి 20 కిలోమీటర్ల లోపే మల్లెల తీర్థం జలపాతం ఉంది. ఇది వటువర్లపల్లి నుంచి కొద్దిదూరం లోపలికి వెళ్లాక ఉండే సహజ జలపాతం. ఇక్కడ ఏడాదిలో 365 రోజులూ జలపాతంలో నీళ్లుంటాయి. ఆ నీళ్లన్నీ క్రమంగా శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో కలుస్తాయి. అయితే దోమలపెంట నుంచి లోపలికి 13.95 కిలోమీటర్ల దాకా టన్నెల్ తవ్వగా.. అక్కడి నుంచి 4.7 కిలోమీటర్ల దూరంలోనే మల్లెల తీర్థం జలపాతం ఉంది. ఆ జలపాతంలో దూకే నీరే క్రమంగా టన్నెల్‌లోకి వస్తుందని, నిమిషానికి 3వేల లీటర్ల ఊటనీరు రావడం వెనుక కారణం ఇదేనని నిపుణులు గుర్తించారు. ఇప్పటిదాకా శ్రీశైలం జలాశయంలోని నీరే సీపేజీగా మారుతుందని అనుమానించగా.. తాజాగా ఆ నీరు మల్లెల తీర్థం జలపాతం నుంచి వస్తోందని నిర్ధారించారు.


మల్లెల తీర్థం గూగుల్ ఎర్త్ ఇమేజ్

పరిష్కారానికి 3 మార్గాలు..

టన్నెల్ తవ్వకం ముందుకు సాగాలంటే.. మూడు పరిష్కార మార్గాలున్నాయని అధికారులు అంటున్నారు. ఇందులో ఒకటి.. వచ్చిన సీపేజీని వచ్చినట్లే తోడి శ్రీశైలం జలాశయంలోకి పంపడం, మరొకటి మల్లెల తీర్థం దిగువన ఒక చెక్‌డ్యామ్ లేదా హెడ్‌ను అభివృద్ధి చేసి, ఆ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా వటువర్లపల్లి పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరుగా అందించడం అని పేర్కొంటున్నారు. మరో ప్రత్యామ్నాయం.. టన్నెల్‌లోకి సీపేజీ దిగుతున్న ప్రదేశం నుంచే నీటిని దారిమళ్లించడమని చెబుతున్నారు. వాస్తవానికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో దోమలపెంట వైపునుంచి లోపలికి 13.6 కిలోమీటర్ల తర్వాత ముందుకెళ్లడం ఏమాత్రం సురక్షితం కాదని, ఏదైనా జరిగే అవకాశం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) ఇప్పటికే హెచ్చరించింది. సరిగ్గా టన్నెల్ బోరింగ్ మెషిన్ 13.6 కిలోమీటర్ల వద్ద ఉన్నప్పుడే సొరంగం పైకప్పు కూలింది. కాగా, దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా మూడో దశలో చలివాగు కిందినుంచి టన్నెల్ తవ్వుతుండగా.. చలివాగు నీరంతా టన్నెల్‌లోకి చేరి పలువురు గల్లంతయ్యారు. సరిగ్గా అదే పరిస్థితి శ్రీశైలం టన్నెల్‌లోనూ సంభవించింది.

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం లభ్యం

» మృతుడు జయప్రకాశ్ అసోసియేట్స్ ఇంజనీర్ మనోజ్ కుమార్‌గా గుర్తింపు

నాగర్‌కర్నూల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో మరో మృతదేహం లభ్యమైంది. మృతుడిని జయప్రకాశ్ అసోసియేట్స్‌కు చెందిన ఇంజనీర్ మనోజ్ కుమార్ (51)గా గుర్తించారు. అతని స్వస్థలం ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లా బాంగర్‌మవూ గ్రామం. అతనికి భార్య స్వర్ణలత, కుమారుడు ఆదర్శ్, కుమార్తె శైలజ ఉన్నారు. గతనెల 22న సొరంగంలో కొంత భాగం కుప్పకూలి 8 మంది కార్మికులు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. వారిని కనుగొనేందుకు ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి కార్మికులతో సహా 18 ఏజెన్సీలకు చెందిన సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఒకరి మృతదేహం లభ్యమైంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మరొకరి మృతదేహాన్ని కనుగొన్నారు. కన్వేయర్ బెల్టుకు 40-50 మీటర్ల దూరంలో లోకోట్రైన్ శిథిలాల కింద మృతదేహం కాలు కనిపించింది. ఎక్స్‌కవేటర్‌తో ఏమాత్రం కదిపినా మృతదేహం ఆనవాళ్లు లేకుండాపోయే ప్రమాదం ఉండడంతో మాన్యువల్‌గా మట్టిని తొలగించారు. ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చేసరికి ఉదయం 10 గంటలు అయింది. ఒంటిపై ఉన్న దుస్తులు, కొన్ని వైద్య పరీక్షల తర్వాత మృతుడిని మనోజ్ కుమార్‌గా గుర్తించారు. మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో అతని మృతదేహాన్ని ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ నుంచి బయటకు తీసుకొచ్చి నాగర్‌కర్నూల్ వైద్యకళాశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాష్ట్ర తరఫున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఎమ్మెల్సీ కూచకుల్ల దామోదర్ రెడ్డి చెక్కు రూపంలో వారికి అందజేశారు. మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వస్థలానికి పంపించారు.


మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ కె. దామోదర్‌రెడ్డి


మనోజ్ కుమార్ (ఫైల్)

మీ మనసు బాధపడితే ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుంటా: స్పీకర్



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 'మహిళలంటే నాకు ఎనలేని గౌరవం. నాకు 8 మంది అక్కాచెల్లెళ్లు ఉన్నారు. సభ్యుల రన్నింగ్ కామెంట్రీ వల్ల మీ మాటలు నాకే వినబడటం లేదని అన్నాను తప్ప.. ఇందులో మరో ఉద్దేశం లేదు. మీ మనసు బాధపడి ఉంటే వెనక్కితీసుకుంటాను' అని స్పీకర్ ప్రసాద్ కుమార్.. నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో అన్నారు. సోమవారం సభలో మీ మాటలు నాకే వినబడటం లేదని స్పీకర్ తనను ఉద్దేశించే అన్నారని సునీతా లక్ష్మారెడ్డి శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే ఈ అంశాన్ని లేవనెత్తారు. 'సభ్యుల హక్కులను కాపాడే బాధ్యత మీదే. ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అన్‌పార్లమెంటరీ భాషను వినియోగిస్తున్నా... నేను మాత్రం క్రమశిక్షణకు కట్టుబడి ఉంటున్నాను. నియోజకవర్గ సమస్యలపైనే మాట్లాడుతుంటానే. మీ వ్యాఖ్యలు (మీరు మాట్లాడేది నాకే వినబడటం లేదు) నాకు బాధ కలిగించాయి... సభ అందరిదీ, నేను పరిధి దాటలేదు... ఆ వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలి' అని ఆమె కోరగా.. స్పీకర్ పై విధంగా స్పందించారు.

త్వరలో ఎకో టూరిజం పాలసీ

- 100 కోట్ల ఆదాయం దాటిన ఆలయాలను పాలక మండళ్ల పరిధిలోకి తెచ్చాం: సురేఖ



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఎకో టూరిజం పాలసీ తీసుకురాబోతున్నామని, మంత్రివర్గం ఆమోదం తర్వాత మార్గదర్శకాలు విడుదల చేస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. టెంపుల్ టూరిజం మార్గదర్శకాలు కూడా రూపొందిస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సులతో దేవాలయాల ఆదాయం పెరిగిందన్నారు. రాష్ట్రంలో రూ.100 కోట్ల ఆదాయం వచ్చే దేవాలయాలను పాలక మండళ్ల పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో కబ్జాకు గురైన 1146 ఎకరాల దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు. నెహ్రూ జూ పార్కును వేరే ప్రాంతానికి తరలించే ఆలోచన ప్రస్తుతానికి లేదన్నారు. ప్రభుత్వ ఆదాయంలో పది శాతం పర్యాటక రంగం ద్వారా తేవడానికి వివిధ ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో పర్యాటక రంగాన్ని నిర్వీర్యం చేసిందని, రూ.2 వేల కోట్ల నిధులు కేటాయిస్తే.. కనీసం రూ.50 కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. క్రికెట్ అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో తెలంగాణకు చెందిన త్రిష, ధృతి ఉండగా, త్రిషకు రూ.కోటి ఇచ్చి సత్కరించారని, ధృతికి మాత్రం రూ.10 లక్షలే ఇవ్వడం ఏమిటని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. ధృతి కూడా పేద కుటుంబం నుంచే వచ్చిందన్నారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి ధృతికి కూడా న్యాయం చేస్తామని సురేఖ తెలిపారు.

'మన ఊరు-మన బడి' పెద్ద స్కామ్:అక్బరుద్దీన్



బీఆర్ఎస్ హయాంలో 'మన ఊరు మన బడి' అనేక కార్యక్రమం అతి పెద్ద కుంభకోణమని ఏఐఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఆరోపించారు. బడ్జెట్ పద్దుల సందర్భంగా విద్య అంశంపై ఆయన మాట్లాడుతూ.. గత సర్కారు హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కంటే 'మన ఊరు మన బడి' అనేదే అతి పెద్ద స్కామ్ అని అన్నారు. మిగతావన్నీ చాలా చిన్నచిన్న కుంభకోణాలని వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ సర్కారు సమగ్రవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదన్నారు. 4,823 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, 2 వేలకుపైగా బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక వారు ఎంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తగినంత నిధులు కేటాయించకుండా విద్యా వ్యవస్థను ఎలా బలోపేతం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పార్టీ హవాలోనే కడియం గెలుస్తారు: ఎర్రబెల్లి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి వేవ్స్ (పార్టీ హవా) లోనే గెలుస్తారంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో ఇద్దరూ ఎదురెదురుగా తారసపడ్డారు. ఎర్రబెల్లి బయటకు ఒకటి మాట్లాడుతారని, తనతో ఫోన్‌లో మరొకటి చెబుతారంటూ కడియం శ్రీహరి అన్నారు. దీనికి ఎర్రబెల్లి స్పందిస్తూ కడియం ఎప్పుడూ వేవ్స్‌లో గెలుస్తారు తప్ప.. ప్రజల్లో వ్యక్తిగత గుర్తింపు ద్వారా గెలవరని అన్నారు. తాను ప్రజలతో మమేకమై ఉంటానని, ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతానని చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్ సమయంలోనూ టీడీపీ నుంచి గెలిచానని, కాంగ్రెస్ గాలి వీచినప్పుడూ గెలిచానని పేర్కొన్నారు. కడియం గురించి తాను చెప్పాల్సిన అవసరం లేదని ఎర్రబెల్లి వ్యాఖ్యానించారు.

వివేక్..మొత్తానికి సాధించారు: మల్లారెడ్డి

కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మధ్య అసెంబ్లీ లాబీలో ఆసక్తికర చర్చ నడిచింది. వివేక్ ఎదురు పడగానే... సీఎం, డిప్యూటీ సీఎంకంటే ముందే ఢిల్లీ వెళ్లారు... మొత్తానికి సాధించారంటూ మల్లారెడ్డి అన్నారు. స్పందించిన వివేక్.. తాను ఇతర పనుల మీద ఢిల్లీ వెళ్లానని అన్నారు. వివేక్‌కు మంత్రి పదవి లభించనుందన్న వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మొత్తానికి సాధించారంటూ ఆయన్ను మల్లారెడ్డి అభినందించారు. రాష్ట్రంలో వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హవానే నడుస్తోందని మల్లారెడ్డి చెప్పగా... కేసీఆర్, మల్లారెడ్డి కుటుంబాలదే నడుస్తోందంటూ నవ్వుతూ వివేక్ వ్యాఖ్యానించారు.

ఎన్నికైన స్థానిక సంస్థలకే ఆర్థిక సంఘం గ్రాంట్లు

- కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని స్థానిక సంస్థలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం కేటాయించిన గ్రాంట్ల విడుదల వాయిదా పడినట్లు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ తెలిపారు. చట్టబద్ధంగా ఎన్నికైన స్థానిక సంస్థలు ఉంటేనే నిధులు విడుదలవుతాయని లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి బఘేల్ లిఖిత పూర్వక సమాధానంలో చెప్పారు. కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాల ప్రకారం 2021-22 నుంచి 2025-26 మధ్య చట్టబద్ధంగా ఎన్నికైన స్థానిక సంస్థలకే 15వ ఆర్థిక సంఘం సిఫారసులకు అనుగుణంగా గ్రాంట్లు విడుదల అవుతాయన్నారు.

త్వరలో ఫీజు నియంత్రణ కమిషన్

- ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో దోపిడీకి చెక్
- విద్యా కమిషన్ సూచనలతోసంస్కరణలు
- సభలో మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఫీజు దోపిడీకి అడ్డుకట్ట వేయడానికి త్వరలోనే ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. పదేళ్లలో 7.5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావడం మానేశారని, ఈ పరిస్థితిని అధిగమించి.. బడి అంటే భవితలా పాఠశాలలకు కొత్త రూపం తీసుకుని వస్తామని వెల్లడించారు. మంగళవారం శాసనసభలో విద్యాశాఖ పద్దుపై చర్చ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన విద్యా వ్యవస్థను పట్టాలు ఎక్కించడానికి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కమిషన్ సూచనలు పరిశీలించి విద్యా వ్యవస్థకు కొత్త రూపం తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కొత్త పాఠశాలలను ప్రారంభించడం కన్నా ప్రస్తుతమున్న వాటిలో వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. బాలికల వసతి గృహాల్లో ఐదారు వందల మందికి ఐదారు బాత్‌రూంలు ఉన్నాయని, ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి కార్పొరేట్ కంపెనీలను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. విశాలమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, మంచి నీటి వసతి, పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లను అందుబాటులోకి తీసుకుని రావడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఉపాధి లక్ష్యంగా కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నామని, విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచడానికి అంతర్జాతీయ కంపెనీలు, విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు 160 క్రెడిట్స్ సాధించలేక మధ్యలోనే చదువు వదిలేస్తున్నారని, ఈ పరిస్థితిని అధిగమించడానికి 80 క్రెడిట్స్ సాధించినా వారికి ఉపాధి దొరికేలా ఒక సర్టిఫికెట్ ఇవ్వాలనే ప్రతిపాదనపై కసరత్తు జరుగుతోందని వివరించారు.

ఉస్మానియా వర్సిటీ అంతటా నిషేధం లేదు..

మన ఊరు-మన బడి పథకంలో పావు శాతం పనులు కూడా పూర్తి చేయలేదని, ఆ పనులను పూర్తి చేయించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. డిగ్రీ కాలేజీలు ఉన్న స్థలానికి సంబంధించిన ల్యాండ్ టైటిల్ డీడ్స్‌ను ప్రభుత్వం ఇస్తే.. కేంద్ర పథకం ద్వారా రూ.ఐదు కోట్ల గ్రాంటు వస్తుందని, ఈ విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలపై నిషేధం సరికాదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దీనిపై మంత్రి రాజనర్సింహ స్పందించారు. ఉస్మానియా పరిపాలనా భవనం వద్ద మాత్రమే నిషేధం ఉందని, యూనివర్సిటీ అంతా కాదని వివరించారు.

ఓఆర్ఆర్‌ని అమ్ముకున్నోళ్లు..
ఆర్ఆర్ఆర్‌పై మాట్లాడతారా?

ఆ అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదు: మంత్రి కోమటిరెడ్డి.. 2017లోనే జాతీయ .. హైవే నంబరు వచ్చిందని వెల్లడి

- 'మద్యంతో అదనపు ఆదాయం' లక్ష్యం కాదు: జూపల్లి





హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)ను కాంగ్రెస్ నిర్మిస్తే బీఆర్ఎస్ సర్కారు గత ఎన్నికలకు కొద్ది రోజుల ముందు అమ్మేసుకుందని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నోళ్లకు ఆర్ఆర్ఆర్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయనిది తాము 15 నెలల్లో చేసి చూపించామని చెప్పారు. మంగళవారం శాసనసభలో ఆర్ఆర్ఆర్‌తో పాటు రోడ్లు, భవనాల పద్దులపై చర్చలో ప్రతిపక్ష సభ్యులు చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి దీటుగా బదులిచ్చారు. సమావేశాలు ప్రారంభం కాగానే మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వివిధ శాఖల పద్దులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాలు, ఎక్సైజ్ శాఖపై అధికార, విపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరిగింది. సరిపడా నిధులు కేటాయించకుండా ఆర్ఆర్ఆర్‌కు భూములు ఎలా సేకరిస్తారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు. ఆర్ఆర్ఆర్‌కు పర్యావరణ అనుమతి లేదని, జాతీయ హైవే నంబరు కూడా లేనందువల్లే భూసేకరణ చేయలేదని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కల్పించుకొని.. ఆర్ఆర్ఆర్‌కు 2017లోనే ఎన్‌హెచ్-167 నంబరు ఇచ్చారన్నారు. 88 శాతం మంది రైతుల నుంచి భూసేకరణకు సమ్మతి తీసుకున్నామని, రెండు నెలల్లోపు ఆర్ఆర్ఆర్‌కు అన్ని అనుమతులు వస్తాయని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భూసేకరణపై నోటిఫికేషన్ ఒక్కటే ఇచ్చారని, గజ్వేల్ (కేసీఆర్), సిరిసిల్ల (కేటీఆర్), సిద్దిపేట (హరీశ్)కు రోడ్లు వేసుకుంటే చాలా? దుబ్బాక, హుస్నాబాద్‌కు రోడ్లు వద్దా? అని ప్రశ్నించారు. కాగా, రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 12 వేల కి.మీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 17,300 కి.మీ. కొత్త రోడ్లు నిర్మిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైబ్రిడ్ యాన్యుయిటీ విధానం(హ్యామ్)లో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని.. దీని వల్ల ప్రజలపై టోల్ భారం పడదని స్పష్టం చేశారు.

ఆ చెట్లపై నిర్ణయం తీసుకోండి: స్పీకర్

చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ రహదారి నిర్మాణాన్ని త్వరగా మొదలుపెట్టాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి కోమటిరెడ్డికి సూచించారు. ఈ మార్గంలో ఉన్న 200 ఏళ్ల నాటి మర్రిచెట్లు ఎప్పుడు ఎవరిపై పడతాయో తెలియకుండా ఉందని, వాటిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. మంత్రి బదులిస్తూ ఆ మర్రిచెట్ల అంశం వల్లే జాప్యం చోటుచేసుకుంటోందన్నారు. మంగళవారం సభలో దేవాదాయ, విద్యా శాఖ, ఆర్ అండ్ బీ పద్దులు ఆమోదం పొందాయి. రాత్రి 11 గంటలకు సభ వాయిదా పడింది.

రేషన్‌షాపుల్లో మద్యం అమ్మిన చరిత్ర మీది

'మద్యం అమ్మకాలతో ఆదాయాన్ని రూ.50 వేల కోట్లు రాబట్టుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. 'కొత్త బ్రాండ్లు, కొత్త బీర్లు, కొత్త బెల్ట్‌షాపులు' ఇవేనా కాంగ్రెస్ విధానం? ఎన్నికల మ్యానిఫెస్టోలో బెల్ట్‌షాపులు తొలగిస్తామని చెప్పారు. ఇప్పుడు ఆదాయం కోసం బెల్ట్‌షాపులు ఎలా పెడతారు' అని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కొత్తగా బెల్ట్‌షాపులు తేవడం కాదని, బీకేజీలను అరికట్టడమే తమ విధానమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 'రేషన్‌షాపుల్లో కూడా మద్యం అమ్మించిన చరిత్ర మీది' అని ఎద్దేవా చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఎక్సైజ్ ఆదాయం రూ.9 వేల కోట్లు ఉంటే.. 2023 డిసెంబరు నాటికి రూ.34 వేల కోట్లకు చేరిందని, ఇంత ఆదాయాన్ని పెంచిందెవరని ప్రశ్నించారు. 15 నెలల్లో తాము ఒక్క శాతం పన్ను కూడా పెంచలేదన్నారు. ఆదాయం కూడా తగ్గిందని గుర్తుచేశారు. మద్యం ద్వారా అదనపు ఆదాయం కోసం ప్రభుత్వం కృషి చేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో మద్యం ఆదాయాన్ని 350 శాతం పెంచారని తెలిపారు. అప్పట్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఉండేవని, గత ఏడాది బెల్ట్ షాపులకు సంబంధించి సుమారు ఏడు వేల మందిని అరెస్టు చేశారని తెలిపారు. నూతన టూరిజం పాలసీని రూపొందించామని, ప్రభుత్వ ఆదాయంలో పది శాతం పర్యాటక రంగం ద్వారా తేవడానికి వివిధ ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నామని జూపల్లి కృష్ణారావు వివరించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రంలో నూతన పర్యాటక ప్రాజెక్టులు రాబోతున్నాయని చెప్పారు.

మిస్ వరల్డ్ పోటీలకు 54 కోట్ల ఖర్చు తప్పుకానప్పుడు.. ఫార్ములా-ఈ తప్పుకాదు: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలకు రూ.54 కోట్లు ఖర్చు పెట్టబోవడం తప్పుకానప్పుడు.. గతంలో తాము రూ.46 కోట్లతో ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహించడం కూడా తప్పు కాదని కేటీఆర్ అన్నారు. ఫార్ములా-ఈ కారు ఈవెంట్‌ను రేవంత్ సర్కారు చాలా మూర్ఖంగా రద్దు చేసిందని విమర్శించారు. దాని వల్ల ఖజానాకు రూ.46 కోట్ల నష్టం జరిగిందన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీరు లేక అప్పుల పాలై 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదని, అదే సమయంలో ఏదో సాధించామన్నట్లు మిస్ వరల్డ్ పోటీలను అట్టహాసంగా నిర్వహించబోతోందని విమర్శించారు. ఫార్ములా-ఈ వలన రాష్ట్రానికి ఎలక్ట్రానిక్స్ రంగంలో అనేక పెట్టుబడులు వచ్చాయని, మిస్ వరల్డ్ పోటీలతో ఆదాయం, పెట్టుబడులు ఎలా వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. టీవోటీ పద్ధతిలో 33 ఏళ్లకు లీజుకు ఇస్తే తప్పన్నారని, కానీ పర్యాటక విధానంలో 99 ఏళ్లకు ప్రభుత్వ ఆస్తులు లీజుకు ఇస్తున్నారన్నారని విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి జూపల్లి కృష్ణారావు బదులిస్తూ ధనిక రాష్ట్రమైన తెలంగాణను పదేళ్లలో బీఆర్ఎస్ అప్పుల పాలు చేసిందని విమర్శించారు. అన్ని వనరులు, ఆదాయం ఉన్నా అనుకున్నంత స్థాయిలో రాష్ట్రాన్ని గత పాలకులు పదేళ్ల పాటు అభివృద్ధి చేయలేదన్నారు. అంబేడ్కర్‌పై బీఆర్ఎస్‌కు నిజంగా ప్రేమ ఉంటే విగ్రహం పెట్టేందుకు పదేళ్లు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు.





దొడ్డు బియ్యం వేలం?

ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ నేపథ్యంలో సర్కారు ఆలోచన

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉగాది(ఏప్రిల్ నెల కోటా) నుంచి రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. దొడ్డు బియ్యం నిల్వలపై దృష్టి సారించింది. ప్రభుత్వ గోదాముల్లో ఉన్న దొడ్డు బియ్యాన్ని టెండరు పద్ధతిలో విక్రయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో భారత ఆహారసంస్థ(ఎఫ్‌సీఐ) గోదాముల్లో 6.64 లక్షల టన్నులు, మధ్యంతర గోదాముల్లో 1.76 లక్షల టన్నులు కలిపి.. మొత్తం 8.40 లక్షల టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. ఇవికాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,200 చౌక డిపోల్లో వినియోగదారులకు పంపిణీ చేయగా మిగిలిన బియ్యం నిల్వలూ ఉన్నాయి. మార్చి నెల పీడీఎస్ కోటా పంపిణీ మంగళవారం(మార్చి 25)తో ముగిసింది. దీంతో మిగిలిన బియ్యం మొత్తాన్ని సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. ఎన్ని బియ్యం ఉన్నాయో వాటి వివరాలను పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఆ లెక్కలు రానున్నాయి. ఆయా నిల్వలను తిరిగి గోదాములకు తరలించే అవకాశముంది. గోదాముల వారిగా దొడ్డు బియ్యం నిల్వల లెక్కలు తేలిన తర్వాత టెండరుకు వెళ్లే అవకాశాలున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో బియ్యం ధర క్వింటాలుకు రూ. 3,200 నుంచి రూ. 3,300 దాకా ఉంది. అయితే, మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని టెండర్లు నిర్వహిస్తారా? లేదా ప్రభుత్వమే బేస్ ప్రైస్(మూల ధర) నిర్ణయిస్తుందా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, దొడ్డు బియ్యం నిల్వలను ఖాళీ చేస్తే రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు కొంత ఆదాయం సమకూరనుంది. ప్రస్తుత మార్కెట్ ధరల లెక్క (రూ. 3,200) ప్రకారం చూస్తే.. 8.40 లక్షల టన్నులకు రూ.2,688 కోట్ల ఆదాయం వస్తుంది.

ఉగాదికి కొత్త మంత్రులు!

(మొదటిపేజీ తరువాయి)

ఎదురయ్యే పరిణామాలనూ అంచనా వేస్తున్నారు. బీసీల నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరి పేరు ఖరారైనట్లేనని ఇప్పటిదాకా ప్రచారంలో ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. రాష్ట్ర క్యాబినెట్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చోటు కల్పిస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ నేపథ్యంలో.. ఆ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి క్యాబినెట్లో చోటు గ్యారెంటీ అన్న ప్రచారం జరిగింది. అయితే మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న మున్నూరుకాపు సామాజికవర్గాన్ని దగ్గర చేసుకునేందుకు.. ఆ సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న చర్చ సోమవారం నాటి సమావేశంలో జరిగినట్లు తెలుస్తోంది. అప్పుడు వాకిటి శ్రీహరికి క్యాబినెట్ హోదాతో విప్ బాధ్యతలు ఇవ్వాలన్న దానిపై చర్చించారు. ఈ రెండు అంశాలూ ప్రస్తుతం అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక ముస్లిం సామాజిక వర్గానికి సంబంధించి మంత్రివర్గంలోకి తీసుకోవడానికి ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్ ఒక్కరే చట్టసభల్లో అందుబాటులో ఉన్నారు. ఈ వర్గం నుంచి ఆయనకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఇదికాకుండా.. ముస్లింల నుంచి పార్టీ సీనియర్ నేత ఎవరినైనా క్యాబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత ఎమ్మెల్సీని చేసే అంశాన్నీ పరిశీలించినట్లు సమాచారం.

రాజగోపాల్‌రెడ్డిపై తర్జన భర్జన!

రెడ్డి సామాజికవర్గం నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు చెబుతున్నారు. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మొదటి నుంచీ పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడమూ ఆయనకు కలిసివస్తోంది. అయితే రెడ్డి సామాజిక వర్గం నుంచే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎన్నికల ముందు అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు తనను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. కానీ, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అదే సామాజికవర్గం నుంచి ఇప్పటికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. పైగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. రాజగోపాల్‌రెడ్డికి స్వయానా సోదరుడు. ఈ నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డికి క్యాబినెట్లో అవకాశం కల్పిస్తే ఒకే జిల్లాలో, ఒకే సామాజికవర్గం నుంచి ముగ్గురు మంత్రులకు అవకాశం ఇచ్చినట్లవుతుంది. అలాగే ఒక కుటుంబం నుంచీ ఇద్దరికి చోటు దక్కినట్లవుతుంది. ఈ నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకుంటే జరగబోయే పరిణామాలనూ అధిష్ఠానం అంచనా వేస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్ఠానం భావిస్తే.. ఉగాది రోజున ఐదుగురు నేతలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారని అంటున్నారు. సమీకరణాలు కుదరకపోతే ఆ బెర్తును పెండింగ్‌లో పెట్టి నలుగురికి అవకాశం ఇస్తుందంటున్నారు. కాగా, లంబాడా సామాజిక వర్గం నుంచి మంత్రివర్గంలో చోటు ఆశిస్తున్న బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇక ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు కోసం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తమ వంతు ప్రయత్నాలు చేసుకున్నారు. వీరిలో ఒకరికి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి దక్కనున్నట్లు చెబుతున్నారు.

నాకు మంత్రి పదవి వస్తుందనే అనుకుంటున్నా: రాజగోపాల్‌రెడ్డి

క్యాబినెట్ విస్తరణపై ఢిల్లీలో సోమవారం చర్చ సీరియస్‌గానే జరిగినట్లుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తనకు మంత్రి పదవి వస్తుందనే అనుకుంటున్నానని చెప్పారు. అయితే ఇప్పటివరకైతే ఢిల్లీ నుంచి తనకు ఫోన్ రాలేదన్నారు. హోం మంత్రిత్వ శాఖ అంటే తనకు ఇష్టమని, కెపాసిటీని బట్టి మంత్రుల ఎంపిక జరగాలని వ్యాఖ్యానించారు. అయినా.. ఏ పదవి వచ్చినా సమర్థంగా నిర్వహిస్తానని, ప్రజల పక్షాన నిలబడతానని చెప్పారు. అసెంబ్లీ లాబీల్లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ!

మంత్రివర్గ విస్తరణ, పీసీసీ పదవులపై చర్చ

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంగళవారం సమావేశమైనట్టు తెలిసింది. సోమవారమే ఢిల్లీ వచ్చిన సీఎం రేవంత్.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ అధిష్ఠానంతో భేటీ అయ్యారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశం అనంతరం భట్టి, ఉత్తమ్, మహేశ్ కుమార్ గౌడ్ రాష్ట్రానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఢిల్లీలోనే ఉండిపోయిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మంగళవారం మళ్లీ సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలతో కలిసి మంత్రివర్గ విస్తరణ, పీసీసీ పదవులపై మరోమారు ఖర్గేతో చర్చించారని తెలిసింది. ఖర్గేతో భేటీ అనంతరం సీఎం రేవంత్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ బయలుదేరారు.

ఫిరాయింపులపై గత తీర్పులను ఎలా మార్చగలం?

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం చెప్పాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం సహా ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. అయితే అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశారు. తాము బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నామని, పార్టీ ఫిరాయింపు ఆరోపణల్లో వాస్తవం లేదని, కేవలం ఎమ్మెల్యే హోదాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశామని తెలిపారు. కాగా, మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిస్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. తొలుత.. అసెంబ్లీ కార్యదర్శి తరపున కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం, కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, మోహిత్‌రావు, స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ముకుల్ రోహత్గీ హాజరయ్యారు.

హైకోర్టు ఆదేశించినా నోటీసులివ్వలేదు..

ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో పార్టీ ఫిరాయింపులపై తొలిసారి కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. అనంతరం జూన్‌లో రిట్ పిటిషన్ వేశామన్నారు. గతేడాది సెప్టెంబరులో నాలుగు వారాల్లో విచారణ షెడ్యూల్‌ను నిర్ణయించాలని స్పీకర్ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ ఏడాది జనవరి వరకు నోటీసులు జారీ చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని గుర్తు చేశారు. దానం నాగేందర్‌పై ఫిర్యాదు చేసినా స్పీకర్ ఆయనకు నోటీసులు ఇవ్వలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఆయనను పదవిలో కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగ నియమాలకు విరుద్ధమని వాదించారు. అలాగే కడియం శ్రీహరికి వ్యతిరేకంగా సాక్ష్యాలు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్పీకర్ సమయంపై సుభాష్ దేశాయ్, కేశం మేఘాచంద్, రాజేంద్రసింగ్ రాణా కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని చెప్పారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులిస్తే ముగ్గురూ ఒకేలా సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. పైగా.. ఎమ్మెల్యేలకు నోటీసులు ఇస్తున్నామని స్పీకర్ అంటున్నారని, కానీ.. ఆ కాపీలు తమకు ఇవ్వడం లేదన్నారు. స్పీకర్ అధికారాలు సైతం న్యాయసమీక్ష పరిధిలోనే ఉంటాయని, ఫిరాయింపుల అంశంలో స్పీకర్ నిర్ణయంపై నిర్దిష్టమైన గడువు విధించాలని కోరారు.



ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా?

పిటిషనర్ వాదనలపై జస్టిస్ బీఆర్ గవాయ్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏడాది కాలం అంటే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా? అని వ్యాఖ్యానించారు. "ఫిరాయింపులపై స్పీకర్ కార్యాలయానికి మొదటి ఫిర్యాదు అంది ఎంతకాలం అవుతోంది? సుమారు సంవత్సరం అయినట్లు కనిపిస్తోంది. అంటే.. ఫిరాయింపులకు వార్షికోత్సవం అయినట్టే ఉంది. ఈ పిటిషన్లను నిర్ణయించడానికి స్పీకర్ కార్యాలయం ఎందుకు తాత్సారం చేస్తోంది? నిర్ణయం తీసుకోవడానికి ఇంకెంత సమయం కావాలి? ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడానికి స్పీకర్ కార్యాలయానికి ఇంకెంత సమయం పడుతుంది? ఆలస్యం చేసే ఎత్తుగడలు అనుసరించొద్దు. స్పీకర్ దృష్టిలో రీజనబుల్ టైం అంటే గడువు ముగిసే వరకా?" అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. స్పీకర్ క్వాసీ జ్యుడీషియరీ అధికారాలతో ఉన్నారని, రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు. ఒకవేళ అది జరగడం లేదని భావిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించడానికి రాజ్యాంగం అవకాశం కల్పించిందని తెలిపారు. అలాంటి సందర్భంలో రాజ్యాంగ పరిరక్షకులుగా న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

స్పీకర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఫిరాయింపులపై గతేడాది జూలై మొదటి వారంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని, 9వ తేదీ నాటికే కోర్టులో పిటిషన్ వేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. నారిమన్ కేసులో ఫిర్యాదుకు, పిటిషన్‌కు నిర్దిష్ట గడువు ఉండాలని కోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. ఫిరాయింపులపై ఫిర్యాదు అందగానే స్పీకర్ స్పందించారని, నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇంతలో జస్టిస్

వారంలోనే హైకోర్టుకు వెళ్లారు..

బీఆర్ గవాయ్ జోక్యం చేసుకొని.. గత విచారణ సందర్భంగా స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, ఇతర ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే.. విగిలిన ప్రతివాదులు సైతం కౌంటర్ దాఖలు చేయడానికి మరింత సమయం కావాలని కోరగా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలస్యం చేసే వ్యూహాలు వద్దని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున వాదనలు ముగిశాయని, ఇక అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు ఏప్రిల్ 2న వింటామని ధర్మాసనం తెలిపింది.

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

» కాకినాడ ఓడ రేవుకు చేరుకున్న బియ్యం బస్తాలు

» తొలుత 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి

హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేస్తామని ఆరు నెలల క్రితం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం... తొలి అడుగు వేసింది. తొలిసారిగా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించి... తెలంగాణ నుంచి ఏపీలోని కాకినాడ ఓడ రేవుకు పంపించింది. బియ్యం బస్తాలను ప్రస్తుతం ఓడలో లోడు చేస్తున్నారు. ఇది నాలుగైదు రోజుల్లో పూర్తి కాగానే ఫిలిప్పీన్స్‌కు పయనమవుతాయి. ఆ ఓడపై 'తెలంగాణ రైస్ టు ఫిలిప్పీన్స్' అని బ్యానర్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లోగోను కూడా ముద్రించారు. ఇండియా, ఫిలిప్పీన్స్ జాతీయ పతాకాలను కూడా ముద్రించారు. ఇప్పటివరకు రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, ఎగుమతిదారులు మాత్రమే విదేశాలకు బియ్యం విక్రయించేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బియ్యం ఎగుమతులు చేయటానికి శ్రీకారం చుట్టడం గమనార్హం. ఆరు నెలల క్రితం ఫిలిప్పీన్స్ ప్రభుత్వంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదం అయ్యాయి. తెలంగాణ నుంచి లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం దిగుమతి చేసుకునేందుకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్రానికి డిమాండ్ లేఖను పంపింది. అయితే బియ్యంలో నూక శాతం 5 శాతానికి మించి ఉండకూడదని, 95 శాతం ప్రధాన బియ్యం (హెడ్ రైస్) ఉండాలని షరతు విధించింది. ఫిలిప్పీన్స్ షరతుతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు రైస్ మిల్లర్లతో చర్చించారు. ముడి బియ్యం సరఫరా చేయాలని కోరారు. 25 శాతం నూకలకు బదులుగా, 5 శాతం నూకలతో బియ్యం సరఫరా చేస్తే... మిగిలిన 20 శాతానికి నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. బియ్యం సరఫరా చేసిన రైస్ మిల్లర్లకు క్వింటాలుకు రూ.300 చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేలా ఇరు వర్గాల మధ్య ఒప్పందం కుదిరినట్లు సమాచారం. మొత్తం మీద తెలంగాణ నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులకు మాత్రం అడుగుపడింది. రైస్ మిల్లర్ల నుంచి ఎప్పటికప్పుడు బియ్యాన్ని సేకరిస్తూ... విడతల వారీగా లక్ష మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం గమనార్హం. ఇదిలాఉండగా కాకినాడ ఓడరేవు నుంచి ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యంతో ఓడ బయలుదేరే రోజున మంత్రి ఉత్తమ్ కాకినాడకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అయితే మంత్రి పర్యటన ఇంతవరకు ఖరారుకాలేదు.



హైకోర్టులో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల రక్షణకు చట్టాలు తేవాలి

» అడ్వొకేట్ హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

హైదరాబాద్/సిటీ. మార్చి 25(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. వామనరావు దంపతుల హత్య దగ్గరి నుంచి లాయర్లపై అనేక దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంపాపేటలో దారుణ హత్యకు గురైన న్యాయవాది ఎర్రబాపు ఇజ్రాయెల్ హత్యకు నిరసనగా మంగళవారం హైకోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తెచ్చే వరకు పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. నిరసనలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయవాది హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావడం ద్వారా దాడులను అరికట్టాలని టీపీసీసీ లీగల్ సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా, న్యాయవాదుల రక్షణకు అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు.



పంచాంగం పుస్తకం ఆవిష్కరణలో విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సీఎంవో ప్రసన్న రై తదితరులు

ఆంధ్రజ్యోతి 'విశ్వావసు' పంచాంగం విడుదల

బెంగళూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ప్రతి ఏటా ఆంధ్రజ్యోతి పంచాంగం పుస్తకాన్ని పాఠకులకు అందిస్తోంది. ఈ సంవత్సరం ఆంధ్రజ్యోతి పంచాంగానికి విప్రో కంపెనీ వారి సంతూర్ సోప్ ప్రాయోజకత్వం వహించింది. ప్రస్తుతం 'విశ్వావసు' నామ సంవత్సర పంచాగంతోపాటు కొత్తగా విడుదల చేస్తున్న 'సంతూర్ లైమ్' సోప్‌ను శాంపిల్‌గా జత చేస్తున్నట్టు విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సీఎంవో ఎస్ ప్రసన్న రై తెలిపారు. సంతూర్ సోప్ ప్రాయోజకత్వంలో ఆదివారం లక్షలాదిమంది 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు పంచాంగంతో పాటు సోపులు చేరనున్నాయి. విప్రో కన్స్యూమర్ కేర్ ప్రధాన కార్యాలయం బెంగళూరులో మంగళవారం పంచాంగం పుస్తకాన్ని ప్రసన్న రై విడుదల చేశారు. ఆంధ్రజ్యోతి ద్వారా సంతూర్ సోప్ నూతన ఉత్పత్తి లైమ్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. నిమ్మ, అలోవెరా, మెంథాల్‌ల సువాసన గల ఈ సోప్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వినియోగదారులు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సంతూర్ బ్రాండ్ మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతితో విప్రో సంతూర్ అనుబంధం దశాబ్దాలుగా కొనసాగుతోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో విప్రో ప్రతినిధులు సుమన్‌పాల్, కావ్య, శిసేందు చటర్జీ, ఆంధ్రజ్యోతి బెంగళూరు జీఎం శ్రీకాంత్, డీజీఎం సుధాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఐడీకి బెట్టింగ్ యాప్ కేసులు!

నిర్వాహకుల్లో విదేశీయులే ఎక్కువ.. ప్రమోటర్లకు హవాలా ద్వారా డబ్బు

» సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించే చాన్స్!

» ఇప్పటికే రంగంలోకి దిగిన ఈడీ, సీఎస్‌బీ

» మియాపూర్ కేసులో..

రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ..?

» బెట్టింగ్ యాప్ కేసులను కొట్టివేయండి

» విచారణకు విష్ణుప్రియ, రీతూ గైర్హాజరు



హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టిస్తున్న బెట్టింగ్ యాప్ కేసులు సీఐడీకి బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. పంజాగుట్ట పోలీసులు బెట్టింగ్ యాప్స్‌పై కేసు నమోదు చేశాక.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధుల్లోని ఠాణాలకు ఇదే అంశంపై ఫిర్యాదులు హోరెత్తుతున్నాయి. మియాపూర్ పోలీసులు కూడా మరో కేసులో దర్యాప్తు ప్రారంభించడంతో.. ఈ కేసులన్నింటినీ సీఐడీకి బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు చాలా మంది విదేశీయులే.! చైనా కంపెనీల ప్రమేయం కూడా బయటపడుతోంది. నిర్వాహకులు రూ.వేల కోట్లను దేశం దాటించారు. యాప్స్ ప్రమోటర్లు- సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్లకు హవాలా మార్గాల్లో రెమ్యూనరేషన్ చెల్లించారనే ఆరోపణలున్నాయి. దీంతో.. మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు, సైబర్‌క్రైమ్ కోణంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) ఇప్పటికే రంగంలోకి దిగగా.. ప్రభుత్వం అన్ని కేసులను కలిపి.. రాష్ట్ర స్థాయి అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీఐడీకి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. అంతకంటే ముందే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని సమాచారం.

సినీనటులకు ఇబ్బందులే?

మియాపూర్ పోలీసులు నమోదు చేసిన బెట్టింగ్ యాప్స్ కేసులో పలువురు దిగ్గజ సినీ నటులు ఇబ్బందులను ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. 19 బెట్టింగ్ యాప్స్‌నకు సంబంధించిన 25 మంది నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదైన విషయం తెలిసిందే.! ఈ కేసులో పోలీసులు దూకుడు పెంచగా.. సైబరాబాద్ పోలీసు కమిషనర్, క్రైమ్స్ డీసీపీలు పక్కా ఆధారాలపై దృష్టిసారించాలని ఆదేశించినట్లు తెలిసింది. "తొందరపాటుతో చార్జ్‌షీట్ వేయొద్దు. కేసు నీరుకారకుండా.. పక్కా ఆధారాలను సేకరించి, పకడ్బందీగా ముందుకు సాగాలి. అవసరమైతే న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలి" అని సూచించినట్లు సమాచారం. దీంతో దర్యాప్తు అధికారులు.. ఏయే యాప్‌లను ఎవరెవరు ప్రమోట్ చేశారు? అందుకోసం వారికి దక్కిన ప్రతిఫలం ఎంత? అగ్రిమెంట్ వివరాలేంటి? అనే కోణంపై దృష్టిసారించారు. ఇప్పటి వరకు జంగిల్ రమ్మీ అనే యాప్‌ను రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ ప్రమోట్ చేశారని, ఏ23 యాప్‌నకు విజయ్ దేవరకొండ, యోలో 24/7 యాప్ కోసం మంచు లక్ష్మి ప్రచారం కల్పించారని నిర్ధారించారు. 19 యాప్‌లకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించిన తర్వాత.. నిర్వాహకులు, ప్రమోటర్లను గుర్తించి, వారికి నోటీసులిచ్చి, విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

హైకోర్టుకు విష్ణుప్రియ

బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌పై మియాపూర్, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలంటూ యాంకర్ బీ.విష్ణుప్రియ మంగళవారం హైకోర్టులో రెండు క్వాష్ పిటిషన్లను దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కల్పించారంటూ వినయ్ అనే వ్యక్తి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు, ఫణీంద్రశర్మ ఫిర్యాదుతో మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.! ఈ రెండు కేసుల్లోనూ ఫిర్యాదుదారులు తనపై ఎలాంటి ఆరోపణలు చేయలేదని విష్ణుప్రియ తన పిటిషన్లలో గుర్తుచేశారు. పోలీసులకు ఫిర్యాదులు అందింది బెట్టింగ్ యాప్‌లపైనేనని, అయితే పోలీసులు సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ తన పేరును చేర్చారని వివరించారు. పోలీసులు పెట్టిన సెక్షన్లేవీ తనకు వర్తించవని, ఈ నేపథ్యంలో ఆయా ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టే అవకాశాలున్నాయి. కాగా.. విష్ణుప్రియ, రీతూ చౌదరి మంగళవారం పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరవ్వాల్సి ఉండగా.. వారిద్దరూ డుమ్మా కొట్టడం గమనార్హం.!

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు యువకుడి బలి

(మొదటిపేజీ తరువాయి)

ఐపీఎల్ మ్యాచ్‌లోనూ బెట్టింగ్ వేసి రూ. 2 లక్షలు పోగొట్టుకున్నాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం గౌడవెల్లి గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతను చనిపోవడానికి ముందు లొకేషన్‌ను కుటుంబసభ్యులకు, స్నేహితులకు చేరవేయడంతో వారు అక్కడకు చేరుకుని రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలి నుంచి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సోమేశ్వర్‌రావు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విమానం ల్యాండయ్యేటప్పుడు ఎమర్జెన్సీ డోర్ తీయబోయాడు

» ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి నిర్వాకం

శంషాబాద్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విమానం ల్యాండ్ అవుతోన్న సమయంలో అత్యవసర ద్వారం తెరవడానికి యత్నించిన ఓ ప్రయాణికుడిపై కేసు నమోదైంది. ఈ ఘటన మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సౌదీ అరేబియా(దామస్) నుంచి వస్తున్న 6ఈ 86 ఇండిగో విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా నగరంలోని చార్మినార్ కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాద్రీ ఉస్మాన్(58) అత్యవసర ద్వారం తీయడానికి యత్నించాడు. దీంతో తోటి ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గమనించిన విమాన సిబ్బంది ఉస్మాన్‌ని అడ్డుకున్నారు. దీంతో ఆయన వారితో వాగ్వాదానికి దిగారు. ఈలోగా విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉదయం 10 గంటలకు సురక్షితంగా ల్యాండైంది. పైలెట్లు ఈ ఘటనపై ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఏవియేషన్ అసిస్టెంట్ మేనేజర్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఉస్మాన్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. విమానం డోర్ తెరుచుకుంటే పెను ప్రమాదం జరిగేదని ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు. అదృష్టవశాత్తు డోర్ తెరుచుకోకపోవడం వల్ల ముప్పు తప్పిందని చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు చెప్పారు.

నిమ్స్‌లో రోబోటిక్ కిడ్నీ మార్పిడి

» దక్షిణాది ప్రభుత్వ ఆస్పత్రుల్లో తొలిసారి!

» నిమ్స్ వైద్యుల అరుదైన ఘనత

» అభినందించిన మంత్రి దామోదర



రోబోటిక్ కిడ్నీ మార్పిడి చేసిన నిమ్స్ వైద్య బృందం

హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి వైద్యులు రోబోటిక్ కిడ్నీ మార్పిడి ద్వారా ఒక రోగికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. దక్షిణాదిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం ఇదే మొదటిసారి. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయితే రూ.20 లక్షలు ఖర్చయ్యే ఈ చికిత్సను.. నిమ్స్‌లో 'ఆరోగ్యశ్రీ పథకం' కింద పూర్తిగా ఉచితంగా చేయడం విశేషం. బాధితుడు నల్లగొండ జిల్లాకు చెందిన 33 ఏళ్ల యువకుడు. దశాబ్దకాలంగా చివరిదశ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న అతడికి 2017లో ఒకసారి కిడ్నీ మార్పిడి చేశారు. అప్పట్లో ఆయనకు తెలిసినవారి నుంచి కిడ్నీ తీసుకుని ఆయనకు అమర్చారు. కానీ, ఆయన శరీరం దాన్ని తిరస్కరించడంతో రెండోసారి మార్పిడి తప్పనిసరయింది. ఈసారి.. చనిపోయిన వ్యక్తి నుంచి సేకరించిన కిడ్నీని నిమ్స్ యూరాలజిస్టులు ఆయనకు రోబోటిక్ విధానంలో అమర్చారు. ఎంతో క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను సురక్షితంగా నిర్వహించామని.. అతడికి అమర్చిన కిడ్నీ బాగా పనిచేస్తోందని, మూత్రవిసర్జన సాఫీగా జరుగుతోందని, రోగి కోలుకుంటున్నాడని.. చికిత్స విజయవంతమైందనడానికి ఇదే రుజువని నిమ్స్ యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవ్‌రాజ్ తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ రామ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ధీరజ్ ఎస్ఎస్ఎస్ నేతృత్వంలో జరిగిన ఈ రోబోటిక్ కిడ్నీ మార్పిడి ప్రక్రియలో వైద్యులు విద్యాసాగర్, చరణ్‌కుమార్, రామచంద్రయ్య, రఘువీర్, పూవరసన్, సూరజ్‌కుమార్, షారుఖ్, అనంత్, అభిషేక్, అనుపమ, రాకేశ్, మధుసూదన్, నిశాంత్, సృజన్, ఠాగూర్, వేదప్రకాశ్ పాల్గొన్నారు.. నెఫ్రాలజిస్టులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ శ్రీభూషణ్ రాజు, డాక్టర్ స్వర్ణలత రోగికి శస్త్రచికిత్సకు ముందు, తర్వాత అవసరమైన మద్దతు అందించారు. ఈ సర్జరీని విజయవంతంగా నిర్వహించిన వైద్యులను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప ప్రశంసించారు. నిమ్స్ ఆస్పత్రిలో తొలి రోబోటిక్ మూత్రపిండ మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన వైద్యులను ఆరోగ్య మంత్రి దామోదర్ రాజ నరసింహ అభినందించారు.

ఈ ఏడాది ఇప్పటికే 41 కిడ్నీ మార్పిళ్లు

నిమ్స్‌లో రెండేళ్లుగా కిడ్నీ మార్పిడి చికిత్సలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి నెలా 15 నుంచి 20 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే నిమ్స్ యూరాలజీ విభాగం 41 కిడ్నీ మార్పిడి చికిత్సలు చేయడం గమనార్హం. కొవిడ్ కారణంగా 2020లో తప్ప.. గడిచిన దశాబ్దకాలంగా నిమ్స్‌లో ఏటా 100కు పైగా కిడ్నీ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. ఆ ఆస్పత్రిలో ఇప్పటిదాకా 1758 కిడ్నీ మార్పిళ్లు జరిగాయి. ఏటా 11వేలకు పైగా యూరలాజికల్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. కిడ్నీ మార్పిడికి సంబంధించి ఇప్పుడు రోబోటిక్ టెక్నాలజీని కూడా ప్రవేశపెట్టడం వల్ల శస్త్రచికిత్సల కచ్చితత్వం పెరుగడమే కాక.. పేషెంట్లు కోలుకునే సమయం తగ్గుతుందని, మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని డాక్టర్ రాహుల్ తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

వరంగల్ వాసి సుధాకర్ మృతి

ఇతనిపై రూ.25 లక్షల రివార్డ్.. ఇద్దరు అంగరక్షకుల ఎన్‌కౌంటర్

» మరో ఇద్దరు మృతిచెందినట్లు అనుమానాలు

చర్ల/చింతూరు/మడికొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో మారోమారు తుపాకీ గర్జించింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ అంకేశ్వరపు సారయ్య ఉన్నారు. 55 ఏళ్ల వయసున్న సారయ్య స్వస్థలం తెలంగాణలోని వరంగల్ జిల్లా కాజీపేట మండలం తరలాపల్లి. సారయ్య అంగరక్షకులు- పండ్రు ఆత్రా, మన్ను బర్సా కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. మరో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారనే ప్రచారం జరుగుతున్నా.. పోలీసులు నిర్ధారించలేదు. అయితే.. సారయ్య, పండ్రు, మన్ను మృతదేహాలు మాత్రమే లభ్యమైనట్లు తెలిపారు. రెండు జిల్లాలకు చెందిన సుమారు 500 మంది డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించిన సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని, ఘటనాస్థలి నుంచి ఇన్సాస్, 303 రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు దంతేవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. సుధాకర్‌పై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 100 మంది నక్సల్స్ మృతిచెందినట్లు వివరించారు.

వ్యవసాయ కూలి నుంచి..

సారయ్య పదో తరగతి వరకు చదివి.. కొంతకాలం వ్యవసాయ కూలీగా, బావులు తవ్వే కార్మికుడిగా పనిచేశారు. అంకేశ్వరపు ఎల్లమ్మ, వెంకటయ్య దంపతులకు సారయ్య పెద్ద కుమారుడు. ఆయనకు ఒక తమ్ముడు, ఒక చెల్లి ఉన్నారు. వరంగల్ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి ప్రభుత్వ పాఠశాలలో 1982-83లో పదోతరగతి పూర్తిచేసిన సారయ్య ర్యాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ)లో చురుకుగా పాల్గొనేవారు. గ్రామంలో సారా వ్యతిరేక ఉద్యమం, కూలీల కోసం 'చేసిన పనికి తగిన కూలీ' వంటి అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేవారు. భూస్వాముల భూముల్లో ఎర్ర జెండాలు పాతి.. 'దున్నే వాడిదే భూమి' అని ఉద్యమించారని అతని బాల్య స్నేహితులు గుర్తుచేసుకుంటున్నారు. నక్సల్స్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలతో పోలీసులు సారయ్యను 1985లో అరెస్టు చేశారు. 1986లో జైలు నుంచి విడుదలయ్యాక.. వ్యవసాయ కూలీగా.. బావులు తవ్వే కార్మికుడిగా పనిచేవారు. 1991లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆయన సమాచారం కుటుంబ సభ్యులకు తెలియదు. సారయ్య తన సొంత గ్రామానికి తిరిగి రాలేదు. చనిపోయే వరకు కూడా ఆయన బ్రహ్మచారిగా ఉన్నారని.. మావోయిస్టు ఉద్యమంలో అంచెలంచెలుగా ఎదిగి.. దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా సేవలందించారని తెలుస్తోంది. సారయ్య మరణ వార్తతో తరాలపల్లిలో విషాదం నెలకొంది. సారయ్య తండ్రి నాలుగేళ్ల క్రితం, తల్లి మూడేళ్ల క్రితం కన్నుమూశారని గ్రామస్థులు చెప్పారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.